
ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



కీ॥ శే॥ కోటంరాజు పున్నయ్యగారు

4-8-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు






బొంబై ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు సమ్మెచేసి సెక్రిటేరియట్ భవనం ప్రాంగణంలో శాంతంగా బారులుదీర్చి నిల్చున్నప్పటి దృశ్యం.


★


అఖిలభారత పత్రికాసంపాదక సమావేశ సభ్యులకు బొంబై ప్రభుత్వ హోంశాఖామంత్రి విందొనర్చినప్పటి దృశ్యం.

వార్తా విశేషాలు



అమెరికా, వాషింగ్టన్ పట్టణంలో 1935లో స్థాపితమయిన భాండాగారము. ఇది ప్రభుత్వ శాసనాలను, ముఖ్యమైన దస్తావేజులను తదితర ముఖ్యపత్రాలను భద్రంచేసే అమెరికన్ జాతీయ భాండాగార భవనము. ఇక్కడ ఒక్క అమెరికావే కాక తక్కిన ప్రభుత్వాల పత్రాలనుకూడా జీర్ణస్థితిలోనున్న వాటిని చక్కదిద్ది, జాగ్రత్తపరిచి, దేశాలవారీగాను, విషయాలవారీగాను, భద్రం చెయ్యటం తక్కిన రెండు చిత్రాలలోనూ కనబడుతుంది.







గౌ॥ శ్రీ మోహన్లాల్ సాక్సేనాగారు, కాంగ్రెస్ హౌస్‌లో సింధు కాందిశీకులందు, విద్యార్థులు, ఉద్యోగులూ, వ్యాపారులూగా ఉంటూవచ్చిన అన్నివర్గాలవారి కష్టసుఖాలను ఓపికతో వింటున్న దృశ్యం.



శ్రీ. పి. యస్. జి. భూషణరావుగారు,

బి. ఇ, ఎ. యం ఎ. ఇ.

కాకినాడ ఇంజనీరింగు కాలేజీలో అధ్యాపకులు "పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్"లో రెండేండ్లు ఉన్నతవిద్యాభ్యాస మొనర్చుటకు అమెరికాకు వెడుతున్నారు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము 40

సంచిక 47

Founder: K. NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర ఆషాఢ బహుళ చతుర్థి బుధవారము



పనిపాట్లు

ఆంధ్రపత్రిక

1948-వ సం॥ ఆగస్టునెల 4-వ తేది బుధవారము

పున్నయ్యగారు

శ్రీ కోటంరాజు పున్నయ్యగారి మరణము యావద్భారత పత్రికారంగమునకు తీరని లోటు. ఆయన మరణవార్త విని దుఃఖింపని పత్రికారచయిత, ముఖ్యముగా తెలుగుదేశములో నుండడు. ఆంధ్రదేశములో అనేక యువక పత్రికారచయితలు ఆయనను ఒకవిధమైన ఆదర్శప్రాయునిగా నెంచుకొనుచున్నారనుటలో అతిశయోక్తి లేదు. ఎక్కడెక్కడి ఆంధ్రులో ఆయనను చూచి గర్వించెడివారు. శ్రీ చింతామణిగారివలె పత్రికాప్రపంచమున శ్రీ పున్నయ్యగారు ప్రసిద్ధి కెక్కిరి. కాని పున్నయ్యగారితో ఆంధ్రులకున్న సన్నిహితత్వము శ్రీ చింతామణిగారితో నుండెడిది కాదు. దీర్ఘకాలము పరరాష్ట్రమునందే నివసించి తన ప్రతిష్ఠను నిర్మించుకొనినప్పటికిని పున్నయ్యగారిలో ఆంధ్రత్వమన్నది ఎపుడును ఉబుకుచు నుండెడిది. తెలుగువాడంటే పరి ఎక్కడ కనుపడినను ఆయనకు ప్రాణం లేచివచ్చెడిది. ఎంతో ఆప్యాయత ప్రదర్శించెడివాడు. తెలుగువాడవని గర్వించెడివాడు. ఉద్యోగము నుండి విరమించినతరువాత చీరాలలో కాలక్షేపం చేయదలచెను. తాను ప్రసిద్ధ వ్యక్తి నను భావము ఆయనలో ఎపుడునూ కనుపడెడిది కాదు. అదే ఉత్తమ పురుష లక్షణము.

పున్నయ్యగారు ఇప్పుడు క్రమముగా అంతరించిపోవుచున్న సంపాదకుల తరగతికి చెందినవారు. పూర్వము పత్రికాసంపాదకత్వము దేశసంఘసేవావ్యాసంగములో ఒక అంగముగా నుంటూ వచ్చినది. ఇపుడో అదొక వృత్తి. పున్నయ్యగారు గొప్ప పత్రికాసంపాదకుడే గాక గొప్ప సంఘసంస్కర్త. కేవలము బోధన చేయుటే గాక తాను ఆబోధనలను అనుష్ఠించెను.

పున్నయ్యగారి మరణము ఆంధ్రపత్రికకు అతిదుఃఖకరమైన సంగతి. ఆంధ్రపత్రికకు వారు అత్యంత ఆత్మీయులు. వారిపత్రికారచన ఆంధ్రపత్రికయందే ప్రారంభమైనది. ఇప్పటికి 40 సం॥ల క్రితము పంతులుగారు బొంబాయిలో ఆంధ్రపత్రికను స్థాపించి నడుపుచున్న రోజులవి. పున్నయ్యగారు చీరాలనుండి ఉద్యోగాపేక్షతో బొంబాయిలో పంతులుగారిని చూచిరి. పరాయి రాష్ట్రమునకు వెళ్లుటకు సాధారణముగా సంకోచించు ఆంధ్ర యువకుడు అంత దూరము ధైర్యము చేసి వచ్చుట చూచి, ఇతనిలో ఏదో అసాధారణ శక్తి యున్నదని పంతులుగారు వెంటనే పున్నయ్యగారిని దగ్గర చేర్చిరి. పున్నయ్యగారు ఉద్యోగివలెకాక పంతులుగారితోనే వారి ఇంటియందే కుటుంబములో ఒకరుగా ఉండిరి. కొద్ది రోజులైన తరువాత పున్నయ్యగారు పైకము కావలెననిరి. జీత మింత అని ఉభయులు అనుకొనలేదు. ఆంధ్రపత్రిక దినపత్రికగా చెన్నపట్టణము వచ్చిన తరువాత కూడ కొన్ని సంవత్సరములు సంపాదకవర్గములో పని చేసిరి. "నే నెక్కడ ఉన్నా ఆంధ్రపత్రిక మనిషినే", "నాగేశ్వరరావు పంతులువంటి వ్యక్తిని మనము మరల చూడబోము" అంటూ ఉండెడివారు.

దేశవిభజన అనేకలక్షలమంది జీవితములను పాడుచేసినట్లే పున్నయ్యగారి జీవితమునకును హానికరమైనది 27 సంవత్సరములు సింధురాష్ట్రమునకు తలమానికము అయిన "సింధు అబ్జర్వరు" పత్రికను అసాధారణ ప్రతిభతో ఆయన నడిపెను. వాస్తవమునకు దాని గొప్పతనమునకు ఆయన కృషే కారణమని చెప్పవలెను. ఆ రాష్ట్రములో ప్రముఖ వ్యక్తులలో ఒకడుగా ప్రసిద్ధి కెక్కెను. పున్నయ్యపూర్ అని ఆయన పేర కరాచీ నగరములో ఒక పేట నిర్మింపబడెను. కాని దేశవిభజన ఫలితముగా ఏర్పడిన, పరిస్థితి ననుసరించి గృహమును ఉద్యోగమును వదలి రావలసివచ్చెను. అంతేగాక ఆయన కుటుంబములో ఒకటివెంట ఒకటి అవాంతరములు సంభవించినవి. అల్లుడు, ఒక కుమారుడు విమానప్రమాదములో మరణించిరి. మరొక కుమారుడు, మనుమడు కొద్ది నెలలక్రితమే మైసూరునందు జలగండమునకు లోనైరి. ఇన్ని విషాదసంఘటనలకు లోనైనను తన సహజ ఆధ్యాత్మిక తత్వముతో ధృతి చెడక నిలువగలిగెను. దిగులులో క్రుంగిపోయిన భార్యఆరోగ్యమునకు మంచిదని బెంగుళూరునందు కాలము గడుపుచూ వచ్చెను. పూర్వమిత్రులందరు కనుపడెదరను ఆశతో అ. భా. పత్రికా సంపాదకుల సభకు బొంబాయికి వచ్చెను. మిత్రులందరిని కలిసికొనెను. సింధురాష్ట్రమునుండి వచ్చిన కాందిశీకులు బొంబాయిలో పత్రికను స్థాపించెదమని, దానికి సంపాదకుడుగా నుండవలసిన దని కోరిరి. కాని "ఇంత దుఃఖమునకు లోనయిన నాకు ఇంకా పత్రికా సంపాదకత్వ మేమిటి! జీవితంలో ఉత్సాహం లేదు, నా కక్కరలేదని చెప్పాను." అని గత సోమవారం రాత్రి 10-30 గం. లకు చెప్పిరి. ఆమరునాడు ఈ విషాద మరణం జరుగునని ఎవరు ఊహించిరి! విధివిధానము ఎవరికి తెలియును! వారి సతీమణి తారాబాయి గారికి మా సానుభూతి. జీవితమను మహావృక్షమునుండి ఒక పండు రాలిపోయినది. ఆతనికి గౌరవ వందనములు. ఆయన ఆత్మ శాంతి పొందునుగాక.

కామన్సులో హైదరాబాద్ చర్చ

బ్రిటనులో నైజాము ఏజంట్లు, అభిమానులు సాధించగలిగినది, హైదరాబాదు సమస్యనుగురించి కామన్సు సభలో రెండుగంటలు చర్చ తప్ప మరి లేదు. నైజాము బ్రిటిషు రాజునకు ప్రత్యేకముగా లేఖకూడ వ్రాసిన వార్త, సర్ వాల్టర్ మాంక్టన్ కార్యదర్శి సామానులను, భారత ప్రభుత్వ కస్టమ్సు అధికారులు పరిశీలించగా ధ్రువపడినది. జార్జిరాజునకు ఉత్తరము వ్రాయుటవల్ల సిద్ధించగల దేమిటో ఆయనకే బోధపడవలెను గాని ఇతరులకు బోధపడదు. బ్రిటిషు రాజు రాజ్యాధిపత్యము కేవలము నామమాత్రమని, పరిపాలన యావత్తు ఆయన మంత్రివర్గమే నడిపించు నన్న విషయము నైజాము మరచినట్లున్నది. తన అధికారపరిమితిని, బ్రిటిషు రాజు అధికారపరిమితినికూడ ఆయన గమనించినట్లులేదు. కాకపోయిన ఉభయుల స్థితిని పనివేళ గుర్తింపదలచలేదేమో?

కన్సర్వేటివు నాయకుడు చర్చిలు లేవదీసిన చర్చకు బ్రిటిషు ప్రభుత్వపక్షమున ప్రధాని అట్లీ ఇచ్చిన సమాధానము ఒక అంశమును స్పష్టము చేసినది. హైదరాబాద్ స్వతంత్ర రాజ్యముగా పరిగణింపబడజాల దని ఆయన చెప్పెను. కనీసము యధాతధ ఒడంబడిక అమలునందున్నంతవరకు అలా పరిగణించుటకు వీలులేదు. యధాతధ ఒడంబడిక ననుసరించి హైదరాబాద్ విదేశవ్యవహారములు భారతప్రభుత్వవశమైనవి. అందువల్ల నైజాము జార్జిరాజునకు లేఖ వ్రాయుటకు వీలు లేదు. ఒకవేళ వ్రాయదలచినప్పటికి అది భారతప్రభుత్వము ద్వారానే పంపవలసియున్నది. కాబట్టి హైదరాబాద్ సమస్యను ఐక్యరాజ్యసమితి పరిష్కారమునకు బ్రిటను సూచించుట యనునది లేదు. బ్రిటిషుప్రభుత్వము మధ్యవర్తిత్వపాత్ర వహించుటకుకూడ సిద్ధముగ లేదని తెలిపెను.

హైదరాబాద్ సమస్య కనుక ఐక్యరాజ్యసమితిలో వచ్చిన బ్రిటిషు ప్రభుత్వవైఖరి ఎటు లుండునో వివరించుట అవసర మని చర్చిలుగారనిరి. ప్రధాని అట్లీ ఈ ప్రశ్నను, "అయితే గియితే" అన్నదానిగ వర్ణించి, కాశ్మీర్ విషయమున నిష్పాక్షికముగ వ్యవహరించినట్లే హైదరాబాద్ ఎడకూడ వ్యవహరించెదమని సమాధాన మిచ్చిరి. కాశ్మీర్ సమస్యపట్ల ఐక్యరాజ్య సమితియందు బ్రిటను వహించిన వైఖరి స్తుతింపదగినదిగ లేదని అందరూ ఎరిగిన సంగతే. కాకపోతే కాశ్మీరులో ప్లెబిసైట్‌ను అమలు జరుపుటకు అంగీకరించినట్లే హైదరాబాదులోకూడ ప్లెబిసైటు ఏర్పాటు చేయుటకు తాము సూచించదలచినట్లు అట్లీగారు వ్యక్తపరచిరి. భారత స్వాతంత్ర్య ప్రదాన చట్టమునుగురించి కామన్సు సభలో చర్చ జరిగినపుడు విదేశవ్యవహారములకు సంబంధించినంతవరకు ఏదో ఒక అధినివేశముద్వారా కాక స్వతంత్రించి వ్యవహారము జరుపుటకు వీలు లేదని బ్రిటిషు అటర్నీ జనరల్ విస్పష్టము చేసెను. ఆయన ప్రకటన ననుసరించి యధాతధ ఒడంబడిక అనునది లేకపోయినప్పటికీ హైదరాబాద్‌కు విదేశ వ్యవహారములందు స్వాతంత్ర్య మనునది లేదని చెప్పవలసియున్నది. అది లేనపుడు తనకు తానై ఐక్యరాజ్య సమితికి విజ్ఞప్తిచేయుటకు వీలులేదు. ఒకవేళ చేసినను భారత ప్రభుత్వము దానిని లెక్కచేయదు' చేయ అవసరమూ లేదు.

యధాతధ ఒడంబడిక రాబోవు నవంబరు మాసముతో అంతము కానున్నది. దాని తదనంతరము నైజాము స్వాతంత్ర్యమును ప్రకటించునా అను ప్రశ్న రావచ్చును. బ్రిటిషు సార్వభౌమత్వము భారతప్రభుత్వము పరము కాదని 1946 మే ప్రకటన తెలిపినది. అయినప్పటికీకూడ హైదరాబాద్, భారత ప్రభుత్వ సంబంధములు అదివరకు బ్రిటను హైదరాబాదు కున్న సంబంధము లున్నరీతినే యుండునని సర్దార్ వల్లభాయి పటేల్ కేంద్రశాసన సభలో తెలిపెను. యధాతధ ఒడంబడిక అనుటలోనే ఆ అర్థము స్ఫురించుచున్నది. దీని వ్యవధి ముగియునాటికి హైదరాబాద్ భారతయూనియన్‌లో చేరవలెనను భావముతోనే ఈ ఒడంబడికకు భారత ప్రభుత్వము అంగీకరించినది. మౌంట్‌బాటన్ ప్రభువుకు, నైజాముకు అపుడు జరిగిన ఉత్తర ప్రత్యుత్తరములనుబట్టి ఆ విషయము వ్యక్తము

నేటిప్రపంచం:

అస్త్రసన్న్యాససమస్య: ఐక్యరాజ్యసమితి కృషివైఫల్యం



మాలటోవ్

వివిధదేశాల ఆయుధబల ప్రమాణాన్ని పరిమితం చేయాలనే ప్రయత్నాన్నే ఐక్యరాజ్యసమితి ప్రస్తుతానికి విరమించుకున్నది. ఈ విషయంలో ఇప్పటికి దాదాపు రెండు సంవత్సరాల నుంచీ జరుగుతున్న చర్చలు, చేస్తున్న ప్రయత్నాలు అన్నీ విఫలమైపోయిన వన్న మాట. ఆయుధ పరిమాణాన్ని తగ్గించే విషయమై ఒక పథకం తయారు చేయడానికి ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సంఘాన్ని ఇదివరలో ఏర్పాటు చేసింది. ఈ సంఘం తాలూకు కార్యవర్గం లేక్‌సక్సెస్‌లో ఈ వారం ప్రారంభంలో సమావేశమై ఆయుధ పరిమాణాన్ని తగ్గించడానికి ఇంకా ప్రయత్నించడంలో ప్రయోజనమేమీ లేదని తీర్మానించింది. ప్రపంచంలో యుద్ధ ప్రమాదం లేదని గట్టి నమ్మకం ఏర్పడి నప్పుడుగాని వివిధదేశాలు ఆయుధబలాలను, సైనిక బలాలను తగ్గించడానికి ఒప్పుకోవనీ, అప్పటి వరకు ఆయుధ బలాలను పరిమితం చేయడానికి జరిగే ప్రయత్నాలు ఫలించడం అసంభవమనీ ఈ కార్యవర్గ సమావేశంలో బ్రిటిష్ ప్రతినిధి ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు; రష్యా, యుక్రేన్ ప్రతినిధులు తప్ప మిగతావారందరూ బ్రిటిష్ ప్రతిపాదనకు సమ్మతించారు. సైనికోద్వాసన చెప్పి ఆయుధ పరిమాణాన్ని తగ్గించడానికి ముందు, పరమాణుశక్తి మీద అంతర్జాతీయ ఆధిపత్యం ఏర్పడాలనీ, పరమాణుశక్తి కంట్రోలు నియమాలను ఏ దేశమూ వుల్లంఘించకుండా చూడడానికి తగిన రక్షణ, తనిఖీ సౌకర్యాలు ఏర్పడాలనీ, జర్మనీ, జపానలతో శాంతి ఒడంబడికలు కుదరాలనీ, ఈ ఏర్పాట్లన్నీ జరగందే ఆయుధ బలాలను తగ్గించాలనే ఆశయం ఫలించదనీ బ్రిటన్ ప్రతిపాదించింది. వివిధదేశాలలో ఆయుధ బలాలను ముందుగా పరిమితం చేసివేస్తేగాని, ప్రపంచానికి యుద్ధోపద్రవం లేదనే నమ్మకం ఏర్పడదనీ, దాని అమలుకు అణ్వస్త్రాల ఇతర అధునాతన మారణాస్త్రాల ఉత్పత్తిని నిషేధించాలనీ, ఇప్పుడున్న అణ్వస్త్రాలను పూర్తిగా నాశనం చేసివేయాలనీ మరొక తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ బ్రిటిష్ తీర్మానాన్ని రష్యా, యుక్రేనులు ప్రతిఘటించినవి.

ఆయుధ సైనికబలాలను పరిమితం చేసే కార్యక్రమం విఫలమైనందుకు బ్రిటన్ ప్రతిపాదించిన తీర్మానాన్నిగాని, దాన్ని రష్యా ప్రతిఘటించడాన్నిగాని చూసి ఎవరూ ఆశ్చర్యపడనవసరం లేదు. ప్రస్తుతం ప్రపంచాన్ని బాధిస్తున్న ఏ ఒక్క సమస్యను పరిశీలించినా మరొక యుద్ధం అనివార్యమేనని వ్యక్తపడుతుంది. ప్రపంచ దేశాలు ముఖ్యంగా అగ్రరాజ్యాలు రాజకీయరంగంలో ఎత్తులు ఎదురెత్తులువేస్తూ ప్రపంచాన్ని రెండు కూటాలుగా చీల్చి మరొక ఘోర ఉపద్రవాన్ని తెచ్చిపెడుతున్నవి. బర్లిన్, పాలస్తీనా సమస్యల పర్యవసానం ఏవిధంగా పరిణమిస్తుందో ఎవరు చెప్పగలరు? ప్రపంచశాంతి స్థాపనార్థం ప్రథమ సంగ్రామానంతరం ఏర్పడిన అంతర్జాతీయసమితి వివిధ దేశాల ఆయుధసైనిక బలాలను పరిమితంచేయడానికి తీవ్రకృషినే చేసి, విఫలమైంది. 1932 ఫిబ్రవరిలో జరిగిన ప్రపంచ అస్త్రసన్న్యాస సమావేశమే ఇందుకు నిదర్శనం. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం శాంతిస్థాపనకై ఏర్పడిన ఐక్యరాజ్యసమితికృషికికూడా సరిగా అదే గతి పట్టింది. బ్రిటన్ ప్రతిపాదించినట్లు మరొక యుద్ధప్రమాదం లేదని దృఢ విశ్వాసం ఏర్పడినప్పుడుగాని, అస్త్రసన్న్యాస కార్యక్రమాలు కొంతవరకైనా ఫలించవు. అంతర్జాతీయ పరిస్థితి ఈనాడున్నంత ప్రమాదభూయిష్టంగా ఇదివరకెన్నడూ లేదు. ఇట్టి పరిస్థితులలో ఆయుధ బలాలను పరిమితం చేయాలనే ఏ ప్రతిపాదనైనా విఫలంకాక తప్పదు.

ఏటంబాంబు తాతలలాంటి ఆధునిక మారణాస్త్రాలను తాము తయారుచేశామనీ, ఏటంబాంబు నిర్మాణరహస్యం ఒక రహస్యమే కాదనీ రష్యా చెప్పుకుంటున్నప్పటికీ అమెరికా సాగిస్తున్న ఏటం బాంబు నిర్మాణాన్ని తలుచుకుంటే రష్యా భయపడుతున్నమాట వాస్తవమని అస్త్రసన్న్యాస సంఘ కార్యవర్గ సమావేశంలో సోవియెట్ ప్రతినిధి చేసిన తీర్మానాన్నిబట్టి ఎవరికైనా తోచకమానదు. అన్యరాజ్యాలలో జరుగుతున్న మారణాస్త్ర నిర్మాణాలను అరికట్టాలనీ, వాటిని పరిశీలించి తనిఖీచేస్తుండాలనీ రష్యా ఉద్దేశం; ఐతే తన అంగబలవివరాలను, ఆయుధ బల వివరాలను మాత్రం రష్యా మిగతా ప్రపంచానికి తెలియనివ్వడానికి ఇష్టపడడంలేదు. రష్యా ఉద్దేశాలను మిగతా అగ్రరాజ్యాలు, మిగతా అగ్రరాజ్యాల భావాలను రష్యా అనుమానిస్తున్నంతకాలం పరమాణుశక్తి కంట్రోల్ సమస్యగాని, అస్త్రసన్న్యాస సమస్యగాని సామరస్యంతో పరిష్కారం కావడం కల్ల.

బర్లిన్ సమస్యపై జూలై నెలాఖరున కామన్సు సభలో బ్రిటిష్ విదేశమంత్రి ఎర్నెస్ట్ బెవిన్ చేసిన ప్రకటన నేటి ప్రపంచ పరిస్థితి ఎంత ప్రమాదకరంగా వున్నదో స్పష్టపరచింది.

"బర్లిన్ సమస్య ఫలితంగా ఉత్పన్నమైన వివిధ క్లిష్టపరిస్థితులనూ మేము జాగరూకతతో గమనిస్తూనే వున్నాము. వీటిని ఏవిధంగానైనా పరిష్కరించుకుందామనే ప్రయత్నిస్తూ వచ్చాము. తామాక్రమించిన పశ్చిమ బర్లిన్ భాగాలలో పశ్చిమరాజ్యాలు తమ ప్రత్యేక కరెన్సీని చెలామణిలోకి తెచ్చినందుననే ఈ క్లిష్టస్థితి ఏర్పడినట్లు రష్యా ఆరోపిస్తున్నది. ఇదే వాస్తవమయినట్లయితే, రష్యాతో సంప్రతించి పరిష్కరించుకోడానికి మా ప్రతినిధులు సర్వదా సంసిద్ధులయే వున్నారు. నాల్గు రాజ్యాల ఆధ్వర్యంక్రింద ఒకే ఒక పద్ధతిలో సోవియెట్ ద్రవ్య చెలామణిని బర్లిన్‌లో ప్రవేశపెట్టడానికైనా బ్రిటిష్‌ప్రభుత్వానికి ఏవిధమైన అభ్యంతరమూ లేదు.. ద్వితీయ ప్రపంచసంగ్రామంలో మన మిత్రరాజ్యంగా వున్న రష్యా నేడు అనుసరిస్తున్న విధానంవల్ల ఇంతటి క్లిష్టస్థితి ఏర్పడుతుందని ఎన్నడూ మనం అనుకోలేదు. ఈనాడు ఏర్పడిన క్లిష్టపరిస్థితి కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం తన విధానాన్నే పూర్తిగా పునఃపరిశీలన చేసుకోవలసివచ్చింది. యుద్ధం సమాప్తమైనప్పటినుంచి బ్రిటిష్‌ప్రభుత్వం నెలఒకటికి 20 వేలమంది సైనికులకు ఉద్వాసన చెబుతూ శాంతి సమయ ఆర్థికవ్యవస్థాస్థాపనకు పూనుకుంటూవుంది. ఈ సైనికోద్వాసన కార్యక్రమాన్ని ఆపివేసి, సైనికబలాలు తగ్గకుండా చూసుకోవడం అవసరమేమో బ్రిటిష్ ప్రభుత్వం ప్రస్తుతం ఆలోచిస్తున్నది. ఇంతేకాదు; బర్లిన్ సమస్యా పరిష్కారానికి బలప్రయోగానికి సైతం ఉపక్రమించవలసినా రావచ్చు. అంతేగాని, రష్యా పెడుతున్న వత్తిడికి లొంగేమాటమాత్రం కల్ల," అని బ్రిటిషు విదేశమంత్రి ఎర్నెస్టు బెవిన్ కామన్సు సభలో బర్లిన్ సమస్యపై తీవ్రమైన హెచ్చరిక చేశాడు. బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ ప్రతినిధులు లండనులో సంప్రతింపులు జరిపి, బర్లిన్ సమస్యపై రష్యాతో చర్చించడానికి నిర్ణయించినట్లు కూడా బెవిన్ అన్నాడు.

బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్ ప్రతినిధులు ముగ్గురూ మార్షల్ స్టాలిన్‌తో బర్లిన్ సమస్యపై ముఖాముఖి చర్చలు జరపాలనీ, ఇందుకు ప్రాతిపదికగా మాస్కోలోని పై మూడు రాజ్యాల రాయబారులు సోవియెట్ విదేశమంత్రి మోలటోవ్‌తో తొలిసంప్రతింపులు జరపాలనీ లండన్‌లో మూడు అగ్రరాజ్యాలు నిర్ణయించినట్లు వార్తలు వచ్చినవి. బ్రిటిషు, ఫ్రెంచి, అమెరికన్ ప్రతినిధులు మోలటోవ్‌తో ఏ అంశాలపై చర్చ జరపవలసిందీ ఒక పట్టీని తయారుచేశారు; మోలటోవ్‌తో చర్చలు పూర్తిఅయినతర్వాత జనరలిసిమో స్టాలిన్‌తో ఏయే అంశాలను తాము చర్చించదలచిందీ కూడా స్పష్టపరుచుకున్నారు. ఈ నిర్ణయాల ప్రకారం బర్లిన్ ప్రతిష్టంభనపై మోలటోవ్‌తో సంప్రతిద్దామని బ్రిటిష్, అమెరికన్ ప్రతినిధులు మాస్కో చేరేసరికి సోవియెట్ విదేశమంత్రి రష్యా రాజధానిలో లేడనీ, ఎక్కడికో వెళ్లాడనీ, రష్యా విదేశశాఖ ఒక అధికార ప్రకటన చేసింది. ఒక్క మోలటోవ్ మాత్రమేగాక రష్యా విదేశశాఖ సహాయమంత్రి ఆండ్రీ విషిన్‌స్కీ కూడా మాస్కోలో లేడని రష్యన్ ప్రకటన స్పష్టపరచింది. బర్లిన్ ప్రతిష్టంభనపై సామరస్యంతో సంప్రతింపులు జరుపుదామనుకున్న బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులకు ఇది తీవ్రఆశాభంగం కలిగించడమేగాక, లండన్, పారిస్ నగరాలలో రకరకాల ఊహాగానానికి సైతం దారితీసింది. మోలటోవ్ మాస్కోలో లేకపోవడం కాకతాళీయంగా జరిగింది కాదనీ, బుద్ధిపూర్వకంగా, 'రాజకీయంగా' ముఖం చాటుచేశాడనీ లండన్ రాజకీయవర్గాలు అభిప్రాయపడినవి. ఇది పశ్చిమ రాజ్యాలను అవమానపరచడానికి రష్యా వేసిన ఎత్తేననీ, బర్లిన్ ప్రతిష్టంభనను రష్యా తన ఇష్టప్రకారం, తను శాసించేపద్ధతిలోనే పరిష్కరించడానికి ఈ ఎత్తు వేసిందనీకూడ లండన్ వర్గాలవారు వ్యాఖ్యానించారు. పశ్చిమరాజ్య ప్రతినిధులతో బర్లిన్ సమస్యపై సంప్రతించడానికి రష్యా ఇష్టపడడంలేదని మోలటోవ్

(21 వ పేజీ చూడుడు)

కాగలదు. యథాతథ ఒడంబడిక కాల పరిమితి పూర్తి యగులోపల హైదరాబాద్ భారతయూనియన్‌లో చేరవలసియున్నది. అలా చేరక నవంబరువరకు కాలయాపన చేసి స్వతంత్రత ప్రకటించుటకు నైజాము ఆలోచించుచుండవచ్చును. ఆ ఉద్దేశముతోనే అప్పుడపుడు భారతప్రభుత్వముతో రాయబారము సాగించుచుండవచ్చును. అయితే నైజాముప్రభుత్వము, ఒకఅంశమును గమనించినట్లులేదు. యథాతథ ఒడంబడికను ఏ పక్షమునూ ఇంతవరకు రద్దుచేయలేదు. అది నైజాము సర్వస్వతంత్ర ప్రతిపత్తికి ఎంతనిరోధకముగానున్నదో భారత ప్రభుత్వము తీవ్రచర్య తీసికొనుటకు అంత ప్రతిబంధకముగానే యున్నది. ఆ ఒప్పందము లేనియెడల రజాకార్లను సంస్థానములో కొంతదూరము వెంటాడుటకు బదులు పూర్తిగా వెంబడించియుందురు. నవంబరులోపల కనుక నైజాము తన వైఖరిని మార్చుకొని రజాకార్ల దురంతములను నిలుపుదల చేయకపోయిన, భారత ప్రభుత్వము ప్రమాదపరిస్థితి ఏర్పడినదని ప్రకటించి తన సైన్యములను సంస్థానములలోనికి నడుపవలసియుండును. దేశమునకు నడుమ అశాంతిని కలుగజేయు ప్రదేశమున ప్రవేశింపక ఊరుకొనజాలదు. మౌంట్ బాటన్ సూచనలు ఆతనితోనే పోయినవని, అన్నిసంస్థానములతోబాటు హైదరాబాద్ యూనియన్‌లో చేరవలెనని సర్దార్ పటేల్ హెచ్చరించెను. అలా చేరకపోయిన సంస్థానమనునదే ఉండదని ప్రధాని నెహ్రూ హెచ్చరించెను. ఇంతకన్న విస్పష్టముగ చెప్పనవసరము లేదు. తిరిగి రాయబారముల ప్రారంభించుటకు భారత ప్రభుత్వము అంగీకరించకపోవుటలో ఆశ్చర్యము లేదు. ఒకవంక దేనికైనా సిద్ధమని ప్రగల్భములు పలుకుచు రజాకార్ల దుండగములను ప్రోత్సహించుచు, మరొకవంక రాయబారముల జరుపజూచుట విశ్వసింపదగినదికాదు. సర్ మీర్జా ఇస్మాయిల్ రాజప్రయత్నములు, భారత ప్రభుత్వ అధికారి చెప్పినట్లు, "తాము శాంతిప్రదమైన ఒప్పందమునకు ఆతురతతో నున్నామని ప్రపంచమును మభ్యపెట్టుటకు చేసిన పన్నాగము!" గౌరవప్రదమైన ఒప్పందము చేసికొనవలెనని నిజముగాకోరిన మౌంట్ బాటన్ ప్రణాళికను ఆమోదించియుందురు. అందుపైగా తమ ప్రతినిధి వర్గము, రాజ్యాంగ సలహాదారుడు, అంగీకరించిన తరువాత కూడ తిరస్కరించెను. అదీకాక ఇంతవరకు ఊరుకొని, తీరా బ్రిటిషు కామన్సు సభలో చర్చ జరుగనున్న సమయము చూసి రాయబారిని పంపుట సహృదయతకు నిదర్శనము కాదు. పూర్వ అనుభవమునుబట్టి నైజామే ఢిల్లీకి వచ్చి రాయబారములను నడపి ఒప్పందము చేసికొనవలెనని భారత ప్రభుత్వ మనుటలో అర్థము లేకపోలేదు. మరి ఇతరులెవరైనా వచ్చి ఒప్పందము చేసికొనినప్పటికీ నైజాము ఆమోదించునని నమ్మకము లేదు. ఢిల్లీలో మౌంట్ బాటన్ పథకమును అంగీకరించిన హైదరాబాద్ ప్రధాని లాయకాలీ యథాస్థానముననే ఉండి, భారతప్రభుత్వమును నిందించుట వారికి అసందర్భముగ తోచుటలేదు. కాబట్టి ప్రస్తుత ప్రభుత్వము మారితేనే నిజాంతో సంప్రతింపులు జరుపడమగునని భారత ప్రభుత్వము సూచించిన, అందు అసహజమేమీ లేదు.



౨౭

బజరోవ్ తిరిగి వచ్చినందుకు, అతని ముసలి తల్లిదండ్రులు మరింత సంతోషించారు—ఎందుకంటే, అతడు అనుకోకుండా వచ్చాడు. అరినా వ్లాసీవ్నాకి ఆందోళన మరీ ఎక్కువయిపోయింది. వాసిలీ ఇవానోవిచ్ ఆమెను 'పిల్లకోడి' అని వేళాకోళం చేశాడు ఆమె తొడుక్కున్న పొట్టికోటు, వెనక చిన్న తోకలా ఎత్తి పెట్టుకుని, పక్షిలాంటి ఆకారాన్ని కొంత ఆమెకు ఆపాదించినది. అతనుమట్టుకు అతను, తన పొగగొట్టంచివర కొరుకుతూ, కరకరలాడిస్తూ కూర్చునే వాడు. ఒక్కొక్కప్పుడు మెడని రెండు చేతులతోనూ పట్టుకుని ఇటూ అటూ తిప్పి చూసుకునేవాడు—అది సరిగా తన వెన్నెముకమీద అని ఉందో లేదోనని. చటుక్కుని ఉన్నట్టుండి, తన పెద్దనోరు తెరచి నిశ్శబ్దంగా నవ్వుకొనేవాడు. "ఆరు వారాలు పూర్తిగా ఉండిపోదామని వచ్చాను నాన్నా", అన్నాడు బజరోవ్. "నాకు పని చేసుకోవాలని ఉంది. అందుచేత నాకు అడ్డు తగలకు."

"నాముఖం కనిపిస్తే అడుగు, నేను రావడమే అడ్డమయితే !" అన్నాడు వాసిలీ ఇవానోవిచ్.

అతను తనమాట నిలబెట్టుకున్నాడు. తన పఠన మందిరం అతని కిచ్చి, తను కనబడకుండా అవతలకి వెళ్ళిపోయాడు. తన భార్యనికూడా అనవసరమయిన ప్రేమప్రదర్శనాలు చెయ్యకుండా వారించాడు. "చూశావూ, ఎన్యూషా ఇదివరకు వచ్చినప్పుడు మనం కొంచెం విసుగుపుట్టించాం," అతను ఆమెతో అన్నాడు. "ఈ సారి కొంచెం జాగ్రత్తగా మసులుకోవాలి" అరినావ్లాసీవ్నా తన భర్త చెప్పినవన్నీ ఒప్పుకుంది. కానీ ఆమెకు ఇది తృప్తిగా లేదు. అతను ఒక్క భోజనాల సమయంలోనే ఆమెకు కనబడుతున్నాడు. అతన్ని పిలవడానికికూడా ఆమెకు భయంగా ఉంది. అప్పుడప్పుడు సాహసించి, "ఎన్యూషెంకా !" అంటుంది. అతను ఆమెవేపు తిరిగే లోగానే తనచీర అంచుని చేతికి చుట్టుకుంటూ "ఏమీ లేదు, ఫరవాలేదు. ఏదో..." అంటుంది. తరవాత వాసిలీ ఇవానోవిచ్ దగ్గరకు వెళ్ళి అరచేతిమీద చెక్కు ఆన్చి నిలబడి అడుగుతుంది: "నువ్వు కాస్త వెళ్ళి, జాగ్రత్తగా ఎన్యూషా ఈవేళ భోజనంలోకి ఏం చెయ్యమంటాడో కనుక్కుంటే బాగుండును." "నువ్వే ఎందుకు అడక్కూడదు ?" "అబ్బే! వాడికి నేనంటే ఇంక అసహ్యం వేస్తుంది" బజరోవ్ క్రమంగా గదిలో తలుపుమూసుకుని కూర్చోడం తగ్గించాడు, పనియందు శ్రద్ధ తగ్గిపోయింది. అర్థంలేని అలజడి, నీరసమయిన విసుగెత్తే బద్ధకం మనస్సుని పట్టుకున్నాయి. ఒక వింత అలసత అతని కదలికలలో వ్యక్తమవడం ప్రారంభించింది. నిటాగ్గా, దృఢంగా, సాహసంగా ఉండే అతని నడకకూడా మారిపోయింది. ఒంటరిగా తిరగడం తగ్గించి నలుగురితో కలవడం ప్రారంభించాడు. వంట ఇంటివెనక పాదులు పెట్టినచోట వాసిలీ ఇవానోవిచ్‌తో పచారుచేస్తూ మౌనంగా పొగ తాగుతూ గడిపేవాడు. ఫాదర్ అలెక్సీని గురించికూడా ఒకసారి అడిగాడు. వాసిలీ ఇవానోవిచ్‌కి మొదట్లో ఈ మార్పు బాగానే కనిపించింది. కాని త్వరలోనే అతను సందిగ్ధంలో పడ్డాడు. "ఎన్యూషాని చూస్తే నాకు గుండె చెరువయిపోతుంది," అని రహస్యంగా భార్యతో అన్నాడు. "అసహనంగా, కోపంగా ఉన్నాడని కాదు. అల్లా ఉన్నా ఫరవాలేదు. విచారంగా బరువుగా ఉన్నాడు—అదీ అసలు ప్రమాదం. మౌనంగా ఉంటున్నాడు. మనని పట్టుకు తిట్టినా బాగుండును. చిక్కిపోతున్నాడు. రంగు వాడిపోతోంది." "భగవంతుడి దయ," అంది ఆ ముసలితల్లి, "మెడలో రక్షరేకు కడితే బాగుండును. కాని కట్టనివ్వడు." వాసిలీ ఇవానోవిచ్ అతని కృషిని గురించీ, ఆరోగ్యాన్ని గురించీ, ఆర్కాడీనిగురించీ అప్పుడప్పుడు చాలా డొంక తిరుగుడు పద్ధతిగా ప్రశ్నలు వేస్తుండే వాడు...బజరోవ్ సమాధానాలు ముక్తసరిగా అయిష్టాన్ని సూచిస్తూ ఉండేవి. సంభాషణలో తన తండ్రి ఏదో విషయానికి దారి తీస్తున్నట్టు గ్రహించి బజరోవ్ చిరాకుగా అన్నాడు. "ఎందుకల్లా అస్తమానం నన్ను రహస్యంగా చూస్తూ తిరుగుతున్నట్టుంటావు? ఇదివరకుకంటే ఇదిమరీ అసహ్యంగా ఉంది" "అబ్బే! ఏమీ లేదురా!" అనేవాడు పాపం వాసిలీ ఇవానోవిచ్. అతని ప్రయత్నాలన్నీ విఫలమయిపోయాయి. ఒకనాడు తన కొడుకు సానుభూతిని సంపాదించడానికి వాసిలీ ఇవానోవిచ్ సంభాషణలో, రాబోయేయుగంలో రైతుల మంచి దశనుగురించీ, అభ్యుదయాన్ని గురించీ ఏదో అన్నాడు. బజరోవ్ నిర్లక్ష్యంగా అన్నాడు: "నిన్న కోరడుపక్కనించి నడిచి వెడుతుంటే ఒక రైతు కుర్రవాడు ఒక పాట పాడుతున్నాడు. అది జానపదగీతం ఏదీ కాదు. ఇప్పుడు బాగా ప్రచారంలోకి వస్తూన్న సినీమా పాట ఏదో. అంతే అభ్యుదయమంటే."

అప్పుడప్పుడు బజరోవ్ ఊరిలో తిరిగి వస్తూండేవాడు. అపహాస్యంతో కూడుకున్న తన సహజధోరణిలో ఎవరో రైతుతో అనేవాడు: "తమ్ముడూ! జీవితాన్ని గురించి నీ భావాలేమిటో నాకు కాస్త వివరించు: చూశావూ, వాళ్ళంతా ఏమంటారో, రష్యాదేశపుభావి, సౌభాగ్యం నీ చేతుల్లో ఉందంటారు. మీతో చరిత్రలో ఒక కొత్త యుగం ప్రారంభమవుతుందట. మీరేనట మా అసలు భాషని మాకు నేర్పేది, మమ్మల్ని పరిపాలించడానికి చట్టాలు చేసేదీని."

రైతు సామాన్యంగా దీనికేమీ జవాబు చెప్పేవాడు కాడు. ఏదో ఇటూఅటూ కాకుండా నసిగేవాడు..."చిత్తం! ఏదో...ప్రయత్నం...ఎంచేతంటే...చూశారూ...నిజంగా..."

"అయితేనూ, మీ రేదో మిర్ అంటారే, అదేదో కాస్త నాకు తెలియచెపుదూ" బజరోవ్ మళ్ళీ అడిగేవాడు, ఈ మిర్, ఏవో మూడు చేపలమీద నిలబడి ఉందంటారు, అదేనా ?"

"బాబుగారూ! అది భూమి బాబూ, ఆ మూడుచేపలమీద నిలబడి ఉండేది," ఆ రైతు మృదువుగా జవాబు చెపుతాడు, అతని గొంతుకలో ఆ భూస్వామ్య పద్ధతి తాలూకు అమాయకత్వం మోగుతుంటుంది, "తరవాతనండి, ఈ మిర్ అంటారే, అందులోనండి, యజమాని అధికారం బాబూ అంతాను. అందుకోసమే మీరు మాకు బాబుగా రయారు, యజమాని అధికారం ఎంత ఎక్కువయితే అంత మంచిదిబాబూ రైతుకి."

అల్లాంటి జవాబు విని ఒక రోజుని బజరోవ్ అసహ్యంతో భుజాలు ముడుచుకుని వెళ్ళిపోయాడు. ఆ రైతు తన ఇంటిదారి పట్టాడు మెల్లగా.

ఇంకో రైతు నడివయస్సులో ఉన్నవాడు, తన గుడిసెగుమ్మంలో నిలబడి ఇదంతా చూస్తూన్నాడు. అతను మొదటిరైతుని అడిగాడు, "ఏమిటి అంటున్నాడు, పాతబాకీలా?"

"పాతబకాయిలా ? అబ్బే లేదు," అన్నాడు మొదటిరైతు. వెనకటి అమాయకత్వం ఇప్పుడతని గొంతుకలో లేదు, అతని గొంతుకలో అసహనం మొరటుగా ధ్వనిస్తోంది, "ఏదో ఇదీఅదీ గొణిగాడు. కాస్త నాలుకతుప్పు వదుల్చుకోడానికి. అతను గొప్ప వాడయ్యా, అతనికేం తెలుస్తుంది?"

"అతని కేం తెలుస్తుంది," అన్నాడు రెండో రైతు. టోపీలు వెనక్కి నొక్కి, పటకాలు కిందికి నెట్టి వాళ్ళు తమ అవసరాలనుగురించీ, తమ కర్తవ్యాన్నిగురించీ తర్కించుకున్నారు. పాపం, బజరోవ్, (రైతులతో ఎల్లా మాట్లాడాలో తనకి తెలుసునని పావెల్ పెట్రోవిచ్‌తో గొప్ప చెప్పుకున్న బజరోవ్) అసహ్యంతో భుజాలు ముడుచుకొని వెళ్ళిపోయిన బజరోవ్, ఆ రైతులిద్దరూ తనని ఒక హాస్యగాణ్ణి చేసి మాట్లాడుకుంటున్నారని ఎరగడు.

చివరకి అతనికి చెయ్యడానికి పని దొరికింది. ఒకనాడు వాసిలీ ఇవానోవిచ్ ఒక రైతుకాలికి గాయంపడితే కట్టుకట్టాడు. కాని అతని ముసలి చేతులు వణికాయి, కట్టు తిన్నగా రాలేదు. కొడుకు అతనికి సహాయపడ్డాడు. క్రమంగా వైద్యంలో అతనికి సహాయపడడం ప్రారంభించాడు. తన తండ్రినిగురించీ, తను ఇస్తున్న మందులనుగురించీ కూడా చులకనగా మాట్లాడుతూనే ఉండేవాడు. కాని అతని తండ్రి అతని సలహాలనన్నిటినీ తక్షణం ఆచరణలో పెట్టేవాడు. బజరోవ్ వెక్కిరింపులు వాసిలీ ఇవానోవిచ్‌కి ఆందోళన కలిగించలేదు. అవి సంతోషకారణంగా కూడా ఉండేవి. జిడ్డుగా అయిపోయిన పైగుడ్డ ఒకటి దుస్తులమీద కట్టుకుని, పొగగొట్టం నోట్లో పెట్టుకుని, అతను కులాసాగా బజరోవ్ కబుర్లన్నీ వినేవాడు. అతను ఎంత వెక్కిరింతగా మాట్లాడితే అంత సంతోషంగానూ నవ్వేవాడు. అతని పళ్ళన్నీ కనబడేటట్టు నవ్వేవాడు. ఈ అర్థంలేని వెక్కిరింపులు అప్పుడప్పుడు తనుకూడా పునశ్చరణచేసేవాడు. ఉదాహరణకి, ఒకనాడు బజరోవ్ ఏదో సందర్భంలో ఉపయోగించిన వాక్యాన్ని కొన్నిరోజులు అదేపనిగా ఉపయోగించడం ప్రారంభించాడు, "అది అంత ముఖ్యవిషయం కాదు." "పోనీ, ఆ దిగులు పోయింది వాడికి," అన్నాడు రహస్యంగా భార్యతో. "నన్నెల్లా మడ్చివేశా రనుకున్నావు, ఈ వేళ !" తరవాత తనకి అల్లాంటి అనుచరుడు ఉండడమనేదే, అతనికి ఎంతో ఉత్సాహకారణం అయింది. అతన్ని గర్వంతో ముంచెత్తింది. ఎవరో రైతు స్త్రీ చేతికి ఒక మందుసీసానో, కురుపులమందునో అందిస్తూ అంటాడు, "భగవంతుడికి వెయ్యిసార్లు మొక్కుకోవాలి నువ్వు. నాతో కూడా మా అబ్బాయి ఉన్నన్నాళ్లూ నీకు మంచి శాస్త్రీయమయిన, పరిశోధపద్ధతిలో వైద్యం జరుగుతుంది. అంటే ఏమిటో తెలుసునా? ఫ్రెంచి చక్రవర్తి ఉన్నాడే, నెపోలియన్, అతనికికూడా ఇంతకంటే. మంచి వైద్యుడు దొరక డన్నమాట. ఆ రైతు స్త్రీ, తన కేదో లోపలంతా ఆడోమోస్తరుగా ఉందన్నీ చెప్పాలనుకుంటుంది. (అది అసలు స్పష్టంగా ఎల్లా చెప్పాలో ఆమెకు తెలియదు.) ఇదంతా విని ఆమె వంగి నమస్కరించి, ఒడిలో దాచిన నాలుగు కోడిగుడ్లు కట్టిన గుడ్డమూట తీసి ఇచ్చి పోతుంది.

ఒకసారి బజరోవ్, దారినిపోతూ బట్టలు అమ్ముకునే ఒక వర్తకుడి పన్నుకూడా ఊడదీశాడు. అది అంత పెద్దపన్ను కాకపోయినా, వాసిలీ ఇవానోవిచ్ దాన్ని దాచాడు. ఫాదర్ అలెక్సీ వచ్చినప్పుడల్లా దాన్నితీసి చూపిస్తూ అంటుండేవాడు, "చూడండి, ఎంత పన్నో ! యవ్‌గనీకి ఎంత బలం ఉందనీ! ఆ వర్తకుడు గాలిలోకి ఒక్క గంతు వేశాడు. అది మర్రిచెట్టంత లోతుగా వేళ్లు పాతుకుపోయినా సరే, దాన్ని లాగిపారేస్తాడు."

"చాలా బాగుంది," అనేవాడు ఫాదర్ అలెక్సీ, చాలాసేపు ఊరుకుని. ఎల్లా సమాధానం చెప్పాలో అతనికి తోచేదికాదు. ఇంత ఉత్సాహంగా మాట్లాడుతున్న మనిషిని ఎల్లా వదుల్చుకోవాలో కూడా అతనికి తెలిసేదికాదు.

పక్కని ఉన్న పల్లెటూరినించి ఒక రైతు టైఫస్ జ్వరంతో బాధపడుతున్న తన సోదరుణ్ణి తీసుకుని వాసిలీ ఇవానోవిచ్ దగ్గరకు వచ్చాడు. పాపం ఆ మనిషిని గడ్డిమీద పడుకోబెట్టారు. చచ్చిపోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అతని శరీరంమీద నల్లనిమచ్చలు పాకిఉన్నాయి. తెలివితప్పి చాలాకాల మయింది. సకాలంలో అతనికి సరియయిన వైద్యసహాయం దొరకనందుకు వాసిలీ ఇవానోవిచ్ నొచ్చుకున్నాడు. ఇంక ఆశ ఏమీ లేదని చెప్పివేశాడు. నిజానికి ఆ రైతు ఆ రోగిని తిరిగి ఇంటికి తీసుకునిపోలేదు కూడా. రోగి బండిలోనే ప్రాణం వదలివేశాడు.

మూడు రోజులు గడచిన తరవాత బజరోవ్ తండ్రిగదిలోకి వచ్చి ఏదన్నా ద్రావకం ఉందా అని అడిగాడు.

"ఉంది. ఎందుకు నీకు ?"

"కావాలి నాకు......కొంచెం తెగింది. అక్కడ కాల్చివెయ్యాలి."

"ఎవరికి ?"

"నాకే."

"ఏమిటి? నీకే ఎల్లా తెగింది? ఎక్కడ? ఏది?"

"ఇదుగో ఈ వేలిమీద. చూశావూ, ఆ టైఫస్ రోగిని తీసుకురాలేదూ, ఆ ఊరువెళ్లాను. ఎందుకో శవాన్ని కొయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. నాకు శస్త్రవైద్యం విషయంలో చాలా కాలంగా అలవాటు తప్పిపోయింది."

"ఆ".

"ఏముంది, ప్రభుత్వపు వైద్యుణ్ణి అడిగాను. అడిగి నేనే కోశాను."

వాసిలీ ఇవానోవిచ్ ముఖం చటుక్కుని పాలిపోయింది. ఒక్కమాటయినా అనకుండా తన పఠనమందిరంలోకి పరుగెత్తి, చేత్తో ద్రావకం సీసా తెచ్చాడు. బజరోవ్ అది తను తీసుకొనిపోబోయాడు.

"ఏది, ఇల్లారా !" అన్నాడు వాసిలీ ఇవానోవిచ్, "నేను కాలుస్తాను."

బజరోవ్ చిరునవ్వు నవ్వాడు. "ఎంత శ్రద్ధగా చేస్తున్నావు వైద్యం !"

"నవ్వకు. ఏదీచెయ్యి ఇల్లా పెట్టు. అట్టే పెద్ద గాయం కాదు. బాధగా ఉందా ?"

"గట్టిగా నొక్కు. మరేమీ భయం లేదు."

వాసిలీ ఇవానోవిచ్ ఆగాడు. "యవ్‌గనీ, ఇనీ ఊచతో కాల్చేస్తే నయమేమో. ఏమంటావు ?"

"అది వెంటనే చెయ్యవలసింది. నిజానికి ఈ ద్రావకం కూడా ఇప్పుడు అనవసరమే. నిజంగా నాకు వ్యాధి అంటుకుంటే ఇప్పటికే ఆలస్య మయిపోయింది."

(22 వ పేజీ చూడుడు)

మన ప్రభుత్వోద్యోగులు :

వి. పి. మీనన్

శ్రీ భాస్కర్ల సూర్యనారాయణమూర్తి


ప్రపంచంలో ఏ దేశంలోకూడా ప్రభుత్వోద్యోగులను గూర్చి ప్రజలకు తెలియడం ఆచారంకాని, అలవాటుకాని లేదు. ప్రజాస్వామిక దేశాలలో ప్రజలచేత ఎన్నుకొనబడిన నాయకులు శాసనకర్తలు, మంత్రులుగా ఉండి పరిపాలన నడుపుతూ ఉంటారు. ఈ ప్రజానాయకులు ప్రతి ఎన్నికలలోను వారివారి పార్టీబలాల ననుసరించి మార్పుచెందుతూ ఉండడం సహజం. అయితే మంత్రివర్గాలు ఎన్నిమారినా పరిపాలనమాత్రం ఒడుదుడుకులు లేకుండా జరగడానికి అనువుగా ప్రభుత్వ అధికారవర్గాలు శాశ్వతంగా ఏర్పాటు చేయబడ్డాయి. దీనిలో మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శులు, వారి క్రింద అనేకతరగతుల ఉద్యోగులు ఉంటారు. దేశంలో ఏ పని జరగాలన్నా దానియొక్క విధానాన్ని నిర్ణయించడం మంత్రుల విధి. ఆ తరువాత కథంతా తెరవెనుకనుంచి నడిపేది అధికారవర్గం. ఈవిధంగా తెరవెనక కథనడిపే పాత్రలు ధరించడం మూలంగానే వేలకొలది దిట్టలు, నిపుణులు, విజ్ఞానవేత్తలు, పరిపాలనాధురంధరులు ప్రపంచ దేశాల చరిత్రలో పేరు ప్రతిష్ఠలు లేకుండా పోతున్నారు. కాని భారత పరిపాలనా చరిత్రలో కార్యదర్శులు, అధికారవర్గాల పలుకుబడి అనుపమానం. కాంగ్రెసు నాయకులు ప్రప్రథమం నుంచీ యీ పరిపాలనా విధానంలో అత్యంతప్రముఖస్థానాన్ని ఆక్రమించిన అధికారవర్గాలంటే మండిపడేవారు. కాని భారతదేశం స్వతంత్రమయ్యేసరికి, ప్రభుత్వ భారాన్ని వహించిన నాయకులకూ యీ అధికార వర్గాలమీద ఆధారపడడం తప్పిందికాదు. భారత మంత్రులలో చాలామంది ఉన్నతస్థాయిలో సమావేశాలు జరపడం, పార్టీలు సన్మానాలు అందుకోవడం, పత్రికా ప్రకటనలు చేయడం. జాతీయ అంతర్జాతీయ ప్రతినిధి వర్గాలకు నాయకత్వాలు వహించడంతో సంతృప్తి పడే పరిస్థితిలో ప్రభుత్వ కార్యదర్శులు సర్వశక్తివంతులు కావడంలో ఆశ్చర్యం లేదు. దానికి తోడు భారతప్రభుత్వ అధికారవర్గాలలో హేమాహేమీ లున్నారు. వారంతా నివురుగప్పిన నిప్పుకణాలు. అందువల్లనే వారిని గూర్చి దేశానికి, ప్రజలకు ఏమీ తెలియదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా విశ్వాసపాత్రంగా తమ విధులు నిర్వర్తింవలసిన శాఖకు చెందిన వ్యక్తులు కాబట్టి వారి గురించి ప్రపంచానికి తెలిసే అవకాశాలు లేవు.

భారత అధికారవర్గాలలో కూడా కొన్ని పేర్లు యీ మధ్య ప్రజలకు తెలుస్తున్నాయి. స్టెర్లింగు నిల్వల చర్చలకు ఇంగ్లండు వెళ్ళిన ఆర్థిక కార్యదర్శి శ్రీ నరహరిరావు, రక్షణ సమస్యల చర్చలకు వెళ్ళిన రక్షణ కార్యదర్శి పటేల్, విదేశవ్యవహారాల శాఖకు చెందిన బాజ్‌పాయ్, K. P. S. మీనన్ పేర్లు ప్రజలు తరచు వింటున్నారు. కానీ వీరందరికంటే వార్తాపత్రిక చదివే ప్రతివ్యక్తినీ, ప్రతిరోజూ విడువకుండా వెంటబడే వ్యక్తి భారత సంస్థానాల శాఖా కార్యదర్శి వి. పి. మీనన్. భారతదేశంలో—ముఖ్యంగా రాజకీయ పరిజ్ఞానం బాగా అభివృద్ధిపొందిన ఆంధ్రదేశంలో—మీనన్ పేరు విననివారు ఉండరు. ఏదో ఒక సంస్థానం ఒక రాష్ట్రంలో లీనమయిపోయినా, కొన్ని సంస్థానాలు కలసి ప్రత్యేకంగా ఒక స్వరూపం దాలుస్తున్నా, మహారాజులతో, సంస్థానాధిపతులతో చర్చలు ఒడంబడికలు జరుగుతున్నప్పటికి మీనన్ పేరు లేనిదే చదవం. అయితే భారత చరిత్రలో సంస్థానాలను భారత యూనియన్‌తో యింత విచిత్రంగా కలిపి అద్భుతమైన రాజకీయ పరిణామం తీసుకు రావడంతో సంబంధించిన వి. పి. మీనన్‌ను గూర్చి తెలుసుకోవడానికి ప్రతివారూ ఉబలాట పడడంలో అతిశయోక్తి లేదు.

అయితే యీ జీవితాలు తెలుసుకోవడంలో బాధ ఉంది. ప్రజానాయకులు, మంత్రులను గూర్చి తెలుసుకోవడం మహా సులభం. వారికి ప్రచారం అవసరం కాబట్టి మనం అడగకుండానే ఏకరవుపెడతారు. కాని ప్రభుత్వోద్యోగులు ప్రచారానికి సిగ్గుపడతారు. తన జీవితాన్ని గూర్చి ప్రకటించదలిచానని చెప్పేసరికి, మీనన్ ఆశ్చర్యంగా మొఖంపెట్టి 'నా గురించి పేపర్లో వ్రాస్తావా? ఎప్పుడైనా పరదేశాలలోని ప్రభుత్వ కార్యదర్శుల జీవితాలను గూర్చి విన్నావా?' అని ప్రశ్నించాడు కాదు కూడదు, యీ దేశపు ప్రజలు నీగురించి తెలుసుకోవాలంటున్నారు. కాబట్టి వివరాలు యివ్వక తప్పదంటే తప్పనిసరిగా అంగీకరించాడు.

వి. పి. మీనన్ పేరు వాపల్ పంగున్ని మీనన్ అని పూర్తిగా చెబితే ఎవరికీ అర్థం కాదు. తండ్రి శంకున్ని మీనన్. తల్లి కన్నికుట్టి అమ్మాళ్. వి. పి. మీనన్ 1894 సెప్టెంబరు 30వ తేదీన జన్మించాడు. అతడు ఎంతవరకు చదువుకున్నాడో ఎవరికీ గట్టిగా తెలీయదు. కాని తాను హైస్కూలు చదువు దాటలేదని అతడే అంగీకరిస్తాడు. ఒట్టపాలెంలో 5వ ఫారము చదువుకుండగా యిల్లు వదలిపెట్టి ఉత్తర హిందూస్థానానికి పారిపోయి వచ్చిన వీరుడు మీనన్. ఢిల్లీకివచ్చిన దాక్షిణాత్యులలో యితడు రెండవవాడు. ప్రారంభంలో ఎవరూ సహాయపడనందున చాలా అవస్థపడ్డాడు. అందుకే కోపమువచ్చి తాను అధికారంలోకి వచ్చిన తరువాత చేతనైనంత మంది తన వాళ్ళని దిగుమతి చేశాడు. 1914 సెప్టెంబరు 8వ తేదీన మీనన్ ప్రప్రథమంగా ఉద్యోగంలో ప్రవేశించాడు. టైపు రాకపోయినా దబాయించి Armed Head Quarters టైపిస్టుగా చేరాడు. త్వరలోనే అతడి బండారం బయట పడింది. ఉద్యోగం పోయేటంత పని అయింది. కాని మూడు వారాల్లో టైపు, షార్టుహాండు కూడా నేర్చుకొని దిట్టమైన స్టెనోగ్రాఫరయ్యాడు. 1921లో మాంటాగ్యుఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అమలు జరపడానికి పెట్టిన రిఫారమ్సు ఆఫీసులో చేరాడు మీనన్. ఆనాటినుంచి భారత రాజ్యాంగ పరిణామంతోపాటు మీనన్ జీవితములో కూడా మార్పు వచ్చింది. 1928లో సైమన్‌కమీషన్ భారతదేశానికి వచ్చిన సందర్భములో ఆ ఆఫీసులో పనిచేయడానికి నియమించిన ఉద్యోగుల్లో మీనన్ ఉన్నాడు. ఆ తరువాత భారత ప్రభుత్వ హోంశాఖలో అసిస్టెంటుగా పనిచేశాడు. మీనన్‌కి యీ నాటికీ యింకా హోండిపార్టుమెంటులో అసిస్టెంటుగా lean ఉందని ఆ శాఖవారు చెప్పుకుంటారు. అతడు గుమాస్తాగా ఉన్నప్పుడే అతని ప్రజ్ఞ అనుపమానం. రిఫారమ్సు ఆఫీసులో ఉండగా మీనన్ 35 పేజీల డిస్పోజల్ వ్రాస్తే దానిలో ఒక్క మార్పుకూడా చేయవలసిన పనిలేకుండా అచ్చులోకి వెళ్లిందని యిప్పటికీ ఆఫీసు ప్రజలు చాలా గౌరవంగా చెప్పుకుంటారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుం దన్నట్లు ఆ రోజుల్లోకూడా మీనన్‌కి తప్ప ఆ ఆఫీసులో ఏ కాగితం ఎక్కడుందో ఎవరికీ తెలిసేదికాదు. ఏ చిన్నపనైనా మీనన్ లేనిదే జరిగేది కాదు. దానితో పై అధికార్లకు మీనన్ పేరు ప్రతిరోజూ చెవిని పడుతూ రావడంతో వాని అదృష్టం పండింది. దానికి తోడు మీనన్ అఖండమైన తెలివితేటలు గలవాడని, నిమిషాల మీద గడ్డు సమస్యలపై నిర్ణయాలు తీసుకోగలడని అధికారులకు అర్థమయ్యేటట్టు చేసిన ఒక సన్నివేశం గొప్పగా చెప్పుకుంటారు.

అది ప్రథమ ప్రపంచయుద్ధకాలంలో ఎమ్డెన్ నౌక అరేబియా సముద్రంలో వీరవిహారం చేస్తున్న రోజులు. ఏడెన్‌నుంచి మిత్రరాజ్యాల కాన్వాయి సింగపూర్ వెళుతున్న వర్తమానం ఇండియా చేరేసరికి మీనన్ పైఅధికారి ఆఫీసులో లేడు. ఆ సమయంలో ధైర్యంచేసి ఆ కాన్వాయిని బొంబాయిరేవుకిబదులుగ కరాచీరేవుకి పట్టించవలసిందిగా ఆజ్ఞలు పంపాడు మీనన్. ఈ పద్ధతి సక్రమమైనది కాదని అధికారవర్గాలు నానా గొడవా చేశారు. కాని చివరకు ఆ కాన్వాయి కాపాడబడడం మూలంగా మీనన్ అధికారుల అనుగ్రహానికి పాత్రుడయ్యాడు.



1930 నవంబరులో ప్రారంభమైన ప్రథమ రౌండ్‌టేబిల్ సమావేశానికి వెళ్ళిన భారతప్రతినిధి వర్గానికి సంబంధించిన సిబ్బందిలో మీనన్ ప్రప్రథమంగా ఇంగ్లండు వెళ్లాడు. ఆసమావేశాన్నుంచి తిరిగి రాగానే మళ్ళా భారతప్రభుత్వ రిఫారమ్సు ఆఫీసులో చేరాడు. అతడు 1947లో సంస్థానశాఖ కార్యదర్శి అయ్యేవరకు రిఫారమ్సు ఆఫీసులోనే అన్ని దశలు చూచాడు. గుమాస్తాగా ప్రవేశించిన మీనన్, అసిస్టెంటు, అండర్, డెప్యూటీ, జాయింటు సెక్రటరీ రూపాలు దాల్చి చివరకు 1942 సెప్టెంబరులో రిఫారమ్సు కమిషనర్ అయ్యాడు. 1945 జూన్ నుంచి గవర్నర్ జనరల్ (పబ్లిక్) కార్యదర్శిగా పనిచేశాడు. మీనన్ తన ఉద్యోగ కాలంలో అనేకమంది బ్రిటిష్ వైస్రాయిలను చూచాడు. వారిలో వేవెల్‌కు మీనన్‌మీద బ్రహ్మాండమైనంత గురి కుదిరింది. దాని ఫలితంగానే వేవెల్ భారతరాజ్యాంగ వ్యవహారాల చర్చలకు ఇంగ్లండు వెళ్ళిన రెండుసార్లు కూడా మీనన్ కూడా ఉండక తప్పిందికాదు. భారతరాజ్యాంగంలోని వివిధ సంస్కరణల ఆయువుపట్లు తెలిసిన వ్యక్తి మీనన్ ఒక్కడే. ఏ క్లాజును వివరించాలన్నా మీనన్ ఉండవలసిందే. ఆవిధంగా ప్రారంభం నుంచీ మీనన్ తప్పనిసరి మనిషి అయ్యాడు. ఇంతవరకు వి. పి. మీనన్‌నుగూర్చి ప్రజలకు తెలియవలసిన అవసరం రాలేదు. దీనితో అతని జీవితంలోని ప్రథమ ఘట్టం పరిసమాప్తమైంది.

1947 జూలై 5వ తేదీన భారతప్రభుత్వం పొలిటికల్ డిపార్టుమెంటును ఎత్తివేసి సంస్థానాలశాఖను సర్దార్ పటేలు అధ్యక్షతన నెలకొల్పడంతో మీనన్ జీవితంలో ఒక క్రొత్త వెలుగు ప్రకాశించింది. మీనన్ ప్రతిభకు, శక్తిసామర్థ్యాలకు, కార్యనిర్వహణకు సంపూర్ణమైన ప్రతిఫలం కలిగే సమయం వచ్చింది. సంస్థానాల శాఖ కార్యదర్శిగా మీనన్ సాధించిన విజయాలు భారతచరిత్రలో సంస్థానాల సమ్మేళన కార్యక్రమానికి మూలభాష్యం. సంస్థానాల కార్యక్రమంలో మీనన్‌భాగం చెప్పుకునేటప్పుడు మంత్రి పటేల్‌కు కార్యదర్శి మీనన్‌కు వారి వారి భాగాలు విడిగా పంచి, నిర్ణయించడం కష్టం. భారతదేశవిభజనతో కుంచించుకు పోయిన భారతీయుల హృదయాలలో సర్దార్ పటేల్, తన సంస్థానాలవిధానంతో, ఆశాజ్యోతులు వెలిగించాడు. బ్రిటిషు అండ విడటంతో సంస్థానాధీశ్వరులు కళ్ళుతెరచి, ప్రజాశక్తిని గుర్తించి రక్షణ, రహదారులు, విదేశవ్యవహారాలు భారతప్రభుత్వానికి అప్పగించి యావద్భారతదేశానికి పరిపాలనా సౌలభ్యం వచ్చేటట్టు చేయాలని పటేల్ జీ గర్జించాడు. లార్డు మౌంట్‌బాటన్ ప్రత్యేకంగా సంస్థానాధిపతుల్ని ఆహ్వానించి 25 జూలైనాడు సర్దార్‌పటేల్ హెచ్చరికను బలపరిచాడు. ఆ సభలో వి. పి. మీనన్ సారథ్యం వర్ణనాతీతం. మహారాజుల సందేహాలన్నింటికి మౌంట్‌బాటన్ వి. పి. మీనన్‌వైపు చూపించేవాడు. ప్రతివిషయంమీదా భాష్యకారుడు మీనన్. చివరకు సందేహాలున్నవాళ్ళంతా మీనన్‌ని ప్రత్యేకంగా కలుసుకోమని వైస్రాయి ఆజ్ఞ. సెల తిరగకుండా చాలామంది accession కాగితాలమీద సంతకాలుపెట్టారు. వాటిని బలపరచడానికి stand-stall అంగీకారాలకు కూడా ఒప్పించారు.

ఈ కార్యక్రమంలో సంపూర్ణ విప్లవం సాధించేవరకు సంస్థానశాఖ వారు నిద్రపోలేదు. సర్దార్ పటేల్ సంస్థానాధీశుల్ని హెచ్చరిస్తూ, చిన్నచిన్న సంస్థానాలకే గాక, యావద్భారతానికి సేవ చేయవలసిన సమయ మాసన్నమైంది కాబట్టి మీరంతా మీలో మీరు ఐక్యమై ప్రత్యేకరాష్ట్రాలుగానైనా ఏర్పడండి, లేదా మీప్రక్కన ఉన్న రాష్ట్రాలతో లీనమవండన్నాడు. కాని యీ ఆలోచన క్రొత్తదికాదు. 1939లో లిన్‌లిత్గో, 1943లో పొలిటికల్ డిపార్టుమెంటుకూడా యీ విషయంలో కృషిచేశారు. విఫలు లయ్యారు అనేక కారణాలవల్ల. భారతస్వాతంత్ర్యంతో సంస్థాన ప్రజల స్వాతంత్ర్య కాంక్ష కట్టలు తెగింది. సంస్థానాధిపతులు సహితం తమ నిజస్థితిని గుర్తించారు. ఇక కావలసింది తెలివితేటలు, లౌక్యం, కార్యదక్షతను. సర్దార్ పటేల్ పట్టుదలకు వి. పి. మీనన్‌లోని యీ సర్వలక్షణాలూ రూపకల్పన చేశాయి. మత కలహాల తీవ్రతనుంచి గుక్కతిప్పుకొని సంస్థానాల వెంటబడింది భారతప్రభుత్వం. 1947 డిశంబరు రెండవవారంలో పటేల్ కటక్ ప్రయాణంతో ఒరిస్సా సంస్థానాలు 25 కూడా ఒరిస్సా రాష్ట్రంతో కలిసిపోయాయి. ఈ తూర్పు సంస్థానాల్ని ఒరవడిగా తీసుకొని 17 దక్కను సంస్థానాలు, 157 గుజరాత్ సంస్థానాలు బొంబాయిలో కలిశాయి. లోహారు, దుజానా, పటౌడిసంస్థానాలు తూర్పుపంజాబులోను, బంగనపల్లి, పుదుక్కోట మద్రాసులోను, బస్తర్, మక్రయి మొదలైన 15 సంస్థానాలు సి. పి. బీరారు రాష్ట్రంలోను లీనమయిపోయాయి. సరైకెల్లా, ఖర్సవాన్ సంస్థానాలవిషయంలో వచ్చిన యిబ్బంది తొలగించి వాటిని బీహారులో చేర్చారు. ఈవిధంగా చిన్నచిన్న సంస్థానాలను రాష్ట్రాలలో లీనంచేసి పరిపాలనాసౌలభ్యానికి, ప్రజాస్వామికహక్కులకు దోహద మిచ్చిన కీర్తిప్రతిష్ఠలు, సర్దార్ పటేలుకు, వి. పి. మీనన్‌కు దక్కుతాయి

ఇక, రాష్ట్రాలలో లీనం చేయడానికి వీలులేని సంస్థానాలమీద పడ్డాయి వీరి కళ్ళు. భాష, ఉనికి, సభ్యతా సంస్కృతులు, సాంఘిక పరిస్థితులలో సామ్యం. సన్నిహితత్వం ఉన్న సంస్థానాల నన్నింటిని సమ్మిళితంచేసి ప్రత్యేక పరిపాలనాభాగాలుగా చేయాలనే ఊహ దృఢపడింది సర్దార్‌పటేల్ బుర్రలో. పొట్టివాడికి పుట్టెడుబుద్ధులన్నట్లు యజమాని ఊహకు రూపం దిద్ది తన స్కీముతో సిద్ధమయ్యాడు మీనన్. ప్రప్రథమంగా 217 కథియవాడ్ సంస్థానాలతోను ప్రారంభమైంది. 860 విభాగాలుగాఉండి, పరిపాలన కెంతమాత్రం అనువుగాలేని ఆముక్కల నన్నింటిని ఒకటిచేసి సౌరాష్ట్రయూనియన్ అన్నారు. ప్రత్యేక రాజ్యాంగ నిర్మాణ సభ, ప్రజామంత్రివర్గం ఏర్పాటుచేశారు. రాజప్రముఖుడు, ఉపరాజ ప్రముఖుడు తదితర సంస్థానాధిపతులకు మనువర్తి యివ్వడానికి అంగీకరించారు. సౌరాష్ట్ర యూనియన్ ప్రారంభంతో సర్దార్ పటేల్ విజృంభించాడు. వి. పి. మీనన్ శక్తిసామర్థ్యాలమీద వెఱ్ఱినమ్మకం కుదిరింది. ఇక సర్వానికీ మీనన్ ఉండవలసిందే! సౌరాష్ట్రంతో ప్రారంభించి, మత్స్య, వింధ్య ప్రదేశం, రాజస్థాన్, మధ్యభారతం, పుల్కాన్ యూనియన్ల సృష్టితో పరిపూర్తిచెందిన ఆ మహత్తర దిగ్విజయానికి మీనన్ సర్వసేనాని; సూత్రధారుడు. మహారాజులతో చర్చలకు, ప్రజానాయకులకు రాజుల మధ్య అభిప్రాయభేదాలు సరిచేయడానికి, వివిధ సంస్థానాధిపతుల మధ్య పేచీలు పోగొట్టడానికి, ఒకటేమిటి, ప్రతి పనికి మీనన్ ఉండవలసిందే. జనవరి మొదలు జూలైవరకు సుడిగాలిలా తిరిగాడు మీనన్. ముఖ్యంగా యీ సమయంలోనే సర్దార్ పటేల్ అనారోగ్యంగా ఉండడంవల్ల బాధ్యత వేయింతలైంది. గ్వాలియర్, ఇండూర్ మాల్వా సంస్థానాలను కలిపి మధ్య భారత

(20 వ పేజీ చూడుడు)

మలయాలో అశాంతికి కారకులెవరు?

చైనీస్, మలయన్ విభేదాలు, పెట్టుబడిదారీ, కార్మిక విభేదాలు రెచ్చగొట్టి తాము స్థిరపడటానికి బ్రిటిష్ ప్రయత్నం

శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మ

దూరప్రాచ్య రాజ్యాలలో మలయాకు ప్రత్యేక విశిష్టత వున్నది. పసిఫిక్ మహాసముద్రంలోనుండి హిందూమహాసముద్రంలోనికి ప్రవేశించటానికి సింగపూర్ మీదుగా ప్రయాణం దగ్గరమార్గము. పసిఫిక్ హిందూమహాసముద్రాల సంగమస్థానంలో వున్న అసంఖ్యాక దీవులను అదుపులో పెట్టటానికి సింగపూర్, దానికొరకు మలయా పై ఆధిపత్యము అవుసరము, బ్రిటిష్ సామ్రాజ్య దేశాలమధ్య రవాణా సౌకర్యాలు నిరపాయంగా వుండాలంటే, ముందు అదుపులో పెట్టవలసిన కీలకస్థానాలలో సింగపూర్ ఒకటి. జిబ్రాల్టర్, ఏడెన్, సూయజ్ కాలువ కొలంబోలవలె బ్రిటిష్ సామ్రాజ్య 'ప్రాణరక్షక' స్థానాలలో ఒకటిగా సింగపూర్ ఇన్నాళ్ళనుండి ప్రాముఖ్యత వహించించి. సింగపూర్ బ్రిటిష్‌వారి చేతులలో వుండటంవల్లనే అటు పసిఫిక్ మహాసముద్రంలోను, ఇటు హిందూ మహాసముద్రంలోను తమ అధికారానికి అడ్డు లేకుండా వారు చెలాయించుకో గల్గిరి. బ్రిటిష్ సామ్రాజ్యం ఇప్పుడు భిన్నమైపోయినా, తెల్ల దేశాలగు ఆస్ట్రేలియా, న్యూజిలాండులతో రాకపోకలు జరపటానికీ, చైనాలో తమ ప్రయోజనాలను రక్షించుకోవటానికి బ్రిటిష్‌వారికి సింగపూర్ ఇంకా అవుసరమే.

సింగపూర్ పట్టణమేగాక మలయా ద్వీపకల్పంకూడా చాల ప్రాముఖ్యత వహించినదే. ఈ ద్వీపకల్పంలో రబ్బరుచెట్లు అడవులు విస్తారముగా నున్నవి. సింథెటిక్ రబ్బరు కనిపెట్టబడేవరకు ప్రపంచంలో ఎక్కువభాగం రబ్బరు మలయాలోనే ఉత్పత్తి అయ్యేది. ప్రపంచంలో ఉత్పత్తి అయే తగరంలో అధిక భాగం మలయాలోనే ఉత్పత్తి అవుతుంది ఆధునిక ప్రపంచ అభ్యున్నతికి అవుసరాలైన ఈ రెండు వస్తువులు పుష్కలంగా లభించే మలయా తమ చేతిక్రింద వుండటంవల్ల బ్రిటిష్‌వారి పరిశ్రమలు అతిత్వరగా వృద్ధిపొందగలిగాయి. ఇప్పటికి కూడా రబ్బరు, తగరము మలయా నుండి అమెరికాకు, ఎగుమతిచేసి, తద్వారా సాలుకు 17 కోట్ల డాలర్లు సంపాదించుకుని, తమ ఆర్థికవిపత్తు ఉధృతాన్ని తగ్గించుకోగలుగుతున్నారు బ్రిటిష్‌వారు. ప్రపంచ కీలకస్థానముగాను, అరుదు ముడిసరుకుల ఉత్పత్తిస్థానముగాను ఉన్న మలయాను తమ చేతులనుండి జారవిడవటానికి బ్రిటిష్‌వారు—ఇండియా, బర్మా, సిలోన్‌లను వదలిన తర్వాత కూడా—అంగీకరించటంలేదు. ఈ ఒక్క విషయమే మలయా ప్రాముఖ్యతను రుజువుపరుస్తున్నది.

మలయా రాజకీయ స్వరూపము, జనాభాలో వివిధజాతుల సమ్మేళనము మలయా రాజకీయాలలో అతి ముఖ్యమైన విషయములు. సింగపూర్ పట్టణం మలయా ద్వీపకల్పంలో భాగంగాగాక, వేరే ఒక చిన్నద్వీపంగా వున్నది. సింగపూర్‌ను మలయాద్వీపకల్పంనుండి వేరుచేసే సముద్రం ఎక్కడా 10 మైళ్లు వెడల్పు కూడ లేదు. మలయా ద్వీపకల్పం తొమ్మిది రాజ్యాలుగా విభాగమై, ఒక్కొక్క రాజ్యము ఒక్కొక్క సుల్తాన్ పరిపాలనక్రింద వున్నవి. ఈ సుల్తానులు బ్రిటిష్‌వారికి లోబడి వుందురు. మలక్కా జలసంధిలో వున్న మలక్కా, పెనాంగ్ దీవులు మాత్రం నేరుగా బ్రిటిష్ ప్రభుత్వ వలస శాఖ పరిపాలనలోనే వున్నవి. మలయాలోని 9 స్వతంత్ర రాజ్యాలు ఇవి: పేరక్, సెలంగార్, నెగ్రి సెంబిలాన్, పాహాంగ్, జాహోర్, కేడా, కెలంతాన్, ట్రెంగన్ను, పెర్లిస్.

మలయాజనాభా మొత్తం 55 లక్షలపైగా వుంటుంది. ఒక్క సింగపూర్ పట్టణం జనాభాయే దాదాపు 10 లక్షలు వుంటుంది. సింగపూర్‌తో సహా మలయాజనాభాలో 23 లక్షల 79 వేలు చైనావారు, 22 లక్షల 78 వేలు మలయావారు, $7\frac{1}{2}$ లక్షలు భారతీయులు, కొద్దిమంది ఆంగ్లేయులు వుంటారు. సింగపూర్ పట్టణాన్ని వేరుచేసి చూస్తే మలయాద్వీపకల్పంలో 21 లక్షలమంది మలయాలు, 18 లక్షలమంది చైనావారు దాదాపు 7 లక్షలమంది భారతీయులు వుంటారు. మలయారాజకీయ సమస్యకీలకం దీంట్లోనేవుంది. సింగపూర్‌తోసహా మలయా అంతా ఒక దేశంగా పరిగణిస్తే, మలయాలోనే మలయాలు అల్పసంఖ్యాకులై, చైనావారు అధికసంఖ్యాకులౌతారు. స్వదేశంలోనే అల్పసంఖ్యాకులుగా పరిగణింపబడటానికి మలయాలు ఒప్పుకోరు. దేశమంతటిలోను, తామే అధికసంఖ్యాకులు కాబట్టిన్నీ, ఇతరవిదేశసులు కూడా చాలమంది తమనే బలపరుస్తున్నారు కాబట్టిన్నీ, సింగపూర్‌ను కృత్రిమంగా వేరుచేసి, మలయాలో తమను అధోగతి పాలుచేయటం చైనావారు హర్షించరు. మలయా, చైనాప్రజలమధ్య ఇట్టి విభేదాలుండగా, మలయానుండి వైదొలగటానికి ఇష్టంలేని బ్రిటిష్‌వారు దీని నుపయోగించుకుని, మలయాలో తమ అధికారాన్ని స్థిరపరచుకోటానికి ప్రయత్నించటంలో ఆశ్చర్యమేమున్నది? అతి కీలకస్థానంలో వుండి, అతి అరుదు ముడిపదార్థాలను సప్లయిచేయగలిగిన దేశాన్ని చూస్తూ చూస్తూ బ్రిటన్ వదులుకోగలదా?

రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టటానికి మలయా పునరాక్రమణ జరిగిన తర్వాతనుండి సంప్రదింపులు జరుగుచునే యున్నవి. వీని ఫలితంగా 1946 వ సం. జనవరి 22 వ తేదీన 'మలయా యూనియన్' స్థాపనకు ఒకపథకం, బ్రిటిష్ వలస శాఖవారు ప్రచురించారు. మలయాలోని 9 సంస్థానాలపైనను ఒక కేంద్రప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, సార్వభౌమాధికారం బ్రిటిష్‌వారి చేతులలో నుంచుకోవటమే దాని ఉద్దేశ్యం. ఈ ఫెడరేషన్‌లో చేరటానికి సంస్థానాల సుల్తానుల అంగీకరించలేదు. ఇట్లుండగానే, మలయాలో మిలిటరీ ప్రభుత్వం సమాప్తంచేసి, సర్ ఎడ్వర్డ్ జెంట్ గవర్నర్‌గా 'మలయా యూనియన్' ప్రభుత్వ స్థాపన చేశారు. సుల్తానుల అభీష్టానికి వ్యతిరేకంగా ఫెడరేషన్ ఏర్పడింది. నవంబరు నెలనాటికి ఫెడరేషన్ వ్యతిరేకత తగ్గిపోయినదిగాని, ఇచ్చిన రాజకీయ సంస్కరణలు చాల తక్కువయని ప్రజలలో ఆందోళన ప్రారంభమైనది. అందువలన మరికొన్ని రాజకీయసంస్కరణలు సూచించుటకు ఒక కార్యవర్గమును ఏర్పరచి, వారు సూచించిన సంస్కరణల ప్రకారం 1948 వ సం. ఆరంభంలో మలయా ఫెడరేషన్ క్రొత్తప్రభుత్వాన్ని ఏర్పరచవలెనని భావించారు. ఈ కార్యవర్గసూచనలను స్వల్పమార్పులతో అంగీకరించి, ఈ క్రింది విధంగా రాజ్యాంగచట్టం తయారు చేశారు. మలయాద్వీపకల్పంనుండి సింగపూర్‌ను వేరుపరచి, దానిని నేరుగా వలసశాఖవారే పాలిస్తారు. తక్కిన మలయాను—9 సంస్థానాలు, మలక్కా, పెనాంగ్ దీవులు కలిపి—ఒక ఫెడరేషన్‌గా ఏర్పరచి రక్షణ, విదేశవ్యవహారాల బాధ్యత బ్రిటిష్‌ప్రభుత్వమే స్వాధీనపరచుకుంటుంది. మలయాయూనియన్‌కు గవర్నర్‌ను గాక హైకమీషనర్‌ను అధినేతగా నియమిస్తారు. యూనియన్‌కంతకు బలిష్ఠమైన కేంద్రప్రభుత్వ స్థాపనచేసి, 9 సంస్థాన-రాష్ట్రాలలోను సుల్తాన్‌ల ఆధిపత్యమున శాసన సభలను ఏర్పాటుచేస్తారు. కేంద్రశాసనసభలో 14 గురు అధికారసభ్యులు, 61 మంది అనధికారసభ్యులు వుంటారు. ఈ అనధికారసభ్యులందరు 'నామినేట్' చెయ్యబడతారుగాని ఒక్కరినీ ఎన్నుకోరు. నేరుగా హైకమీషనరే నామినేట్ చేసే 50 మంది సభ్యులలోను 22 మలయాలు, 24 చైనావారు, 7 యూరోపియన్‌లు, 5 భారతీయులు, 1 సింహళవాసి, 1 యూరేషియన్ వుంటాడని చెప్పారు. రక్షణ, విదేశవ్యవహారాలపై పూర్తి ఆధిపత్యమేగాక, ఇతర చాల విషయాలపై హైకమీషనర్‌కు 'రిజర్వుడు' అధికారాలుంటవి. వీటిద్వారా, ఈ నామినేటెడ్ శాసనసభ ఏశాసనమైనా త్రోసిపుచ్చితే, దానిని హైకమీషనర్ శాసనం చేసివేయవచ్చును. ఈ ఫెడరేషన్ స్థాపనకు సుల్తానులు వప్పుకున్నారు. ఇచ్చిన రాజకీయ సంస్కరణలు చాలవని అన్నా మలయా ప్రజలకు కూడా ఈ ఫెడరేషన్ విధానం నచ్చింది. దీనికి కారణం లేకపోలేదు. మలయానుంచి సింగపూర్‌ను వేరుచెయ్యటం వలన మలయా యూనియన్‌లో మలయాలదే మెజారిటీ అయినది. క్రొత్త శాసనసభలో మలయాలకే మెజారిటీ యివ్వబడినది. కొంతకాలము తర్వాత శాసనసభకు ఎన్నికలు జరిగినా మలయావారికే మెజారిటీ లభించునట్లు బ్రిటిష్ ప్రభుత్వము చేయగలదని వారు ఆశిస్తున్నారు. అందువలన బ్రిటిష్‌వారు ఇప్పుడు సూచించిన దానిని ఆమోదించుటే మంచిదని వారు భావించారు. మలయాలకు మెజారిటీ తేవలెనని బ్రిటన్ ప్రయత్నించుటలోకూడా స్వార్థము లేకపోలేదు. సింగపూర్‌ను ఇప్పుడు వేరుచేసినచో—మలయాల వ్యతిరేకత లేకుండా—ఇకముందది శాశ్వతముగా హాంకాంగ్, జిబ్రాల్టరులవలె బ్రిటిష్ ఆధిపత్యము క్రిందనే వుండిపోవును. మలయాయూనియన్‌లో చైనావారికిఆధిపత్యము రానివ్వకుండా వుండటమే బ్రిటన్ ఉద్దేశ్యము. ఒకవేళ చైనావారికి ఆధిపత్యము లభించినచో అన్నివిధముల చైనాకు అనుబంధదేశముగా మలయాను తయారు చేయవలెననే వారు ప్రయత్నించి, బ్రిటిష్‌వారిని వెళ్ళగొట్టవచ్చును. కాబట్టి చైనావారిని నమ్మకుండా మలయాలకు మేలుచెయ్యటం మంచిదని బ్రిటన్ అభిప్రాయం. ఇది సహజంగానే చైనావారికి ఇష్టంకాదు.

సింగపూర్‌కు కూడ అదేసమయంలో కొన్ని రాజకీయ సంస్కరణలు యిచ్చారు. వీని ప్రకారం సింగపూర్ శాసనసభ ఏర్పాటు చేస్తారు. దీనిలో 6 గురు ఎన్నుకొనబడిన సభ్యులు, బ్రిటిష్, చైనా, భారత వాణిజ్యమండలులచే నామినేట్ చెయ్యబడిన సభ్యులు ముగ్గురు, హైకమిషనర్‌చే నామినేట్ చేయబడిన సభ్యులు నలుగురు వుంటారు. ఎన్నికలలో వోటింగ్‌హక్కు బ్రిటిష్ ప్రజలకు మాత్రమే వుంటుంది. చైనా వారికి, సింగపూర్‌లో పుట్టినవారికిమాత్రమే వోటింగ్ హక్కు వుంటుంది. ఈ పద్ధతిప్రకారం చూస్తే, సింగపూర్ జనాభా 10 లక్షలలోను, 1 లక్షమందికిమాత్రమే వోటింగ్ చేయటానికి హక్కు వున్నది; వీరిలో 28 వేలమందిమాత్రమే వోటర్లుగా తమపేర్లు నమోదు చేయించుకున్నారు. వీరిలో దాదాపు సగంమంది భారతీయులు. మలయాచరిత్రలో మొట్టమొదటి పర్యాయం 1948 మార్చి 20 తేదీన ఎన్నికలు జరిగినప్పుడు దాదాపు 15 వేలమంది మాత్రమే ఎన్నికలలో పాల్గొన్నారు. ఎన్నుకొనబడిన 6 గురు సభ్యులలో ముగ్గురు భారతీయులు. ఈ శాసనసభ ఏప్రిల్ 1 వ తేదీన ప్రథమ సమావేశం జరిపింది. మలయా యూనియన్ నామినేటెడ్ శాసనసభకు ఫిబ్రవరి 24 వ తేదీన సర్ ఎడ్వర్డ్ జెంట్ ప్రారంభోత్సవం జరిపాడు. వలసశాఖామంత్రి లార్డ్ లిస్టావెల్ ఈ సమావేశానికి ప్రత్యేకంగా హాజరైనాడు.

ఈవిధంగా మలయా, సింగపూర్‌లలో చైనావారి మెజారిటీ నిర్లక్ష్యంచేసి, అణగిత్రొక్కివేయబడటంతో వారికి ప్రతీకారవాంఛ ప్రబలింది. చైనావారిలో ధనస్వాములు కొందరు—క్యుమింటాంగ్ పార్టీకి చెందినవారు—ఈ ఫెడరేషన్‌లో నామినేటెడ్ సభ్యులుగా చేరటంతో చైనావారిలోనే కమ్యూనిస్టు, క్యుమింటాంగ్ విభేదాలు పెరిగినవి. చైనా అంతర్యుద్ధంలో కమ్యూనిస్టులు విజయాలు పొందుతున్నకొద్దీ, మలయాలోని చైనావారిలో కూడా దాని ప్రభావం కనిపించింది. కమ్యూనిస్టులు త్వరలోనే చైనా ప్రభుత్వాన్ని పడగొట్టివేయగలరని, అప్పుడు మలయాలోని చైనీస్ కమ్యూనిస్టులకు వారినుండి మద్దతు లభించగలదనీ ఆశించి, మలయా కమ్యూనిస్టులు, మలయాలోని చైనీస్ కమ్యూనిస్టులు ఏకమై, మలయాను కూడా కమ్యూనిస్టు రాజ్యంగా చేసి, చైనా కమ్యూనిస్టు రాజ్యంతో సఖ్యత ఏర్పరచుకోవాలని ఆశించారు. మలయా కమ్యూనిస్టులకు చైనీస్ కమ్యూనిస్టులపై కొంత అపనమ్మకమున్నా, బ్రిటిష్‌వారిపట్లగల ద్వేషము లేదు. చైనీస్ కమ్యూనిస్టులకు బ్రిటిష్‌ప్రభుత్వము పట్ల, అన్నివర్గాలలోని పెట్టుబడిదారులపట్ల వైరము సహజము సహజముగానే వున్నది. చైనా, మలయాలలో కమ్యూనిస్టురాజ్యాలు ఏర్పడినప్పుడు చైనీస్-మలయన్ విభేదాలు అనవుసరమని వారికి తెలుసును. కాని, కమ్యూనిస్టులబలం చాల తక్కువ. విప్లవం లేవదీయగాలరనటం సత్యంకాదు. అట్టి సమయములో, మలయా ఆర్థికపరిస్థితులు విషమించి, ప్రభుత్వముపట్ల అసంతృప్తి ప్రబలిపోయినది. యుద్ధానంతర మలయాలో జీవనవ్యయం యుద్ధపూర్వంకంటె 5 రెట్లు పెరిగిపోయింది. మనదేశంలో జీవనవ్యయం యుద్ధానికి పూర్వంకంటె $2\frac{1}{2}$ రెట్లు మాత్రమే పెరిగిపోయినా మన మిట్టి అవస్థపడుతున్నామంటే జీవనవ్యయం 5 రెట్లు పెరిగిపోయినవారు ఎంత బాధపడుతుండాలో ఊహించకొనవచ్చును. రేషన్ యుద్ధాత్పూర్వంకంటె నూటికి 30 వంతులు తగ్గించారు. ఆ ఆహారంచాలక, ఇతర త్రాకొనుక్కోవాలంటే ఆహార ధాన్యాల ధరలు 9 రెట్లు పెరిగాయి, కొన శక్యంకాకుండా వున్నవి. తోటయజమానులు కూలీల కష్టాలను గుర్తించకుండా, వారిని అణచివేసేటందుకు మరీ క్రూరంగా ప్రవర్తింపసాగారు. మలయానుంచి ఎగుమతయ్యే తగరం ధర రెండు రెట్లు పెరిగినా, సింథటిక్ రబ్బరు ఉత్పత్తి పెరగటంవల్ల, రబ్బరు ధర తగినంతగా పెరగలేదు. అందువల్ల తమ లాభాలను తగ్గించుకోవటం ఇష్టంలేక, కార్మికుల జీతాలు పెంచకుండా, యజమానులు వారిని హింసిస్తున్నారు. ఇందువలన తోట యజమానులన్నా, బ్రిటిష్‌వారన్నా—తోట యజమానులు ఎక్కువమంది వీరే—వారికి సహాయపడే చైనీస్ కంట్రాక్టరులు, భారత చెట్టియార్లన్నా ప్రజలకు బాగా ద్వేషం ప్రబలింది. దీనిని కమ్యూనిస్టులు అదునుగా తీసుకుని సమ్మెలువగైరా ప్రారంభించారు జనవరి నెలలోనే సింగపూర్‌లో బ్రహ్మాండమైన సమ్మె జరిగింది. అప్పుడు ఆ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌నే రద్దుచేశారు. ఈ నిర్బంధకకృత్యం వల్ల కార్మికులు హింసావిధానానికి పాలుపడవలసి వచ్చింది. క్రమేణా ఆ అసంతృప్తి, కమ్యూనిస్టు ప్రచారము, యుద్ధంలో జపాన్‌వారు ఓడిపోయిన తర్వాత వారు మలయన్‌లకు వశపరచిన ఆయుధాలు—అన్నీ కలసి ఇప్పుడు దౌర్జన్యరూపం దాల్చాయి. తోటయజమానులు చైనీస్ కంట్రాక్టర్లు ఎక్కువగా చంపివేయబడుతున్నారు ఈ తిరుగుబాటుదారులందరు కమ్యూనిస్టులేనని చెప్పటం సత్యంకాదు. కాని కమ్యూనిస్టుప్రేరను ఎక్కువగా లేకపోలేదు. ఈ దౌర్జన్యాలను అరికట్టటానికి బ్రిటిష్‌వారు తమ సైనికశక్తిని యావత్తునూ వినియోగిస్తున్నారు. ఎవరో ప్రజలతో సంబంధంలేని కొద్దిమంది తిరుగుబాటుచేస్తే తేలికగా అణచివేయవచ్చును గాని ప్రజానీకాన్నంతటినీ సైన్యంతో ఎట్లా అణచివేయగలరు? మలయా ఆర్థికపరిస్థితులను చక్కబరచి, కార్మికులకు అదనపు సౌకర్యాలు కల్పించి, చైనీస్, మలయన్ వివాదాలను రెండువర్గాలవారికి సంతృప్తికరంగా వారిలో వారే పరిష్కరించుకునేటట్లు చేసి, ఎక్కువ రాజకీయాధికారాలు యిస్తే కమ్యూనిస్టులువున్నా లేకపోయినా, మలయా అశాంతి తనంతటదే తగ్గిపోగలదు. ఇందుకు బ్రిటిష్‌వారు ఇంతత్వరలోనే అంగీకరించేటట్లులేరు. కొన్నాళ్ళపాటు మలయా ఈవిధంగా అశాంతితో క్రుగ్గక తప్పనట్లే వున్నది.

శ్రీ॥ శే॥ కోటంరాజు పున్నయ్యగారు

[సుప్రసిద్ధ పత్రికా సంపాదకులైన శ్రీ కోటంరాజు పున్నయ్యగారు గత మంగళవారంనాడు అకాలమరణము నొందినందుకు చాల విచారము వెలిబుచ్చుచు, వారి సోదరులు (సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు) శ్రీ కోటంరాజు రామారావుగారికీ, శ్రీ పున్నయ్యగారి సతీమణికీ మా సానుభూతి వెలువర్చుచున్నాము. ఉత్తరదేశమునందలి ఆంగ్లపత్రికా సంపాదకులలోకెల్ల ఈ ఆంధ్ర సోదరద్వయము, ఉత్తమోత్తములుగను, నిర్భీకులుగను, జాతీయ సేవానిరతులుగను, మిన్నయైన పేరుగాంచిరి. ఆంధ్రపత్రికకు పూర్వబంధువులుగా విలసిల్లిన శ్రీ పున్నయ్యగారి ఆత్మకు శాంతి కోరుచూ, వారి జ్ఞాపకాలను ఇట ప్రచురించుచున్నాము.



శ్రీ కోటంరాజు పున్నయ్యగారు, సింధు నుద్ధరించిన ఆంధ్ర ప్రముఖుడు. ప్రయాగలో పత్రికాసంపాదకులుగా నుండి సంయుక్త రాష్ట్రములందు చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి గారి శ్రేణికి చెందినవారు శ్రీ పున్నయ్యగారు. వారు గంగదరి చేరితే వీరు సింధుదరిని కరాచీలో నుండి, అన్య రాష్ట్రాల ప్రజాసేవ చేసి కీర్తి గడించిరి. పత్రికా రచనయందు పేరు గాంచిరి. పున్నయ్యగారు అస్తమించుటచే, ఆంధ్రదేశమునకే గాక యావద్భారతమునకు లోటు వాటిల్లిన దనుటలో అతిశయోక్తి లేదు.

శ్రీ పున్నయ్యగారు చీరాలవాస్తవ్యులు. చదువుకున్నప్పటినుండి సంఘసేవా ప్రజాహిత కార్యములం దాసక్తి గల్గియుండిరి. హైస్కూలు చదువులనాడే, శ్రీ వీరేశలింగం పంతులుగారు ఆంధ్రదేశంలో సంఘసంస్కార వితంతూద్వాహములు చేయించుచున్నపుడు, వారి ప్రచారముచే ఆకర్షింపబడి ప్రార్థనసమాజమునందు చేరిరి. పంతులుగారు చేయించిన వితంతువివాహమునకు హాజరయినందుకు, పున్నయ్యగారి తలిదండ్రులు బుర్ర గొరిగించి ప్రాయశ్చిత్తము చేయించినందున, ఆ నాటినుండియే, తాను సంస్కరణ వివాహం చేసుకోవాలని నిశ్చయించినట్లు ఒకచోట పున్నయ్యగారు వ్రాసియున్నారు. ఈ యుదంతము వారి స్వతంత్ర బుద్ధికి నిదర్శనము. అప్పటినుండి దేశిరాజు పెదబాపయ్య, కవికొండల సాంబశివరావు, వేదాంతం కృష్ణయ్య మున్నగు సంస్కారప్రియులతో కలసి ప్రచారం చేయుచుండిరి.

శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు, బొంబాయిలో ఆంధ్ర పత్రిక స్థాపించినపుడు, వారికి సాయముగా అక్కడకు చేరి వారపత్రికగా నుండిన ఆంధ్ర పత్రిక నిర్వహించుటలో వారికి తోడ్పడిరి. ఆ పనితోబాటు బొంబాయిలో బ్రహ్మసమాజవర్గములందు కలసి సంఘసంస్కార ప్రచారము చేయుచుండిరి. అపుడొక మహారాష్ట్రకుటుంబంతో పరిచయమయి, విద్యావతియగు వారి కన్య తారాబాయి గారిని వివాహమాడిరి. ఆంధ్రపత్రిక మదరాసునకు దినపత్రికగ మారినపుడు పున్నయ్యగారు మదరాసు వచ్చి సహాయ సంపాదకులుగా నుండిరి.

ఆంగ్లపత్రికకు మారుట

మదరాసులో బ్రహ్మసమాజం మిషనరీగా నుండిన శ్రీ జయంతి వెంకటనారాయణగారితో కలసి, క్రైస్తవమిషనరీల ప్రచారానికి విరుగుడుగా బ్రహ్మసమాజ ప్రచారం ఉగ్రతంగా జరిపి దాని వ్యాప్తికి పట్టుదలతో కృషిచేసిరి. ఆరోజులలో రాజకీయాందోళన, హోమురూలు ఉద్యమములతోబాటు, సోషలు రిఫారము సభలు, థీస్టికు కాన్ఫరెన్సులు, ప్రచారము గూడ ఎక్కువగా నుండెవి. ఈ ప్రచారాలన్నింటికి పత్రికల తోడ్పాటు అవసరం. కనుక పత్రికారచయితలకు, సంఘసంస్కారులకు అన్యోన్యత ఎక్కువగా నుండేది. పూనాలో సోషలు రిఫారము పత్రికా సంపాదకులగు నటరాజనుగారు యీ వర్గానికి అగ్రగణ్యులుగా నుండేవారు. మదరాసులో శ్రీ జ॥ వెం॥ నారాయణ, పున్నయ్యగార్లు "హ్యూమానిటీ" అను ఆంగ్ల పక్షపత్రిక స్థాపించి, ఆస్తికమతప్రచారము కొనసాగించుచుండిరి. జోన్సు వీథిలో "రామమోహన థీస్టికుహోము" అని విద్యార్థి నిలయం స్థాపించిరి. వీథివీథికి తిరిగి నాగరసంకీర్తనలు, ఆదివారం సభలు చేసి బ్రహ్మమతబోధ, దీనజనోద్ధరణ చేయుచుండిరి. "హ్యూమానిటీ" పత్రికలోని పున్నయ్యగారి రాతలు, సింధు రాష్ట్రంలో నున్న గొప్ప సంఘసంస్కర్త టి. ఎల్. వాస్వానిగారి నాకర్షించినవి. వారు కరాచిలో "న్యూటైమ్సు" అను పత్రిక స్థాపించి దానికి సంపాదకునిగ పున్నయ్యగారి నాహ్వానించిరి. 1918 లో, పున్నయ్యగారు, యీరీతిగ స్వరాష్ట్రం విడువవలసివచ్చెను. అంతవరకు అత్యంతాదరాభిమానములతో చూచి బొంబాయిలో తన యింటిలో సభ్యునిగ నెంచి పుత్రవాత్సల్యంతో చూచి, యీ వృత్తియందు పున్నయ్యగారికి ప్రోత్సాహ మొసంగిన శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు, అన్యరాష్ట్రములలో ఆంధ్రుల జండా నిలుపబోవుచున్న యువకునకు యెట్టి నిరోధము చెప్పక ఆశీర్వదించి పంపిరి. కరాచీలో కొద్ది మాసములలోనే న్యూటైమ్సు పత్రికను విడచి, "సింధుఅబ్జర్వరు" పత్రిక సహాయ సంపాదకుడుగాను పున్నయ్యగారు పనిచేసిరి. ఆ రాష్ట్రమున హిందువుల పట్టుగొమ్మయగు ఆ పత్రికను వృద్ధికి తెచ్చి, ఆ పత్రికద్వారా ఆ రాష్ట్రంలో అల్పసంఖ్యాకులుగా నున్న హిందువులకు రాజకీయచైతన్యం కలిగించింది పున్నయ్యగారే అని చెప్పవచ్చును.

సింధులో పున్నయ్యగారు పత్రికా రచన, సంఘసంస్కారములందే గాక, రాజకీయములందుగూడ పాల్గొనిరి. పెక్కు సంవత్సరములు కరాచీనుండి అ. భా. కాంగ్రెసు సంఘ సభ్యులుగా నెన్నుకొనబడిరి. కరాచీ కార్పొరేషను సభ్యులుగ నుండిరి. వీరి స్వగృహ మున్న పేటకు, కార్పొరేషనువారు వీరియందు గౌరవం చూపుటకుగాను, "పున్నయ్యపూరు" అని పేరిడిరి. కరాచీ కాంగ్రెసు జరిగినపుడు, వీరు ఆంధ్ర ప్రతినిధులకు పెక్కండ్రకు ఆతిథ్య మిచ్చిరి. వీరి భార్య డా॥ తారాబాయిగారు, స్త్రీల వాలంటీరు దళం కెప్టెనుగ నుండెను. ఆమె ఒక నర్సింగు హోము స్థాపించి, పేదలకు ఉచితంగా చికిత్స చేయుచు, మంచి వైద్యురాలుగ కీర్తి గాంచెను. పున్నయ్యగారు ఆంధ్ర యువకులు కొందరిని సింధున కాహ్వానించి, పత్రికా రచనయందు తర్ఫీదుచేసి ప్రయోజకుల నొనర్చిరి. ఆంధ్రు లన్నను, ఆంధ్రరాష్ట్ర మన్నను వీరి కమితాభిమానము.

పత్రికా రచనయందు వీరు స్వయం కృషి వల్లనే వృద్ధికి వచ్చిరి. పట్టభద్రుడు కాకున్నను, ఇంగ్లీషు రచనయందు మంచి కృషిచేసిరి. ఉపద్రవము తెచ్చిపెట్టని, నేర్పయిన విమర్శలు చేయుచుండిరి. "షాటు అండ్ షేలు" అను శీర్షికతో తమ పత్రికలో, సంఘమునందు రాజకీయములందు, ధనికవర్గాలందు, కొన్ని ప్రత్యేక గురుకూటములందు గల కుళ్ళునంత జలకడిగేసేవారు. కొన్ని సందర్భాలలో వీరిని, విరోధులు కొందరు కోర్టున కెక్కించినను, చివరకు వీరే విజయము పొందిరి. అఖిలభారత పత్రికాసంపాదకుల సభ స్థాపించబడిన నాటినుండి ఆమరణాంతమూ వీరు స్థాయిసంఘసభ్యులుగ ఏటేట ఎన్నుకొనబడుచుండిరి. వీరు స్వతంత్రులు. తమకు న్యాయమని తోచినచో, ఎంద రడ్డు చెప్పినా, వినుకోడని ధీరచిత్తులు. సింధు అబ్జర్వరు పత్రిక సంపాదకులుగా వీరు సుమారు 17 సంవత్సరములు పనిచేసిన పిమ్మట ప్రొప్రయిటరులు మారిపోవుటచే, క్రొత్త అధికారులు వీరిని సంప్రదించకుండా సంపాదకీయ రచనల విషయమునందు ఒక రకం వార్తలకు ఎక్కువ ప్రచార మివ్వవద్దనియు ఆజ్ఞాపించేసరికి, వెంటనే పనికి రాజీనామా నిచ్చినట్లు టెలిఫోనులో చెప్పి పని వదలిరి. తరువాత కొన్నిమాసాలకు ఆ యజమానులే తమ తప్పు సవరించుకొని, పున్నయ్యగారి షరతు లంగీకరించి తిరిగి వారినే సంపాదకులుగ నియమించిరి. అప్పటినుండి "సింధుఅబ్జర్వరు" పత్రికను నిరాఘాటంగా నిర్వహించిరి. మొత్తం 27 సం॥లు సింధుకాపురస్థు లయినాక, పాకిస్తాను విభజన జరుగుటచే గత డిసెంబరులో వీరు కరాచీవిడచి, స్వరాష్ట్రానికి రావలసివచ్చెను.

65 సం॥ వృద్ధు లగుటచేతను, అనేక కుటుంబ కష్టము లనుభవించుటచేతను, బెంగుళూరు అనుకూలంగా నుంటుందని తలచి, అచట స్థిరనివాస మేర్పరచుకొనిరి.

వృత్తియం దతనిని కీర్తికాంత వరించింది కాని, అదృష్టదేవత మాత్రం వీరిని చిన్నచూపు చూచింది. అన్యరాష్ట్రకాంతను వివాహమాడిన వీరి సంస్కార ప్రియత్వమున కనుగుణ్యంగా వీరి పెద్దకుమారుడు పార్సీ కన్యను వివాహమాడెను. ఇంపీరియలు బ్యాంకులో పనిచేయుచుండిన ఆ జ్యేష్ఠపుత్రుడు, నిరుడు బెంగుళూరులో నీటిగండమున తన చిన్నకుమారునితో గూడ చనిపోయెను. అంతకుముందే, రెండవ కుమారుడు మొన్నటి యుద్ధంలో వైమానికుడుగా నుండి వీరస్వర్గ మలంకరించెను. ఈతని అల్లుడు కూడ వైమానిక ప్రమాదంలో నుండి కాలధర్మము నొందెను. వివాహమున కున్న యింకొక కుమార్తె, మనుమలు, కోడలు, కూతురుతో మిగిలిన కాలం శాంతంగా గడిపెదామని తలంచి వృద్ధదంపతులు బెంగుళూరులో నుండగ, పున్నయ్యగారిని మృత్యుదేవత బొంబాయి కాహ్వానించినట్లుంది. అచట గతవారం జరిగిన అ. భా. పత్రికా సంపాదకుల సభను చూడబోయిన పున్నయ్యగారు, జూలై 27 వ తేదీ ఉదయం షికారుపోయి, తిరిగి బసకు రాలేదు. ఆస్పత్రిలో వీరి శవం గుర్తించబడింది. పోలీసులు దానిచటికి చేర్చిరి. తన కుమారులు అల్లుడు వలెనే పున్నయ్యగారు ఆకస్మికంగా మరణించిరి. సునాయాసమరణం ఎంతో పుణ్యాత్ములకు గాని లభించదు. వీరి ఆత్మకు భగవంతుడు శాంతి నొసగు గాక. (ఒక మిత్రుడు.)

భారతీయ పత్రికా రచయితలలో అద్వితీయమైన ఘనతను చేపట్టి, ఇరువది ఏడేండ్లపాటు ఒక ఆంగ్ల దినపత్రికకు సంపాదకుడుగా వ్యవహరించిన శ్రీ కోటంరాజు పున్నయ్యగారి జీవితము ప్రతిభా జీవితము. ఇన్ని సంవత్సరములు ఒకే పత్రికకు ఒకే వ్యక్తి సంపాదకుడుగా ఉండుట భారతీయ పత్రికా రచయితలలో చాలా అరుదు. తన చేతులలో పుట్టిపెరిగి, తన నిర్విరామకృషి ఫలితంగా అగ్రశ్రేణిని అందుకొగలిగిన "సింధు అబ్జర్వర్"తో శ్రీ పున్నయ్యగారు సంబంధము వదలుకొన్నారు.

శ్రీ పున్నయ్యగారి జన్మస్థలం బాపట్ల. వీరు చిన్నతనంలోనే బొంబాయికి తరలిపోయి అక్కడే కొద్దిగా విద్యనభ్యసించి, శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి వ్యాపారములో చేరి, తరువాత నెమ్మదిగా పంతులుగారు అక్కడ ప్రారంభించిన 'ఆంధ్రపత్రిక' వారపత్రికలో ప్రవేశించారు పత్రికా రచయితగా పున్నయ్యగారి జీవితానికి పునాది 1908 లోనే వేయబడింది.

ప్రారంభింపబడిన కొద్ది సంవత్సరాలకే ఆంధ్రపత్రిక మద్రాసుకు బదిలీఅయి, తరువాత దినపత్రికగా వెలువడడం ప్రారంభించింది. ఆంధ్రపత్రిక ఇంగ్లీషు సెక్షన్ పున్నయ్యగారి ఆధిపత్యం క్రింద ఉండేది. పత్రికా రచనలో తలమునిగేటంత పని ఉన్నప్పటికీ, యేదోవిధంగా తీరిక చేసుకొని రాజకీయాలలోగూడ ప్రమేయం కల్పించుకొంటూ ఉండేవారు. అప్పుడే ఆరంభమైన హోంరూల్ లీగ్ అంటే ఎంతో అభిమానం కలిగి, దానికోసం పాటుబడుతుండేవారు. అనేక సభలలో, ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ అనర్గళంగా వుపన్యాసము లిస్తుండేవారు.

పున్నయ్యగారు సహజంగా సంస్కరణాభిలాషి. డా॥ తారాబాయిని వివాహమాడేందుకై తన సంఘాన్ని గూడ వదలిపోయిన సాహసుడు. వీరిది ప్రేమ వివాహము. ఉభయుల ప్రేమ పరిపక్వమై, హృదయాలు కలసిపోయినవి. వివాహానంతరం తన భార్యతోపాటు, బ్రహ్మసమాజంలో చేరారు. మత విషయికంగా తన అభిప్రాయాలను వ్యక్తీకరించేటందుకుగాను "హ్యూమానిటీ" అనే వారపత్రికను ప్రారంభించారు. ఈ పత్రికకు బహుళప్రచార ముండేది. ముఖ్యంగా దూరమున ఉన్న సింధురాష్ట్రీయులు యీ పత్రికా సంపాదకుని మేధాసంపత్తిని గుర్తించి, ఆయనను పిలిపించుకొన్నారు. "న్యూటైమ్సు" అనే పేరిట ప్రచురితమవుచున్న దినపత్రిక సంపాదకుడు పున్నయ్యగారిని పిలిపించాడు. "న్యూటైమ్సు" సహాయ సంపాదకుడుగా శ్రీ పున్నయ్యగారు ఒంప్రథమంగా 1918 లో సింధురాష్ట్రంలో కాలు పెట్టారు.

అయితే 'న్యూటైమ్సులో' ఒక సంవత్సరం పాటైనా ఉండకుండానే 1919 లో పున్నయ్యగారు సింధుఅబ్జర్వర్‌లో ప్రవేశించారు. అప్పట్లో సింధు అబ్జర్వర్ పత్రిక వారమునకు

(20 వ పేజీ చూడుడు)

సాహిత్యమీమాంస:



సందేశకావ్యములు: కథానాయకుడు

శ్రీ కొమాండూరు కృష్ణమాచార్యులు

సరసకవిత్వతత్త్వపటు
సంపద గల్గు కవీశ్వరుండు దా
నరసి యఖండకావ్యమణి
హారము గూర్చెడునప్పు డుజ్జ్వల
స్థిరపరిపూర్ణమండలవి
శేషగుణాస్పదమైన రత్నముల్.
గర మనురక్తి నెత్తికొని
నాయకరత్నము సేయ నొప్పగున్
సురుచిరకావ్యశోభకయి
సుందరరూపు వదాన్యు నుజ్జ్వలున్
బరమును దివ్యునైన గుణ
భవ్య మహోన్నతు లోకవంద్యునిన్
ధరణిశశాంకవంశ్యనృప
తల్లజులం దొక నాయకోత్తమున్
వరగుణపూర్ణు గైకొని ప్ర
బంధము గూర్చిరి పూర్వసత్కవుల్.

సామాన్యముగా లోకమున బాలురను నిద్దుర బుచ్చుటకై వృద్ధులు సెప్పు కథలందును "అనగనగ ఒకరాజు" అని చెప్పు వాడుక కలదు. దీని తాత్పర్య మేమి? యని విచారింపవలెను. అనగనగ నొకడు గలడనిగాని, యొక బిచ్చగాడనిగాని చెప్పు వాడుక లేదు సుదర్శను డను రాజు గల డని యాతని పేర్కొనుటయును గలదు. ఇది లోక మర్యాద.

ఈ నాయకవిచికిత్సనుగూర్చి యాదికవి యగు వాల్మీకియభిప్రాయము విచారింప దగినది. ఈయన తీయని తేనెసోనలు గురియు పలుకులు పచరించుటలో మేటి యగుటవలన "మధుమయ ఫణితీనాం మార్గదర్శీ మహర్షిః" అని భోజ సార్వభౌముడు వచించియున్నాడు. ఈయన శ్లోకమే కదా వాఙ్మయ ప్రథమ శ్లోకము. వాణీవిలాసమును మర్త్యలోకమున నవతరింప జేయుటకై పుట్టం బుట్టిన ఫణిపతి.

"మా నిషాద, ప్రతిష్ఠాం త్వ
మగమః శాశ్వతీ స్సమాః
యత్ క్రౌంచమిథునా దేక
మవధీః కామమోహితమ్".

అని యప్రయత్నముగా గరుణరసవేదియగు మునిహృదయమునుండి ఛందోబద్ధమగు వాగమృతము వెల్లివిరిసినది. తమసానదీపరిసరవనాంతములు ప్రశాంతగంభీరములై మహర్షి హృదయము నాకర్షించినవి. తద్వనరామణీయకము నుపన్యసించుచు భరద్వాజునితో గూడ మాధ్యాహ్నిక స్నానమొనరింపబోవు తపస్వి కాకస్మికముగా నతినృశంసమగు కిరాతకృత్యము కంటబడినది. సంక్షుబ్ధ హృదయుడగు మౌనివరుని ముఖమునుండి తంత్రీలయసమన్వితమగు వీణాస్వరమువంటి మృదుమధురవాక్యము వెలువడినది. ఇట్టి వాక్యమును రామాయణ మహావాక్యముగా రచియింపక వ్యర్థము సేయజనునా? కథా రచన మొనరింపవలెను. ఇందులకు ప్రథమోపకరణము నాయకమణి దానిని సమకూర్చుకొని తక్కిన రత్నముల నన్వేషింపవలయును. ఈ కథా పురుష జిజ్ఞాసలో కవివరు డుండు సమయమున నారదుడేగుదెంచెను. మహాపురుష సందర్శన మైనపుడు మనసును మథించుచున్న ప్రశ్నమునకు సమాధానమును గోరి—

కో న్వస్మిన్ సాంప్రతం లోకే
గుణవాన్ కశ్చ వీర్యవాన్
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ
సత్యవాక్యో దృఢవ్రతః"

అని సకల గుణాలంకార పరిపూర్ణుడగు నాయకుని గూర్చి విపులముగా ప్రశ్నించెను. "బహవో దుర్లభా శ్చైవయే త్వయా కీర్తితా గుణాః" అని మరుపలికి మహర్షి శ్రీరామచంద్రుని నాయకునిగా నొనరించి కావ్యము రచింపుమని సకల కల్యాణగుణ పరిపూర్ణుడగు నాయకుని నొసంగెను.

"ఉపశ్లోకయితవ్య మహోత్సాహ దుజ్జ్వలాః కావ్యసంపదః" అని రామాయణము నాయకునిచే గుణవంతమై "సీతాయాశ్చరితం మహత్" అనుటవలన నాయికచే గుణవత్తరమయినది. దీనికి ప్రమాణము "శ్రీమద్రామాయణమపి పరం ప్రాణితి త్వచ్చరిత్రైః" అని యభియుక్తోక్తి.

భారత మంతయు 'నింద్రజాదోశ్చరితప్రబంధ' మని రామరాజభూషణుడు వచించెను. శ్రీకృష్ణ చరిత్రమని వేదాంతుల మతము. కావున నెట్టెనను నాయకగుణపరిపూర్తికి కొరత లేదు. విద్యానాథుడు, సమస్త శాస్త్రములును పరమ నిశ్శ్రేయస బోధకములగుటవలన బరమపురుషనాయకత్వము గలవనియు, సిల్లే దర్శనములు ననియు వచించెను. తక్కిన (సంస్కృత) ప్రబంధములన్నియు నుజ్జ్వలనాయకములే. ఆంధ్రప్రబంధములు వాని ననుసరించు చున్నవి.

ఇక పాశ్చాత్య ప్రబంధములు నీ మార్గమునే యనుసరించుచున్నవి. షేక్స్పియరు నాటకకథాపురుషులందరును మహాపురుషులే. వారు రాజులో, రాజతుల్యులో గానోపుదురు. ఇట్లు కథాప్రపంచమును బాచరించుటయేల? సామాన్య పురుషుని నాయకునిగా నేల గ్రహింపరాదు? అని విచారింపవలెను.

లోకమున మానవమానసిక ప్రవృత్తియే దీనికి సమాధానము. మహాపురుషులకు సంబంధించిన వ్యవహారములే బహుజనులకు జిజ్ఞాస్యము లగుచున్నవి. సామాన్యుల గృహకృత్యములతో నెవ్వరికిని బనిలేదు. "యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః" అని గీతా రహస్యము. "రామాదివత్ ప్రవర్తితవ్యం; న రావణాదివ" త్తని నీతిని బోధించుట యాధర్మకవిత్వమునకు పరమావధి. ప్రపంచవాఙ్మయమే. ఈమార్గము నవలంబించినది. ఈ సిద్ధాంతమే కావ్యములయం దన్వయవ్యతిరేకదృష్టాంతములవలన నిరూపింపబడుచున్నది ప్రతినాయకునియందు వ్యతిరేక దృష్టాంతమూహ్యము. "పౌలస్త్యః కథ మన్యదారహరణే దోషం న విజ్ఞాతవాన్" అనునట్లు రావణు డభిజనవృత్తపరాక్రమాదిగుణములయం దసమానుడయ్యును పరదారాభిమర్శమువలన నశించెను. దుర్యోధనుని పతనమునకు రాజ్యలోభమే కారణము. నెపోలియన్ పతనమునకు దురాశ (Ambition) ఇట్లే సనాతనాధునిక కథాపురుషుల శీలముల నూహించుకొనునది. Hamlet, Othello, King lear & maebeth) త్తనునాటకములు జగద్విఖ్యాతములై "కష్టాంతనాటక చతుష్టయ"మని పేరుగాంచినవి. వీనిలో డెన్మార్కు రాజపుత్రుడగు హామ్లెట్ ధార్మికుడు, పితృభక్తుడు, మాతృగౌరవముగలవాడు, పరాక్రమశాలి; శీలసంపన్నుడు. సర్వవిధములనుత్తముడు. కాని "To be or not to be; thatis the question" అని నిరంతరకార్యచింతాసకుడై పితృహంతకుడగు పితృవ్యుడు వధ్యుడా, కాడా యని నిర్ణయింపనేరక యున్మాదావస్థలోనై సర్వనాశన మొనరించుకొనెను. ఒథెల్లో అసూయాపరుడై నిరపరాధినియగు గృహిణిని హింసించెను. లియర్ స్తోత్రప్రియుడు; మేక్బెత్తు దురాశాపరుడు. వీరందరును సర్వవిధముల గుణపరిపూర్ణులయ్యు నొక దోషమువలన పతితులైరి. "స్యాద్వపుః సుందరమపి శ్విత్రేణైకేన దుర్భగమ్"—సర్వాంగ సుందరమగు దేహము ఒక్క బొల్లి మచ్చవలన వికారమగుటలేదా; అట్లే కష్టాంతనాటకములందు నాయకగతమగు దోషమొకటి అంతకంతకు ప్రబలమై సుగుణముల నాక్రమించి, భయంకర రూపమునుదాల్చి తుదకు నాయకపతనమునకు హేతువగు చున్నది. కావున "గుణవాన్ నాయకో మతః" అను నాలంకారికోక్తి సమంజసము.

నాయకపాత్రపోషణమును గూర్చి మహాకవి పద్ధతియు నాలంకారికసమ్మతియు నిట్లున్నను ప్రతిభాశాలురగు మహాకవులు గూడ నేతృచరిత్రమును బోషించుటలో భ్రమప్రమాదములకు లోనగుచుందురు. కరుణరసపోషణమున గృతహస్తుడును, ఉత్పాద్యవస్తునిర్మాణదక్షుడును, వీరరసపోషణచణుడు నగు భవభూతి తన యుత్తరరామచరితమున నాయకపోషణమున కుశలవశీలమోహితుడై శ్రీరామశౌర్యమును చిన్నబుచ్చెను.

"వృద్ధా స్తేన విచారణీయచరితా
స్తిష్ఠన్తు కిం సాంప్రతమ్
సుందస్త్రీదమనే ఒప్యఖండయశసో
లోకే మహాంతో హి తే
యాని త్రీ ణ్యకుతోభయా న్యపి పదా
న్యాసన్ ఖరాయోధనే
యద్వా కౌశల మింద్రసూనునిధనే
తత్రా ప్యభిజ్ఞో జనః"

అను శ్లోకమున, తాటకావధను, ఖరసంహారమును, వాలిని గూలనేయుట నుగ్గడించి కావ్యసర్వస్వభూతుడగు నాయకుని పరాక్రమమునకు గళంకము నాపాదించెను. నాటక కవు లందరును వాలిని ప్రత్యక్ష సంగరమున వధించినట్లే నిరూపించిరి. భవభూతియు నట్లొర్చియు నిచట ప్రమాదమునకు లోనయ్యెను. 'ఇట్లొనర్పుట యనుచితము' కాళిదాసు పాత్రపోషణమున బరమోత్కృష్టుడు. దుష్యంతశీలమును బలుచోటుల నుగ్గడించి యాతని ధర్మతత్పరతను బరద్రవ్యవిముఖత్వమును, బరదారలగోరకుండుటయు మున్నగు ననేకగుణముల నాయా ఘట్టముల వివరించెను. రఘువంశమున రఘుమహారాజు శీలమును బరిపూర్ణగుణసుందరముగ నావిష్కరించెను. మిగిలిన కావ్యము లన్నిటియందు నిట్లే యొనరించెను. కాని రసఖండ మన దగిన మేఘ దూతమున నాయకుని పేర్కొననైన లేదు.

"కశ్చిత్ కాంతావిరహగురుణా
స్వాధికారాత్ ప్రమత్తః
శాపేనాస్తంగమితమహిమా
వర్షభోగ్యేణ భర్తుః
యక్ష శ్చక్రే జనకతనయా
స్నానపుణ్యోదకేషు
స్నిగ్ధచ్ఛాయాతరుషు వసతిం
రామగిర్యాశ్రమేషు"

అను శ్లోకమును కావ్యాదియందు రచించెను. ఇందు నాయకు డొక పేరులేని జక్కులకొలము వాడు. అధికారనిర్వహణమున బ్రమత్తుడు. శాపవశమున మహిమను గోలుపోయి వెఱ్ఱియెత్తి రామకూటాశ్రమములందు ద్రిమ్మరుచుండువాడు. చేతనాచేతనపరిజ్ఞానశూన్యుడు. ఇట్టి వానిని గథాపురుషునిగా నొనరించుటలో గవియాశయము దుర్భేధముగ నున్నది. ఇదియు, ప్రమాదమే కాని, యిట్టివి మహాప్రతిభావంతుల కావ్యములలో గవితాచమత్కృతియందు మరుంగువడి యున్నవి. అయినను నెరసులే యగును.

హంససందేశ కావ్యమునం దీ విషయ మత్యంత విలక్షణముగ నున్నది.

హంసదూతమున—

"నేత రఘూద్వహుం డిచట;
నేరుపు గల్గిన మాటకారి వి
ఖ్యాతుడు దూతకృత్యముల
హంసవరేణ్యుడు; లోకమాతయౌ
సీతకు రామచంద్రునకు
జేసెడు దౌత్యము కావ్యవస్తు; వే
రీతి ముదంబు గూర్ప దుర
రీకృతభవ్యకవిత్వసంపదన్."

"కవికులశేఖరుండు తన
కావ్యమునం దొక యక్షమాత్రునిన్
గువలయనేత్రి బాసి వని
ద్రిమ్మరువాని బ్రమత్తు యక్షరాడ్
భవనవనానుపాలకుని
భావజలోలు విలుప్తధైర్యు నై
శ్రవణుని దాను నొక్కరు న
పంజ్ఞుని నాయకు జేసె నేలొకో!"


హంసదూతమున నాయకు డున్నతో—
"శ్రీనాథుండు జగన్నివాసుడు సునా
సీరాదిబృందారక
శ్రేణిప్రార్థనచే దశాస్య బలరా
శి శ్రేణి మర్దింపగా
నా నారాయణుడే యనంతబలశౌ
ర్యౌదార్యగాంభీర్యముల్
దా నావంతయు గోలుపోవకయె మ
ర్త్యత్వంబు నొందెన్ భువిన్."

మేఘదూతమున—
"ధనపతిసేవకుం డొకడు
త ప్పొనరించిన, యక్షనాథుడున్
మనమున గొంత లేక దయ
మాలి యొసంగెను వర్షభోగ్యమౌ
ఘనతరశాప; మాతడును
కాంతను బాసి నిరస్తశక్తియై
వనముల రామకూటముని
వాటికలం జరియించె వెఱ్ఱియై.

ఇచట నాయకునియందు గార్య నిశ్చయము సువ్యక్తము.

వరమానాత్మజు డబ్ధి దాటి జనకా
పత్యంబు సేవించి రా
మవిభుం గాంచి తదీయమౌళివిలస
న్మాణిక్య మర్పించినన్,
సవిశేషంబుగ గారవించి హనుమత్
శౌర్యంబు దీపింపగా
రవితేజుండు సమస్తరాక్షసవధా
రంభోరుసంరంభియై.
రేపకడన్ వలీముఖవ
రేణ్యుని సైన్యము బన్నబంచి సీ
తాపతి జానకీవిరహ
తాపభరప్రవిలుప్తధైర్యుడై
యేపున బద్మమరిడమున
నింపులు గుల్కెడు రాజహంసనున్
దీపితభావుడై కనియె
దీప్రశశాంకమనోహరద్యుతిన్.
సీత బెడంగు నెన్నడల
చిన్నెలు నందల ప్రోతయున్ దుకూ
లాతతశుద్ధవర్ణమును
నంచల చిన్నెలు నందు గాంచి సం
పాతితధైర్యుడయ్యె రణ
భవ్యుడు రామవిభుండు వాశ్చరః
కేతను శాసనం బెవరి
కిన్ సమయంముల దాటరానిదౌ!
సీతను సంస్మరించి రఘు
సింహుడు తన్మయతన్ దదీయజీ
వాతువుగా నిజప్రణయ
వార్తను హంసముఖంబునన్ జగ
న్మాతకు దెల్ప దాని నలి
నంబుల బూజ యొనర్చె గావుకిన్
దూతల పాత్తు తొయ్యలుల
దోః పరిరంభముకన్న మిన్నయౌ!
మారుతికంటె నెక్కుడగు
మన్న నసేయుచు మల్లి కాక్షమున్
ధీరుడు రామచంద్రుడును
దీనత దూతనుగా వరించె నా
మారుని బారి బిడ్డనుకు
మారులు మేఘమహీధరాదులం
గోరిరి; చేతనప్రకృతి
గోరుట కొంత గుణంబె కాదొకో!?"

మేఘ - హంసదూతకావ్యముల బరిశీలించిన ననేకవిశేషములు గనుపట్టకమానవు.



కథానిక :

మా చంద్రం సంసారం

రచన : 'సుధ'

"వివాహం అన్న సంస్థ నిలబడాలంటే రెండు విషయాలు కావాలి—భర్త చెమిటివాడూ, భార్య గుడ్డిదీ అవాలి." అని వెంకటసుబ్బారావుగారు చెప్పించినది మా చంద్రం సంసారంతోనే తెలిసివచ్చింది నాకు. చంద్రం చదువుకున్నవాడూ వస్తుపరిజ్ఞానం కలవాడున్నూ. బొత్తిగా మేనత్తకూతురు కనేగాక, చూసిన తరువాత తనకు నచ్చే పెళ్లాడాడు—'తార'ని. ఈ పెళ్ళివిషయంలో 'తార' కూడ ఏవిధంగానూ బలవంతిపెట్ట బడలేదనే విన్నట్టు జ్ఞాపకం.

అంతమాత్రంచేత వాళ్లిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారనలేను నా వుద్దేశ్యంలో ప్రేమ, 'మనోవాక్కాయకర్మలా పరస్పర ఏకీభావం' అని అన్నా; మనసు తెలుసుకోవడం అన్నే తేలికైనది—అసంభవం కాకపోతే—కాదు గనుక, మిగతె రెండింటిలోనైనా ఉండితీరాలి. వీళ్ళ విషయంలో ఇవి జరగడానికి ఎంత మాత్రం పరిస్థితులు అనుకూలించలేదు.

చంద్రం కాలేజీ చదువులో తోటి అమ్మాయిల్ని గురించి తపనపడినా, రెండో పక్కనుంచి అనుకూల సూచనలు కానరానప్పుడు, 'ప్రేయసీ! ప్రేయసీ!' అని వెదకి వేసారి వెర్రి కాలేదు. అలా ఎంతోమందిని ప్రేమిస్తున్నాననుకోవడం తన్ను తనే మోసపుచ్చుకోవడమనీ, దానికి తన దౌర్బల్యమే కారణమనీ తెలిసికోగలడు.

ఉద్యోగంలో చేరేక, తలిదండ్రులడిగినప్పుడు, చూచిన తరువాతనే అంగీకరించి పెళ్ళాడాడు. ఆ అంగీకారాన్ని అతనిలో ప్రేరేపించినది మరి, 'తార' సంగీత మాధుర్యంలోనిదో? యౌవనాంగసౌష్ఠవంలోనిదో? ఆకర్షణ—తనూ సరిగా చెప్పలేడనుకుంటాను.

'తార' నాల్గో ఫారం వరకూ చదివేక, ఇంటిదగ్గర సంగీతమదీ నేర్చుకుంది. లోకజ్ఞానమదీ ఉన్నట్టే వుంటుంది, మరి. తలిదండ్రులడిగినప్పుడు బావను పెళ్ళాడడానికి తనూ అంగీకరించింది. చంద్రం చదువు ఘనతో? సంపాదన ప్రయోజనమో? మరి ఏ ఆకర్షణో?

మొదటి రోజుల్లో వాళ్ల జీవితనావ ఏ సుదుపూ లేకుండానే ప్రయాణం చేసేది. 'చాలా ప్రేమ వాళ్లిద్దరికీ!' అనుకునేవారు, అందరూను. వివాహానంతరం ప్రేమ జనించి, వృద్ధిపొందుతుందనే సిద్ధాంతంలో—ఏ కొద్దిపాటో—నమ్మకం వున్నవాణ్ణగుటంవల్ల నేనూ పొరపడ్డాను. పొరపడ్డానంటే కారణం లేకపోలేదు. వాళ్ల 'తార' కి తలనొప్పి వల్ల మొన్న రాత్రి నిద్ర పట్టలేదని వుత్తరంవచ్చిన సాయంకాలమే, తన్ను యిరవై నాళ్లనుంచీ ప్రేమించి పెంచుతున్న తల్లికి టైఫాయిడ్ జ్వరం రెండవ వారం గడుస్తున్నా, 'తార' ను చూసి వస్తానని బయల్దేరి, ఆ మూడోనాడు వచ్చాడంటే మరి తనకి ఎంత ప్రేమ లేకపోతే అలా చేస్తాడనుకుంటాను? తార కూడ చంద్రం విషయంలో అలానే సంచరించేదట.

ఇప్పుడు ఆరా తీసి చూస్తే ఇదంతా, కొత్తలో గనుక ఒకరిమీదొకరికి ఒక విధమైన గౌరవభావం ఉండడం, sex ఆకర్షణతో వృద్ధిపొందే పరస్పర ఇష్టత, చనువు, వీటి ఫలితంలా కనిపిస్తుంది. మాట, చేతల్లో కూడ భేదాలు అన్తే పాటింపబడి వస్తుంటూ—మోమాటంగా ఒకరితో నొకరు ఏకీభవించడంవల్ల. అనురాగం వృద్ధికావచ్చు కూడా కాని, ఇంతవరకూ నిజమైన ఏకీభావం — మాట, చేతల్లోనైనా— ఉందనడానికి తగిన బలం లేదు. ఇక్కడే నేను పొరపడ్డం జరిగుండాలి.

నెలల్లోనే ప్రమోషన్‌తో పట్నం బదిలీ కావడం, సంసారానుభవం లేని ఈ దంపతుల కొత్త కాపురాన్ని పరీక్షకు పెట్టింది. సంసారం సాఫీగానే పోతున్నట్టుండేది. చంద్రం ఆఫీసుకు పోయినప్పుడు, 'తార' సంగీతంతోనో చదువుతోనో కాలక్షేపంచేయడం; సాయంత్రం ఇద్దరూ ఏ బీచికో, సినిమాకో పోవడంకద్దు.

ఈ పట్నపు వాతావరణం వాళ్ళ నిజస్వరూపాలు బయటపెట్టడానికే పూనుకుంది

చంద్రం, తారతో చెరో రిక్షాలో బీచికి వెడుతున్నాడు. ఒక రిక్షాలో ఇద్దరు దంపతులనుకోవచ్చు ఏదో మాటలతో, నవ్వుకుంటూ 'తార' కంట పడ్డారు.

"ఏమండీ ఇద్దరెక్కగూడదన్నారు?" అంది. తార. తన పరసని రిక్షాలో కూర్చోడం 'చంద్రం' కి ఇష్టం లేదన్నట్లు భావించుకుందో? తనూ భర్తపక్కని అలా కూర్చోలేక పోయిన ఈర్ష్యో?

చంద్రం లోపల కొంచెం బాధపడే వుంటాడు.

"ఔను. ఎక్కగూడదు." అని ఊరకున్నాడు.

*　*　*　*

బస్సులో వెడుతూ చంద్రం, తార పక్కని కూర్చున్న స్త్రీకి కళ్లు వప్పజెప్పాడు. తార, చంద్రం కళ్ళలోనికి, ఆమె ముఖంలోకి, చూసినది ఎంతో ఈర్ష్య. క్రోధం. ఇంటికొచ్చాక అదనుచూసి, "అవును — బస్సులో అమ్మాయి లున్నట్టు నే నెలా వుంటానులెండి!" అని విసిరేసింది.

*　*　*

బీచి నుంచి తిరిగి వచ్చేస్తుంటే, చంద్రం సహపాఠి, పట్నంలో పనిచేస్తున్న ఆవిడ, కనపడి పలుకరించింది. ఇద్దరూ కాస్సేపు స్నేహం సంప్రతించుకున్నారు. అయితే, తారను కూడ పరిచయం చేశాడు. అప్పటికి తారకూడ ఆవిడతో సరసంగానే మాట్లాడింది.

ఆ మర్నాడు సాయంత్రం తార, ఏ సినిమాకో వెడదామని, ఉత్సాహంతో పనులన్నీ తేల్చుకుని ఎంచేతో కొంచెం అధికంగాకూడ సింగారించుకుండట చంద్రం కోసం చూస్తున్నది. రోజూ వచ్చేవాడు, ఆరోజు సాయంత్రం ఇంటికి రాలేదు. రాత్రి ఎనిమిది గంటలకప్పుడో వచ్చాడు. ఈ లోపులో తార మనసులో ఊహాలు చిందులు తొక్కుతున్నాయి. ఓర్పు నశించింది.

మనిషంతా చికాగ్గా తయారైంది—శివమెక్కినట్టు.

"నిన్న కనపడిన స్నేహితురాలూ వాళ్ళూ కనపడి తీసుకుపోతే సినిమాకు వెళ్ళేను, తారా!" భోజనం చేస్తూ చెప్పేడు—చంద్రం.

"నే నెంత ఉత్సాహంతో సింగారించుకుని సిద్ధపడితే నేం లెండి—మీ స్నేహితురాలితో మీరు సినిమాకు వెళ్ళి మీ సరదా తీర్చుకున్నారు. నా సినిమాకోర్కె మంటగలిస్తే ఎవరికేం?" మహా ఆక్రోశంతో అనేసింది, తార.

ఆ మర్నాడు, చంద్రం మామూలుగా సాయంత్రం వచ్చి, "ఏం తారా, ఇంకా తయారు కాలేదేం? సినిమాకు పోదాం" అన్నాడు.

"ఇంటి చాకిరీకేగా—నేను?.... ఇదెవరు చేస్తారు గనుక? మీకేం బయటనుంచి తిరిగి వచ్చేస్తారు. అయినా, నే లేకపోయినంత మాత్రాన మీతో సినిమాకు వచ్చేవారు లేక పోతారా యేమన్నానా?" నూటీగా మాట్లాడింది, తార. చంద్రం మాట్లాడదల్చుకోలేదు.

*　*　*

అసలు చెప్పడం మర్చాను. మా చంద్రంలో కవి కాబోయే లక్షణాలూ, అలవాట్లూ ఉన్నాయి. కథలవీ రాస్తుండేవాడు ఒకసారి చంద్రం వ్రాసిన కథ పత్రికవాళ్ళు—ఎంచేతైతేనేం—ప్రచురించారు. చంద్రంలేని సమయంలో ఆ పత్రిక ఇంటికి రావడం; తార చంద్రం రాసిన కథ చూడడం జరిగింది. తన భర్తపేరు కూడ అచ్చులో వున్నందుకు ఎంతో గర్వం, సంతోషం పొందింది. అయితే, మరుక్షణాన అదంతా ఈర్ష్య, దగ్గిరదగ్గిర శత్రుత్వంవరకూ మారింది. మొదటివాక్యం, "'శశి'ని చూసేసరికి నాలోని నరాలన్నీ నాట్యం చేశాయి" అని, 'శశి'ని చాలా అందగత్తెగా వర్ణించబోతున్నాడు అంతే. ఇక చదవలేదు. చంద్రం 'శశి' అనే దాన్ని ఎవర్నో ప్రేమించి ఊరుకున్నాడనీ, తనంటే ఇష్టం లేదనీ ఏవేవో అనుకుంది. పాపం, చంద్రానికి ఇదంతా ఎలా తెలుస్తుంది?

చంద్రంలో, అంతకంతకు—నమ్మకం తగ్గిపోతూంది, తారకి. ఇంకా ఎవరైనా ప్రియురాళ్లున్నారేమోనని అతని కాగితాలవీ తీసి చూసింది. చంద్రం, ఎందులోనో చదివి note చేసుకున్న "స్త్రీ అంటే చపలత్వానికి మారుపేరు." "ప్రతి ఆడుదీ తన హృదయంలో ఒక రంకులాడే." ఈ వాక్యాలు చూసింది. చంద్రం రాగానే "మీ మగాళ్లకి ఎంతచేసినా ఇంతే! ఎంతప్రేమ, విశ్వాసా లున్నా ఆడదంటేనే చులకన!" అంటూ ఉరుములు; వెంటనే వర్షం కూడ కురిపించింది.

ఇలాగ, అతని ప్రతిచేతకూ మనసులో తను బాధపడి, తప్పుగా భావించుకోవడం; ఆవిడ ప్రతిమాటకూ అతను ఎంతో బాధపడి సహించలేకపోవడం—ఒకరి మనసులో ఒకరు ఎడం అయిపోతున్నారు అతని ప్రతీచేతా, ఆవిడ క్రోధసౌధంలో ఒకోమెట్టుగా తయారవుతుంది. ఆవిడ ప్రతీ మాటా, ఇతనిలో అసహనం, అసహ్యం రేకెత్తిస్తున్నై.

ఇప్పుడా కాపురం సాగిస్తున్నది రెండు మనసులు కావు-యంత్రాలు. వంటచేస్తుంది-వస్తాడు. వడ్డిస్తుంది-భోంచేస్తాడు. ఆకు లిస్తుంది-వేసుకుంటాడు. బజారునుంచి కావలసినవి తెచ్చియిస్తాడు-తీసుకుంటుంది. పలుకరిస్తుంది—మాట్లాడతాడు. మాట్లాడతాడు-సమాధానం చెబుతుంది ఇంతే.

దానికంటె అందమైనవీ, విలువైనవీ, తనకు ఇదివరకు ఎన్నికొన్నాసరే, చంద్రం వాళ్ళ చెల్లెలికని కొన్న కోక చూచి, "అవును లెండి-ఇటువంటివి నా కెందుకు కొంటారు? పెళ్ళయిన ఇన్నాళ్ళకి నాకని ఇటువంటి దొక్కటి కొన్నారూ?" అని, ఈర్ష్య వెళ్ళబోసుకున్నది. చంద్రం ఎంతో బాధపడ్డాడు తనని బాధపెట్టడానికే, జీవితం అశాంతిపాలు చేయడానికే ఆమె పూనుకున్నదనుకున్నాడు.

గర్భిణీతో వుంది. నెలలతోపాటు ఆవిడలో శారీరకంగా కొంచెం దౌర్బల్యం రావడం, చికాకు, అసహనం, ఈర్ష్య కూడా ముందుకు నడుస్తున్నాయి. తన శక్తికొలదీ కావలసిన వన్నీ కొని తెచ్చియివ్వడం. ఎన్ని తెచ్చినా, తేని ఏదో ఒకదానికోసం ఆవిడ అసంతృప్తి చూపి, తెచ్చినవాటి విలువ లేకుండ జేయటం, ఆవిడ కావాలన్నదల్లా చేయడానికి 'చంద్రం' కి ఆర్థిక పరిస్థితులు అనుమతించకపోవడం—ఆవిడ ఆ విషయంలో ఏదో నూటిగా దెప్పడం......ఇదీ పరిస్థితి.

ఇంక ఆవిడలోగాని, అతనిలోగాని, సహనం నివసించ దల్చుకోలేదు ముఖ్యంగా, అతని చెవులు ఆమెనోటిమీద, ఆమె కళ్లు అతని చూపు చేతలమీద ఇంక విశ్వాసరాహిత్యం ప్రతిపాదించకుండా ఉండలేకపోయాయి

తార, వాళ్ళమ్మ 'కాంతం' ని ఎలాగా పురిటికి తీసుకెళ్లడానికి రాదల్చుకున్నదే—త్వరలో రప్పించి, అల్లుడిగారి విషయంలో తన ప్రతిపాదనకు ప్రతిపాదకురాలుగా ఉపయోగించుకోవాలనుకుంది

కాంతం—మేనల్లుడే గనుక — చంద్రంతో కొంచెం చనువు తీసుకుని చీవాట్లు పెడ్దామనుకునే బయలుదేరింది.

'చంద్రం' 'కాంతం' ని చూసి, ఆవిడ ఏదో మాట్లాడ మొదలు పెడుతుండగనే తను, తన విశ్వాసరాహిత్య ప్రతిపాదనకు ఆవిణ్ణే ప్రతిపాదకురాలిగా చేసుకుని, 'తార' విషయంలో కలుగచేసుకునేటట్టు ఉపయోగించుకోవాలని ప్రయత్నించాడు.


'కాంతం' ఒక్కసారి ఉక్కిరిబిక్కిరై పోయింది. ఇప్పటిదాకా ఒకరి విషయం ఒకరితో మాట్లాడలేదు. కాని, ఇద్దర్నీ కూడ, "సరే, నే కనుక్కుంటానుగా? నువ్వే మీ ఇదవకు—" అని, అలా ఆపి వుంచింది. నరసింహారావుగారిచేత చక్కదిద్దబడ్డ కాంతం మరి, ఈ చిక్కులన్నీ ఎలా సవరించదలచుకుందో, యేమో? ఏమైనా, ఈ సాంసారిక వ్యవహారాల్లో చాలా తెలివి, అనుభవం, సంపాదించి దావిడ!

మరి, 'మా చంద్రం సంసారం' యంత్రాలుగాకుండా, మనసులు ఎప్పుడు, ఎలా సాగిస్తాయో?



చెన్నపట్టణంలో


చెన్నపట్టణం కార్పొరేషను స్టేడియంగ్రౌండ్స్‌లో, కార్మికసభలో
పతాకోత్సవం జరుపుతున్నారు.




పండితనెహ్రూగారు సేవాసమాజమునం దుపన్యసింప రాజాజీహాలు
మెట్లెక్కుచున్నారు. ప్రక్కన తారా చెరియను, భాష్యం అయ్యంగారు,
వెనుక ఇందిరాగాంధీ, షీలాస్త్రీవెన్నను, గోపాలరెడ్డిగార్లు గలరు.



వివేకానంద కళాశాలలో నెహ్రూ మహాత్మాగాంధీ చిత్రపటా విష్కరణ
, మొనర్చారు. ఈ తైలచిత్రము చిత్రకారుడు శ్రీ చామకూర్-రచించారు.






కార్పొరేషన్ స్టేడియం గ్రౌండ్సులో,






పండిత। నెహ్రూగారు ఆదివారం నాడు ఉపన్యసించిన 2 ఘంటల జనసమూహము గల బహిరంగసభ దృశ్యము. ఉపన్యాస వేదిక, మధ్యనున్న లవుడ్ స్పీకరు ప్రక్కన గలదు.



భారత ప్రధానామాత్యుడు నెహ్రూ ఆదివారం సాయంత్రం నగరంలో జరిగిన బహిరంగసభలో ఉపన్యసిస్తూండగా తీసిన ఛాయా చిత్రం.


నెహ్రూ



ార్మికవిద్యార్థి మహాసభలో ఉపన్యసిస్తున్న నెహ్రూ.




ఉపన్యాసానికి ముందు శ్రోతల నవలోకించుచున్న ప్రధానినెహ్రూ.



బహిరంగసభ కరుదెంచుచున్న నెహ్రూగారు.



శుక్రవారం సాయంత్రం మద్రాసు ప్రభుత్వంవారు పండిత నెహ్రూ గౌరవార్థం తేనీటి విందు చేసినారు. దాదాపు 800 మంది విందుకు హాజరైనారు. ➡



⬅ ఆదివారం బహిరంగసభ, వేదికయందు మదరాసుప్రధాని, ఇందిరా నెహ్రూ తదితరులు.



శుక్రవారం రాత్రి రాష్ట్రి క్షేమాభివృద్ధి సంఘ యాజమాన్యమున జరిగిన శ్రీమతి యం. యస్. సుబ్బులక్ష్మి పాటకచేరికి హాజరైన పండిట్ నెహ్రూ, గవర్నర్ సతి. ➡



అల్లీబిల్లీ లోకంలో అమ్మాయి కథ

'ఆలీస్ ఇన్ ది వండర్లాండు'
రచన:
లూయీ కెరోల్

అనుకరణం :
"ఆప్లవాన్"

పాప మాట్లడకుండా కూర్చుంది.

వాళ్ళు ఇద్దరూకూడ మాట్లాడకుండనే కూర్చున్నారు. మాయ తాబేలు ఎంతసేపటికీ నోరు తెరవా లేదు; కథ మొదలుపెట్టనూ లేదు.

"అసలు మొదలెట్టటమే ఎంతసేపటికీ అవకపోతే, ఇక కథ పూర్తి అవటం ఎల్లా అవుతుందో?" అని పాప తనలో తను అనుకొంది.

చివరికి ఎల్లాగో ఓ గంటసేపటికి మాయతాబేలు తన కథ చెప్పతున్నట్టు మొదలుపెట్టి గట్టిగా ఒక నిట్టూర్పు విడిచి కళ్ళు తుడుచుకొని, "ఒకప్పుడు నేనుకూడా అసలు తాబేలుగానే ఉండేదాన్ని" అని మళ్ళీ చాలా సేపు నిశ్శబ్దంగా కూర్చుంది.

రావణాబందు ఉండి ఉండి మధ్య మధ్య "హెక్ ఓక్" అంటూ గొంతులో గుంగుర అంటున్నట్టు, ఎక్కిళ్ళు వదులుతూ మాట్లాడకుండా కూర్చుంది. మాయతాబేలు ఒక నిట్టూర్పు విడుస్తూ ఉండటం, ఎక్కిళ్లు దిగమింగుతూండటం, అదేపనిగా తీరుబడిగా చేస్తూ అల్లాగే పలక్కుండా కూర్చుంది.

పాపకు లేచిపోదామా అనిపించింది. "కథ చాలా బాగుందండి. చాలా సంతోషమయింది. సరే, ఇక వెళ్లి వస్తాను" అని చెప్పేసి లేచి వెళ్లిపోతే బాగుంటుంది అని అనుకోటం మొదలుపెట్టింది. "కాని అసలు ఇంకా ఏదో కథ అంటూ ఉండిఉండాలి కదా, ఎల్లాగూ చెప్పితీరుతుంది. పోనీ వినే కదులుదాము" అని మళ్లీ అనుకొంటూ కదలకుండా బాసింపట్టు వేసుకొని అల్లాగే కూర్చుంది.

చివరికి మాయతాబేలు తన్ను తాను సముదాయించుకొని (మధ్య మధ్య అక్కడక్కడ ఎక్కులు పెడుతూనే) నెమ్మదిగా కథ చెప్పటం సాగించింది.

"మా చిన్నప్పుడు సముద్రంలో బడికి పాఠాలు నేర్చుకొనేందుకు వెళ్ళాము. మాతో పంతులు ఉండేవాడు. ఆయన తాబేలేగాని, ఆయన్ను 'పారీనం' అని అనేవాళ్లం.

"తాబేలును 'పారీనం' అని ఎందుకనేవాళ్ళు?" అని అడిగింది పాప.

"మాకు పాఠాలు చెప్పే వాడిని 'పారీనం' అనమూ? ను వ్వెక్కడో తెలివితక్కువ మొద్దులా గున్నావే!" అని మాయతాబేలు కోపంతో అంది.

"అల్లాంటి చొప్పదంటు ప్రశ్నలు అడగటానికి సిగ్గు లేదూ?" అని రావణాబందు గదమాయించింది. కానీ పిద్దరూ పాపవంక అతి నికృష్టంగా చూసినట్లు చూడటం మొదలుపెట్టారు. వాళ్ళు అల్లా చూస్తోంటే పాపకు సిగ్గుతో భూమిలో కుంగిపోదామా అనిపించింది. చివరికి రావణాబందు మాయతాబేలు వంక తిరిగి, "కానియ్యవోయ్. కథ కానియ్. ఇక్కడే పొద్దు గుంకేటట్టు ఉంది" అంది. తాబేలు మళ్ళీ కథ మొదలుపెట్టింది.

"సరే, మేము అక్కడ సముద్రంలో బడికి వెళ్ళేవాళ్ళం-నువ్వు నమ్మకపోతే మానె" అని మళ్ళీ పాపవంక చూసింది.

"నేనేం నమ్మటం లేదని ఏమీ అనలే" దంది పాప.

"అన్నావు" అంది తాబేలు.

పాప ఏదో జవాబు చెప్పబోతోంటే రావణాబందు, "నోర్మూయ్, మాట్లాడక!" అని పాపను గదమాయించింది. తాబేలు కథ సాగించింది.

"అక్కడ మాకు ఎక్కడా చెప్పనంత చక్కగా చదువు చెప్పేవారు. మేము రోజూ బడికి వెళ్ళేవాళ్ళము."

"నేనూ రోజూ బడికి వెళ్తాను. పెద్ద ఏదో గొప్పగా చెప్పుకుంటున్నావుగాని".

"మీ బడిలో అన్నీ చెప్తారూ—పై పాఠాలుకూడా?" అని అడిగింది తాబేలు.

"ఆఁ, అన్నీ చెప్తారు—కుట్టుపనీ, అల్లికపనీ" అంది పాప.

"కడగటం, తోమటం, ఉదకటం, నేర్పుతారూ?"

"ఛీ! ఛీ! అల్లాంటి దాసీపనులేం నేర్పరు—" అని పాప ఛీకొట్టింది.

"ఆ! అదీ! అవి నేర్పకపోతే ఏం బడి, నా మొహం బడి! మేం చదువుకొన్న బడి అంటే ఒకటోరకం బడి. అక్కడ మాకు..." అని తాబేలు ఇంకా ఏదో అంటూంది.

"అయినా నీకు సముద్రం అడుగున ఉండేదానికి, కడగటంఅదీ నేర్చుకోటం ఎందుకు?" అని పాప అడిగింది-

తాబేలు నిట్టూర్చి, "అదే! కర్మ. నేను నేర్చుకోలేదు. పై పాఠాల క్లాసులకు వెళ్ళక మామూలు పాఠాల క్లాసులకే వెళ్ళేదాన్ని."

"మామూలు పాఠా లేమిటి?"

"ఏడవటం, రాగటం, ఎక్కులూ, ఇంకా సముద్రగోళం—"

"సముద్రగోళం ఏమిటీ, భూగోళం కాదూ?" అని అడిగింది పాప.

తాబేలు కోపంతో, "నాల్గు పాళ్ళు సముద్రం, ఒకపాలు భూమీ ఉంటే, సముద్రగోళం అనక భూగోళం అంటారు, మరీ వళ్ళు పొగరుగానీ!" అని అంది.

పాప కిమ్మనకుండా ఊర్కొంది.

"ఇంకా, ఆశ, అత్యాశ, దురాశ, పరాశ" అన్నీ నేర్పేవారు అంటోంది తాబేలు.

"'పరాశ' ఏమిటీ?" అని అడిగింది పాప.

బాల

తల విలువ, మాట చెబుతుంది

పిల్లల కథలు చి॥ 'చిట్టి-బాల' సోదరులు

అనగా అనగా ఒక రాజు. ఆ రాజుకు వేట అంటే బలే ఇష్టం. ఒక నాడతడు మంత్రితోను, నౌకర్లతోను అడవికి వేటకి వెళ్ళినాడు. కొంత దూరం పోయేసరికి ఒక లేడి కన్పించింది. ఆ రాజు దాని వెంట పడ్డాడు. గుఱ్ఱాన్ని ఎంత పరుగెత్తించినా లాభం లేకపోయింది. ఆ లేడి అతివేగంతో పారిపోయి అడవిలో దాక్కొనింది.

రాజు మాత్రం పట్టుదలతో వెదుకుతున్నాడు. కొంతదూరంలో ఒక కుటీరం, ఆ కుటీరంముందు ఒక తపస్వీ కనపడ్డాడు. ఆ తపస్వి గ్రుడ్డివాడు. అతన్ని చూసి రాజు "మహాత్మా! ఈ త్రోవను లేడి ఒకటి పోయిందా?" అని అడిగాడు. అందుకా ముని "నాకు దృష్టి లేదు. కాని చప్పుడు వినిపించింది, ఏదో మృగం పరుగెత్తినట్లు. కుడి చేతి మార్గంగా పోతే సరి." అన్నాడు. రాజు ఆ మార్గంగా గుఱ్ఱాన్ని పరువెత్తించాడు.

కాస్సేపటికి మంత్రి వచ్చి "ఓ మునీ! ఈ త్రోవగుండా ఎవరైనా వెళ్లినారా?" అని అడిగినాడు. అందుకా ముని "ఔను. ఒక రాజు లేడిని వెదుక్కుంటూ పోయాడు" అన్నాడు. మంత్రి వెళ్ళిపోయాడు.

పిమ్మట ఒక నౌకరు వచ్చి ఆ తపస్వితో "ఏ గ్రుడ్డివాడా! ఈ త్రోవంట ఎవరైనా వెళ్లిన శబ్దం విన్నావా?" అన్నాడు. "వెళ్లినారు. రాజూ, మంత్రీ వెళ్లినారు. నీవు నౌకరువై ఉండికూడ వాళ్లను అనుసరించక పోవటం తప్పు కాదా?" అని ఆ ముని అన్నాడు.

తరువాత రాజు, మంత్రి, నౌకరు కలుసుకొని జరిగిన సంగతులు కూడబలుక్కున్నారు. ఆ గ్రుడ్డి ముని తమను వేలా పోల్చుకున్నాడని ఆశ్చర్యపోయారు.

వెంటనే ఆ ముగ్గురూ ఆ తపస్వి దగ్గిరకు పోయి తమ సంశయాన్ని తీర్చమన్నారు. అప్పుడాతడు "మీరు నన్ను వేసిన ప్రశ్నల తీరును బట్టి పోల్చినాను." అన్నాడు.

అందుకే "తల విలువ మాట చెపుతుం" దంటారు.

"పరాశ తెలియదూ? పరాశరుడు అని విన్నావా?" అని అడిగింది రావణాబందు.

"ఏంటే, దానికీ దీనికీ సంబంధమేమిటి?" అని అడిగింది పాప.

"పరాశరుడి గుణమే, పరాశ" అంది రావణాబందు.

"ఎక్కడో శుద్ధమొద్దు స్వరూపంలా ఉన్నావే" అంది తాబేలు.

పాపకు మరీ చిరాకు ఎత్తుకు వచ్చినట్లయింది. అయినా వాళ్ళిద్దరి మధ్యనుంచీ బయటపడటంకూడ ఎల్లాగో తెలియటంలేదు. తాబేలు మళ్ళీ తన కథ చెప్తోంది.

ఇంకోపంతులు, ఈదటం బాదటం, చేదటం, అన్నీ నేర్పేవాడు. డ్రిల్లు మాస్టరుండేవాడు. ఉండ చుట్టుకు పోవటం- ండగా పడటం- నార సాగి పోటం అన్నీ చెప్పేవాడు"

"నార సాగిపోవటం ఎల్లా?" అని అడిగింది పాప.


"ఇప్పుడు నాకు ఒళ్ళు నొప్పులుగా ఉంది. రావణాబందూ, నువ్వు చూపించు" అంది తాబేలు.

"ప్చ్' ఆ క్లాసు ఎగేసి పారిపోయే దాన్ని నేను, నాకు రాదు" అంది రావణాబందు.

"రోజూ ఎన్ని గంటలు చదివేవాళ్ళేమిటి?" అని అడిగింది పాప.

"మొదటిరోజు పదిగంటలు. రెండో రోజు తొమ్మిదీ. అల్లా రోజూ రోజూ ఒకగంట తగ్గించేవాళ్ళు."

"అయితే పదకొండోరోజు ఆటవిడుపన్నమాట." అంది పాప.



"అవును, ఆటవిడుపే."

"మరి అయితే పన్నెండో రోజన ఎల్లా?" అంది పాప

రావణాబందు తాబేలుతో "సరే, ఆ గొడవ ఆపుదూ. ఒప్పులకుప్ప ఆడుదాం" అంటూ తాబేలు చేతులు పట్టుకొని, ఇద్దరూ పాపచుట్టూ గంతు లేయటం మొదలుపెట్టారు. మధ్యమధ్య పాపకాళ్ళు తొక్కుతూ పాపచుట్టూ గిరగిరా తిరుగుతున్నారు. ఎంతసేపూ, "ఒప్పుల కుప్పా — ఒప్పుల తిప్పా, తిప్పల కుప్పా, కొప్పుల తిప్పా— ఒప్పుల కుప్పా" అంటూ తారుమారుగా ఒకటే అంటూ రొదగా పాడుతూ తిరుగుతున్నారు. "ఒప్పుల కుప్పా" తర్వాత "ఒయ్యారిభామా" రావాలని పాప ఎంత చెప్పినా ఎవళ్ళూ వినిపించుకోలేదు.

అల్లా తిరుగుతూ తిరుగుతూ గబుక్కున పాప చేయికూడా పట్టుకొని గిరిలోకి లాగుతూ ముగ్గుర్నీ తిప్పుతూ గిరగిరా తిరగటం మొదలుపెట్టారు. పాపకు ఆయాసం వచ్చి, వీళ్ళెప్పుడు వదులుతార్రా భగవంతుడా!" అనుకోటం మొదలుపెట్టింది.

చివరికి ముగ్గురూ కళ్ళు తిరిగి ఆయాసంవచ్చి చేతులపట్టు వదలి కూలబడ్డారు. రావణాబందు పాపవంక తిరిగి, "నీకు పాటలు వచ్చునా?" అని అడిగింది.

పాప ఆయాసంతో మాట్లాడ లేక, అయినా మళ్ళీ పాడితే ఏం తప్పు లొస్తాయో అనుకొంటూ ఊరుకొండి.

"వచ్చా?" అని తాబేలూ అడిగింది.

"మునుపు వచ్చుకాని, ఇందాక పట్టుపురుగుముందు పాడబోతే పద్యం అంతా తప్పే వరచ్చింది." అంది.

ఆ మాటతో పాపకథ చెప్పమని వాళ్ళిద్దరూ పాపచుట్టూ మూగారు. పాప తనకథ చెప్తూంటే ఆశ్చర్యంతో మిడిగుడ్లేసుకొని వింటున్నట్టు విన్నారు. కాసేపుండి తాబేలు రావణాబందుతో టి, పాప రావణాబందు శిష్యురా లయినట్లు, రావణాబందు పాపమీద పూర్తి అజమాయిషీ ఉన్న పంతు లయినట్టూ— "ఇప్పుడేదన్నా అప్పచెప్పమని చూడు" అని పాపవిషయం రావణాబందుతో అంది.

పాప ఏదో అప్పచెప్పబోయింది కాని ఏమీ జ్ఞాపకమే రాలేదు. రావణాబందు పాప కందిద్దామని పాట మొదలుపెట్టి, అందించటం కోసమే అన్నమాటే మరిచిపోయినట్లుగా పాట అంతా చివరిదాకా తనే పాడేస్తూ గంతులెయ్యటం మొదటపెట్టింది. తాబేలు కూడా చప్పట్లు చరుస్తూ, రావణాబందుతో కోలాటం నడకలు నడుస్తూ చేతులూ చేతులూ కలిపి, చప్పట్లు చరుచుకొంటూ, 'హారిలో రంగాహారి' అంటూ, రావణాబందును కలుపుకొని పాప చుట్టూ గిరాగిరా తిరగటం మొదలు పెట్టింది.

ఇంతలో "విచారణ ప్రారంభం అవుతోందోహోయ్" అంటూ పెద్ద సాటింపుకేకలాగా కేక వినబడింది.

వీళ్ళు ఇద్దరూ చటుక్కున ఆగి నిలచారు.

పాప, "ఏం విచారణ?" అని అడిగింది.

రావణాబందు ఏమీ జవాబు చెప్పకుండా పాపచెయ్యి పట్టుకొని "పద పద, ముందు పద" అంటూ పరుగెత్తూ పాపను వెంట లాక్కుని పోయింది.

కొత్త పాతలు

దౌలతాబాదుకోట అజేయము! ధాన్యపురాశివలె అయిదువందల అడుగుల ఎత్తున ఉన్న కొండను, వరిపుప్పవలె చెక్కినార్లు. కొండ సమతలానికి నూరడుగుల లోతు కందకం, నూరడుగుల వెడల్పు ఉంటుంది. సమతలానికి పైన గోడలా చెక్కిన కొండభాగం ఎత్తు నూటయాభై అడుగులు. కొండంతా కోటగోడలు. కొండశిఖరంపైన చిన్నకోట, కోటమధ్య రాజభవనం! భవనశిఖరంమీద ఫిరంగి! తినుబండారములు చేరనీయక మాడ్చవలసినదేకాని, మానవమాత్రుడా దుర్గమున శౌర్యముచే చేరలేడు!

*   *   *

ఫిడేలువాద్య మరబ్బులది. అది సారంగికి సంబంధించినది. ఫ్రాన్సు, ఇటలీ, జర్మనీ, హాలండు దేశములలో ఫిడేళ్ళ సద్భుతముగ నిర్మించెదరు. కొన్ని ఫిడేళ్ళు యాబదివేల రూప్యములు విలువగలవి ఉన్నవి! సారంగి భారత దేశమునకు క్రీ. పూ. అయిదాలు శతాబ్దములలో వచ్చినది. పదునేనిమిదవ శతాబ్దములో ఫ్రాన్సు వర్తకులు ఫిడేళ్ళను తీసుకొని వచ్చినారు. పంతొమ్మిదవ శతాబ్దికవి భారతదేశమున ముఖ్యములగు సంగీతవాద్యములలో నొకటియైనది. సంగీతములో పాశ్చాత్యులును, మన మున్ను పన్నెండు పరాళ్ళి మాత్రమే గ్రహించాము!

*   *   *

అమెరికా భరతభూమికన్న పెద్దది. అయిననూ అచ్చట పదికోటుల జనులు మాత్రమే ఉన్నారు. వారికి అమెరికా చాలదట!

కొరిపల్లివాడ పల్లిబాబు

సంయం

కథా గేయం:



ఆణిముత్యం

'ప్రసాదరావు'

౧౫

ముందు వేణును చూచి క్షణమటు
మోడుగా నిలిచింది; ఆ పయి
హృదయద్వారాల్ బ్రద్దలైనటు
లేడ్వసాగిందీ. 1

నెత్తురోడ్చుకు ఎండిన్న, యెద,
కొత్త సిర లేవేవో తెగినటు
చెలికాని ఆదరణమాటున,
చెలువ ఏడ్చిందీ. 2

విన్నాడు సుఖదుఃఖములు రెండూ,
మిన్నగా కలచినా బ్రతుకును;
ఇన్నినాళ్లుగ చూడనందుకు
చిన్నబోయాడూ. 3

తన హృదయభావాల గతులవి
తనకె తెలియని స్థితిలొ వేణూ
జాలితో, దుఃఖముతో, ప్రేమతో,
తూలి పోయాడూ. 4

చిన్ననాడటు ఆణీ తానూ
అన్న దమ్ముల రీతి నాడిన
ఆటల్ల తలపోసి దుఃఖపు
పాటు చెందాడూ. 5

కాంతపై తన కున్న వలపును,
ఎంతమాత్రము పొక్కనీయక,
శాంతపరిచీ, ఇల్లు చేర్చీ,
చెంత నిలచాడూ. 6

ప్రతిఫలాపేక్షారహితము
నతివిశాలహృదంతరస్థము
నైన ప్రేమతో, తల్లి బిడ్డల
అండ నిలచాడూ. 7

చిమ్మచీకటి, వెలుగురే ఖదో
చిమ్మ, వాత్సల్యమ్ము నింతగ
చిమ్మినట్టయి బిడ్డలాతని
చెంత జేర్తారూ. 8

ప్రభుత్వము, వ్యక్తిగత ఖద్దరు వ్యాపార నిషేధం

శ్రీ పుల్లాభొట్ల సీతారామయ్య

ప్రభుత్వము, ప్రైవేటు ఖద్దరు వ్యాపారములు చేసే, అవినీతిపనులను, ఖద్దరు కల్తీవ్యాపారమును, దృష్టిలో పెట్టుకొని పవిత్రమైన ఖద్దరు, ఉపయోగించుకొని లాభము పొందువారిని నిర్మూలించుటకు నిషేధపు టుత్తరువును జారీ చేసినది. ఖద్దరు ప్రభుత్వపరము చేసికొని, దానిని బహుళంగా వ్యాప్తము చేయవలెనని సంకల్పము గూడా దీనిలో యిమిడియున్నది.

అనేకమంది ప్రముఖులు అనేకవిధములుగా, యీ నిషేధమునుగూర్చి విమర్శించుచున్నారు: ప్రజాప్రభుత్వము, ప్రజల విమర్శలకు, మన్ననలకు బాధ్యత కావలసియున్నది. కాని ప్రభుత్వము యీ విమర్శవలను; ఎంతమాత్రము చెవిని బెట్టకుండా విమర్శనలలోని సత్యాసత్యములను గ్రహించి, తదనుగుణ్యముగా మార్పులు చేయవలెను. కనుక ప్రభుత్వము, పవిత్రమైన ఖద్దరు విషయములో ఎంత అనుభవముతో పని చేయవలెనో ఊహించవలె.

ప్రభుత్వమువారి ఉత్తరువులో, దేశములో ప్రతిమారుమూలన వున్న ఈ పరిశ్రమలోని లోపములను, పల్లెలలో వడికి, చిలపలుగా పోసే, పోగుల లెక్కగాని, దానిలో కలిపే, మిల్లుదారమునుగాని కనిపెట్టుట దుర్లభము. మిల్లుదారము గూడా, ఖద్దరునూలువలె వుండి, ఖద్దరు పడుగు పేకలో కలిపి నేసే సాలీలను, అరికట్టుట అంతకంటె దుర్లభము. రేపు ప్రభుత్వము ఖద్దరు నేయించినా, వడికించినా యీ లోపములు వుండుట తథ్యము.

యీ పరిశ్రమ, కొన్నివేల పనివాండ్రను, ఒక కర్మాగారంలో వుంచి, వారిచేత పని చేయించి లక్షల గజముల ఖద్దరు తయారు చేయించలేదు. యిది కేవలము వికేంద్రీకరణ సూత్రముమీద ఆధారపడియున్నవి. కేంద్రీకరణ దృష్టిలో పనిచేయించుట సముద్రపు టొడ్డున కట్టిన భవనమే?

వ్యక్తులు ఖద్దరు వ్యాపారం, ప్రజల విమర్శనలకు గురియై ఏమాత్రం ఖద్దరుకు లోపము వచ్చినా వారిని బహిష్కరించేయెడల వ్యాపారమునకు దెబ్బ తగులును. ప్రతినిమిషము ప్రజల విమర్శనాదృష్టికి బాధ్యుడు వ్యక్తి.

అదే ప్రభుత్వము తయారుచేయించేయెడల, ప్రజలలో ప్రభుత్వమునకు వున్న వ్యతిరేకపార్టీలన్నీ ప్రభుత్వము ఖద్దరు విధానము అపవిత్రమైన దనటానికి, మోసమున్నదని ఋజువుచేయుటకు అవకాశమున్నది. ఖద్దరు, కల్తీఖద్దరు నిర్ణయించుటకు అవకాశము లేదుగనుక యిదే విమర్శనకు ప్రథమ సోపానము కాగలదు.

ప్రభుత్వము ముఖ్యముగా గమనించవలసినదేమంటే, స్వతంత్ర పిపాసతో ప్రజలు మహాత్ముని అనుసరించి ఖద్దరు ధరించుటకు సమ్మతించినారు. కాని యంత్రపరిశ్రమలు ఉచ్ఛదశలో వున్న 20 వ శతాబ్దములో ఖద్దరు విధానం నచ్చలేదని గుర్తించవలె.

'దేశమునకు సరిపోవు ఖద్దరు, తయారగుటకు అవకాశ మున్నదా? లేదా? అని తేల్చుటకు ప్రభుత్వపు ఖద్దరు నిపుణులు లేరు. ప్రాజెక్టులు నిర్మించుటకు, వంతెనలు కట్టుటకు వందలమైళ్లు రైళ్లు నడపుటకు యంత్ర పరిశ్రమలను అభివృద్ధి చేయుటకు దేశములో యింజనీరులు, ఆర్థికవేత్తలు, నిపుణులు వున్నారుగాని 40 కోట్ల భారతీయులు ఖద్దరు ధరించి చేతిపరిశ్రమలు గృహపరిశ్రమలు అభివృద్ధిజేయుటకు నిపుణులు లేరు. అందుకు సంబంధించిన, విధానము, పాఠశాలలు (Basic-education) నిర్మించలేదు.

యిప్పుడు కేవలము మద్రాసు ప్రభుత్వము, చరఖాసంఘం వారి వత్తిడివల్ల, కేంద్ర ప్రభుత్వము వత్తిడివలన గాంధి సంఘమును, (నిర్మాణ కార్యక్రమ సంఘము) సంతోషింప జేయుటకు ఈ ఖద్దరు విధ్వంసక విధానమును అవలంబించినది. కాని కోట్లకొలది ప్రజల జీవనభృతికి, జీవనాధారము కలిగించుటకు యీ విధానమున ఏమాత్రము సరియైనది గాదు.

1946 సంవత్సరము వరకు ఖద్దరు వుత్పత్తి, అమ్మకము దారులు, నిర్ణయమైన చరఖాసంఘం ఏర్పరచిన లాభము పద్ధతి గాక, స్వేచ్ఛగా కొన్ని కట్టుబాట్లు చేసికొని నైతిక పతనమునకు లోపం లేకుండా వ్యాపారం చేసినారు.

ప్రభుత్వ ఖద్దరుకు లైసెన్సు పద్ధతి ఏర్పాటు చేసిన తరువాత, ప్రతి ఒక్కరూ ఖద్దరు షాపు పెట్టిరి. ప్రతి మిల్లు, చేనేత షాపులలో కూడా ఖద్దరు అమ్మిరి. అందరికి ఖద్దరు అమ్మటకు తయారుచేయించుటకు అవకాశము కల్గినది. దీని మూలంగా రాష్ట్రంలో 10,000 పైగా ప్రభుత్వం ఖద్దరు లైసెన్సులు యిచ్చినది. విచారిస్తే ప్రత్యేకంగా ఖద్దరు లైసెన్సులు పొంది యితర సైడు వ్యాపారము లేకుండా వున్న షాపులు రాష్ట్రం మొత్తంలో 1000 లు గూడా లేవు. దీనివలన ఖద్దరు విలువ పడిపోయినది. ప్రభుత్వము యీ విషయంలో ఎంతైనా తప్పు మార్గము అవలంబించినది.

ప్రైవేటు ఖద్దరుకు చరఖా సంఘమునకు 1921 నుండి పోటీ జరిగినది. 1942 సంవత్సరము వరకు స్వంతదారులు, వడుకు, నేతగాండ్రకు సరియైన వేతనములు యివ్వుట లేదని, 42 సం|| తరువాత యుద్ధకారణంగా బట్టలోటు అయిన కారణంవల్ల స్వంతదార్లు, మిల్లు చేనేతవారితో సమానంగా కూలీ యిచ్చుచు ఖద్దరు మగ్గముల సంఖ్య తగ్గకుండా చేసినారు. అందువల్ల చరఖాసంఘము ఏ మాత్రం, తయారు చేయించ లేక పోయినది. ఆ నాటికి, ఈ నాటికీ కూడా చరఖాసంఘం, ప్రైవేటు ఖద్దరు వ్యాపారంలో 10 వ వంతు గూడా తయారుచేయించ లేదు.

చరఖాసంఘంతో పోటీపద్ధతిలో నడవవలసిన రహస్యము వేరు కారణం. విదేశప్రభుత్వము స్వాతంత్ర్య చిహ్నకారణంగాను, కాంగ్రెసు మూలసూత్రమైన ఖద్దరును నామరూపాలు లేకుండా చేయుటకు ప్రయత్నము చేస్తుంటే చరఖా సంఘము ముమెంట్ల టైములో ఆపివేస్తే, ఆ స్వాతంత్ర్యాభిలాషులు వ్యక్తిగత లాభమని పేరుపెట్టుకొని ప్రచ్ఛన్న వేషములో ఖద్దరు పడిపోకుండా నిలబెట్టినారు. అదీగాక అప్పుడు మిల్లు చేనేత ఏమాత్రం లేదు. నేతగాండ్రకు చాలినంత పని లేదు. ఖద్దరు నేతగాండ్రకు ఏపదిమందికో చరఖాసంఘము పని యిచ్చినది. మిగతావారు మగ్గములు మూలబెట్టి వారు ధరించు రాంబాణం ప్రవాహములో పడి పోయినారు, 0-2-6 వంతున గజము అమ్ముతుంటే, ఖద్దరు నేయించువారెవరు? ధరించువారెవరు?

యంత్రపరిశ్రమలు వ్యాపారం చేసి లక్షలు గడించే వ్యాపారములు వదలుకొని యీ ఏకాదశి ఖద్దరు వ్యాపారం చేయవలసిన అవసరము ప్రచ్ఛన్నఖద్దరు వ్యాపారులకు ఏమి పని. యిది అంతా ప్రభుత్వమును కూలద్రోయుటకు రహస్య వుద్యమము (under ground) ఎట్టిదో, ప్రైవేటు ఖద్దరువారు అంతకంటే వేయిరెట్లు పనిచేసినారు; గాంధి సిద్ధాంతమును ప్రచ్ఛన్న వేషముతో పోషించినారు. యీ సత్యం ప్రభుత్వం మరచిపోయినది.

చరఖాసంఘము ఉత్పత్తివిషయములో చాలా పెద్ద లోపము చేసినది. ఒక్కొక్క సెంటరులో ఒక పెట్టుబడిదారును. ఖద్దరు వుత్పత్తిచేయించుటకు తన ఏజంటును, ఏర్పరచుకున్నది. ఖద్దరులో వచ్చే కొద్ది లాభములో 75 వంతు ఉత్పత్తిదారుకున్నూ, మిగతా 25 వంతులు పట్టణములలో చరఖాసంఘము అమ్మకం చేసే వారికి. యీ డిపోలలో పనిచేసేవారు యీ కొద్దిలాభముతో జీవయాత్ర చేసికొనలేక చరఖా సంఘమునుండి విడిపోయి వారి స్వంత ఉత్పత్తి అమ్మకపు సంస్థలను ఏర్పరచుకున్నారు. నిష్పాక్షికముగా విచారిస్తే 1946 సంవత్సరమునకు పూర్వం ప్రైవేటు ఖద్దరు వ్యాపారస్థులలో సగము చరఖాసంఘమునుండి విడిపోయి వచ్చిన వారు.

2-5-'48 తేదీన మొదటి యీ నిషేధపు టుత్తరువును చూచుకొని, ఎచ్చటి ఖద్దరుమగ్గములు రాట్నములు అచ్చటే ఆగిపోయినవి. ఉత్పత్తిదారులు తమ వ్యాపారములను కట్టివేసినారు. యికముందు ఖద్దరు కంటికి కనపడకుండాపోయే అవకాశము ఏర్పడ్డది. దేశములో ఆర్థిక, నైతిక జీవనము కల్పించే ఖద్దరును, ఏ కొద్దిమందో కల్తీఖద్దరు అమ్ముచున్నారను నెపముతో, యీ ఖద్దరు విధ్వంసక విధానమును అవలంబించుట చాలా విమర్శనీయము.

దేశనాయకులు, అగ్రనాయకులు యీ ఖద్దరు విధానము ఏమాత్రము గుర్తించునట్లుగా లేదు. స్వాతంత్ర్యమును ఏర్పాటుచేసిన ఖద్దరును మరిచిపోవుట తన్నుతాను మరచిపోవుటగాదా?

దేశమునకు నిర్బంధ విద్యావిధానము ఎంత అవసరమని ప్రతివారూ ఎలుగెత్తి చాటుచున్నారో, దేశము సౌభాగ్యమునకు, ఆర్థిక సౌష్ఠవమునకు ఖద్దరు అంతకంటె వేయిరెట్లు నిర్బంధము చేయవలె. 40 కోట్ల భారతీయులు, ఖద్దరు ధరించే ఏర్పాట్లు చేయవలె. సూత్రప్రాయంగా ఏదో కొంత శుద్ధఖద్దరు తయారు చేయిస్తున్నామన్న ఆత్మతృప్తిపరచుకొనుట గాదు. దేశ దుర్భిక్షము, క్షామము, తొలగించే ఖద్దరు ప్రోగ్రాము ప్రజలకు యిచ్చి వారిచేత ఆచరించునట్లు చేయవలె. ఖద్దరే స్వరాజ్యం తెచ్చింది. ఖద్దరే స్వరాజ్యం కాపాడేది. యిది ప్రజలు, ప్రభుత్వము గుర్తించవలె.



హిందీ - ప్రతికూల ఉద్యమము

మార్వాడీ మహావిద్యాలయంలో బాల, బాలికలు, పెద్దలూ, హిందీలో నిర్బంధ విద్యా విధానాన్ని నిరసిస్తూ నిరశనవ్రతమారంభించారు. చిత్రంలో బాలబాలికలతోపాటు వీరికి తోడౌతున్న పెద్దలుకూడా ఉన్నారు.


భారతరాజకీయాలు :

భారతప్రభుత్వంతో ఒడంబడికకు నిజాం ప్రయత్నాలు

హైదరాబాద్ సంస్థాన వ్యవహారాలు ఆనాటి కానాడు మరింత విషమించి పోతున్నవి. వ్యవహార ధోరణి ఇప్పటివలెనే విషమించి పోతూవుంటే ఆగస్టు నెలాఖరు లోగానే హైదరాబాద్ వ్యవహారం అటో ఇటో తేలి పోతుందంటే అతిశయోక్తిగాని, ఊహాగానం కాని ఏమీలేదు. గత పక్షం రోజులలో హైదరాబాదు వ్యవహారాలు శరవేగంతో క్లిష్టమై, దిగజారి, విషమించిపోయాయి. తన స్నేహితులని నిజాం నమ్మినవారే, అతనికి సహాయపడుతున్నాయనే భావనతోడే, అతనిని అధోగతికి తెచ్చారు. హైదరాబాద్‌కు దొంగ చాటుగా ఆయుధాల రవాణాను అరికట్టటానికి భారత ప్రభుత్వం కొంచెం తీవ్రంగా ప్రయత్నించే సరికి, దానిని భగ్నంచేయాలనే పట్టుదలతో పూర్తి ఆర్థిక దిగ్బంధనాన్ని నిజాం ప్రభుత్వం కొని తెచ్చుకుంది. ఇచ్చిన లైసన్సు'ను సరిగా వినియోగించుకోలేక 'దక్కన్ ఎయిర్వేస్' కంపెనీ మొదటికే మోసం తెచ్చుకుంది. భారత ప్రభుత్వ ఆర్థిక దిగ్బంధనాన్ని ధిక్కరించి, అంతర్జాతీయ సాంప్రదాయాలు ఏర్పరుస్తానంటూ సిడ్నీ కాటన్ భారతప్రభుత్వాన్ని రెచ్చగొట్టి, నిజాంను ఇరకాటంలో పెట్టాడు. కాటన్ సంఘటన జరిగినప్పటినుండీ హైదరాబాద్‌కు రాకపోకల సౌకర్యాలు పూర్తిగా బందయిపోయాయి. ఆర్థిక దిగ్బంధనం అంటే యేమిటో నిజాం అప్పుడు గ్రహించుకోగల్గినాడు. భారత యూనియన్‌ను ధిక్కరించి స్వతంత్ర రాజ్యంగా ఉండటమంటే ఏమిటో అతడి కప్పుడు తెలిసివచ్చింది. నానజ్ సంఘటనతో అతనికి తల తిరిగి నోటిలోనికి వచ్చినట్లయింది, షోలాపూర్ జిల్లా సరిహద్దున, నిజాం భూభాగంలో వున్న భారతపరగణా బార్సీకి పోతున్న భారత సైనికులపై రజాకార్లు నానజ్ వద్ద దాడిచేశారు. ఈ దాడి జరపటానికి వారు పూర్తిగా సన్నాహాలు చేసుకుని, సిద్ధపడివచ్చినారనే తరువాత ధృవపడినది. రజాకార్లు ఎంత సన్నాహాలు చేసుకుని ముట్టడించినా, 50 మంది మరణించారు. బార్సీపరగణాకు వెడుతున్నవారిని అటకాయించటానికి నానజ్ చక్కని కీలకస్థానంలో వున్నది. దానిని ఆక్రమించుకుని రహదారి రక్షించుకొనకపోతే బార్సీపరగణానే రజాకార్లు వశపరచుకోటానికి సాహసిస్తారు. కాబట్టి భారతసేనలు నానజ్ గ్రామాన్ని ఆక్రమించుకున్నవి. తమ సైన్యాలనుకూడా ఇక్కడి పంపి ఏదో చేయవలెనని సంకల్పించారుగాని, పునరాలోచించుకుని నానజ్ భారతసేనల వశంలో వుండనివ్వటానికే ఒప్పుకున్నారు. లేకపోయినచో నానజ్ వద్దనే సంఘర్షణ ప్రారంభమై వుండేది.

భారతప్రభుత్వం తన ప్రతినిధులతో ఇక సంప్రదింపులు జరపబోవటంలేదని గ్రహించుకోగానే, సంఘర్షణకు భారతప్రభుత్వం సిద్ధంగా వుందని గ్రహించాడు. ఏవిధంగానైనా భారత ప్రభుత్వంతో ఒడంబడిక కుదుర్చుకొనకపోతే తన వంశపారంపర్యము కల్లయేనని అతడు గుర్తించెను. పండిట్ నెహ్రూ మద్రాసులో చేసిన ఉపన్యాసములో ఈ విషయమునే స్పష్టపరచియుండెను. అందువలన ఏదో ఒకవిధముగా ఒడంబడిక చేసుకొనవలెనని అత డాతృతపడుతున్నాడు. ఇందుకు మూడువిధములుగా అతడు ప్రయత్నించుచున్నాడు. ఐక్యరాజ్యసమితికి భారతప్రభుత్వంపై తాను ఫిర్యాదు చేయనున్నట్లు, అందుకు వాదమును తయారు చేయవలసిందని సర్ వాల్టర్ మాంక్టన్‌కు ఆదేశమిచ్చినట్లు, విరివిగా ప్రచారము సాగనిచ్చినాడు. ఐక్యరాజ్య సమితితో వ్యవహారమంటే ఏమో భారతప్రభుత్వ మెరుగును కాబట్టి, ఐక్యరాజ్యసమితికి నిజాం వెళ్ళకుండా చేయటానికైనా ఒడంబడిక చేసుకొనుటకు అంగీకరిస్తుందని అతడి ఆశయై వుండవచ్చును, బ్రిటన్‌లోని తన స్నేహితుల ద్వారా, బ్రిటిష్‌ప్రభుత్వము తన పక్షమున జోక్యము కలిగించుకుని, ఒడంబడిక కుదుర్చుకునేటట్లు భారతదేశాన్ని ఒత్తిడిచేయించవలెనని నిజాం ప్రయత్నాలు చేశాడు. దీనిఫలితంగానే కన్సర్వేటివ్‌లు కామన్సుసభలో హైదరాబాద్‌పై చర్చ జరగాలనికోరారు. హైదరాబాద్‌కు చేసిన వాగ్దానాలను బ్రిటిష్‌ప్రభుత్వం విస్మరిస్తున్నదనీ, ఇదివరకు భారతప్రభుత్వం సూచించిన కనీసషరతులు ఉపసంహరింపకుండా వున్నా బాగుండేదనీ చర్చిల్ వాపోవటం నిజాంకు ఏకొద్ది సహాయమైనా చేయటానికే! కాని ఈ రెండుమార్గాలలోను నిజాంచేసిన ప్రయత్నాలు భారతప్రభుత్వాన్ని ఏమాత్రము కదలించలేకపోయాయి. పైగా హైదరాబాద్ ప్రస్తుతప్రభుత్వంతో ఎట్టి సంప్రదింపులు జరపరాదనే నిశ్చయాన్ని మరింత బలపరిచాయి. బెదిరింపుద్వారా, విదేశప్రభుత్వాల జోక్యంద్వారా భారతప్రభుత్వం ఎన్నడూ లొంగిపోయి, నిజాంతో ఒడంబడిక చేసుకోదు. ఈ రెండు ప్రయత్నాల పర్యవసానం ఏమైనా ఉంటే, భారతప్రభుత్వాన్ని మరింత రెచ్చగొట్టటమే అది. తన మాంజీప్రధాని, తన విధానాలను హర్షించనివాడు, భారతప్రభుత్వానికి వ్యతిరేకి గాని సర్ మీర్జా ఇస్మాయిల్‌ను బ్రతిమాలి. ఢిల్లీ పంపించి మరొక ప్రయత్నం చేసి, ఏదైనా ఒడంబడిక కుదుర్చుకోవాలని నిజాం ప్రయత్నించాడు. భారతప్రభుత్వప్రస్తుత దృక్పథము మీర్జా ఇస్మాయిల్‌కు తెలియును. భారతదేశంలో నిజాం చేరిపోక గత్యంతరం లేదనికూడా అత డెరుగును. అందువలన అతడు సామాన్యముగా దౌత్యమును అంగీకరించేవాడు కాడు. ఈ దౌత్యములో ఏదో అంతరార్థము వుండితీరాలి.

నిజాంసైనిక చర్యలు భారతప్రభుత్వం ఏ క్షణంలో ప్రారంభించవలసి వస్తుందో చెప్పలేము. కాని అందుకు భారతప్రభుత్వము మాత్రము సిద్ధంగానే వున్నది. భారతప్రభుత్వదృక్పథము స్పష్టముగా బోధపడినది కాబట్టి ఇక లాభము లేదని భావించి, నిజాం భారతదేశంలో బేషరతుగా చేరిపోయి, సంపూర్ణ స్వపరిపాలనాధికారాన్ని తన ప్రజలకు ఇచ్చివేయవచ్చును. ఇది చాల ఆశ్చర్యకరంగా కనిపించినా, అసంభవం మాత్రంకాదు.



మీర్జా ఇస్మాయిల్

గుడ్డలపై తిరిగి కంట్రోల్ విధించటానికి ప్రభుత్వ నిర్ణయం

బట్టలపై తిరిగి కంట్రోల్

గుడ్డల ఉత్పత్తి, పంపకాలపై తిరిగి ఒక రకపు కంట్రోల్‌ను విధించటానికి భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఇది ఏమీ ఆశ్చర్యకరమైన వార్త కాదు. ఇట్లా జరిగి తీరుతుందని తెలుసుగాని, ఎంత త్వరగా జరుగుతుందనే ఇన్నాళ్ళనుండి మనము ఎదురుచూస్తున్నాము.

గుడ్డలపై కంట్రోల్ తొలగించి, రేషనింగ్ రద్దుచేసేటప్పుడు వర్తకులు ధరలను మితిమీరి జనబాహుళ్యాన్ని కష్టపెట్టేటట్లయితే తిరిగి కంట్రోల్ తీవ్రంగా విధించవలసివస్తుందని భారతప్రభుత్వం హెచ్చరించియే వున్నది. తమలో వుంచిన విశ్వాసానికి పాత్రుల మయ్యేటట్లు వ్యవహరిస్తామనీ, ధరలు విపరీతంగా పెరగనివ్వమనీ వర్తకులుకూడ భారత ప్రభుత్వానికి నచ్చజెప్పారు. కాని కంట్రోలు రద్దుపరచినతర్వాత వీరి ప్రవర్తన ఏమీ సంతృప్తికరంగా వుండలేదు. గుడ్డల ధరలు రెట్టింపైనవి; ఇప్పట్లో తగ్గేసూచనలు కనిపించటం లేదు. మిల్లుల ఉత్పత్తిమాత్రం ఏమీ తగ్గలేదు సరికదా, నూటికి 12 వంతులు పెరిగింది. మిల్లులలోను, టోకు, చిల్లరవర్తకులదగ్గర సరుకు ఎక్కువగానే నిలువ వున్నది. కంట్రోల్ తొలగించగానే టోకువర్తకులందరు ఒక్కమాటు మిల్లులపై ఎగబడి ఎక్కువ ధరలకు గుడ్డలు కొన్నారు; చిల్లరవర్తకులు కూడా వీరిదగ్గర నుండి చాలసరుకు ఖరీదుచేశారు. ఇప్పుడు ధరలు తగ్గిస్తే, టోకువ్యాపారస్థులకు, చిల్లరవ్యాపారస్థులకు చాలఎక్కువ నష్టం వస్తుంది. అందువల్ల వీరు ఇప్పుడున్న సరుకంతా విడుదలైపోయేదాకా మిల్లులదగ్గర కొనకూడదని వూరుకుంటున్నారు. మిల్లుల ఉత్పత్తి అంతా కొఠారులలో నిలువ వుండిపోతోంది. జనబాహుళ్యానికి సరియైనధరకు గుడ్డదొరకటంలేదు. భారతప్రభుత్వం జోక్యంకలిపించుకుని, ధరలు తగ్గించటానికి కఠిన చర్యలు తీసుకోలేకపోతే ఇప్పట్లో ధరలు తగ్గే సూచనలు ఏమీ కనిపించదు. ఇప్పుడు ప్రభుత్వం జోక్యంకలిగించుకోవటంకంటె గత్యంతరము లేదు.

గుడ్డలపై తిరిగి కంట్రోల్ విధిస్తూ, దశసూత్ర ప్రణాళిక నొకదానిని ప్రభుత్వము ప్రచురించెను. మిల్లుల ఉత్పత్తి తగ్గిపోకుండా, ప్రజలకు ఉపయోగంగా వుండే నాణ్యమైన సరుకునే అవి ఉత్పత్తి చేసేటట్లు చూచుటయు, ఆ ఉత్పత్తి సరసమైన ధరలకు పంపకం జరిగేటట్లు ఏర్పాటుచేయుటయు ఇప్పటి కంట్రోల్ విధానము ఉద్దేశ్యము. గత రెండు మాసాలనుండి మిల్లులలో ఉత్పత్తి అయిన గుడ్డ అంతా మిల్లులలోనే నిలువ వుండిపోయింది; దానిని వెంటనే ప్రభుత్వం వశపరచుకుని, సరసమైన ధర వాటిపై ముద్రించి అక్టోబరు 1 వ తేదీనుండి విడుదలచేస్తుంది. ఇప్పుడు టోకు, చిల్లరవ్యాపారస్థుల చేతులలో నున్న సరుకు ఈ రెండునెలల కాలములో అమ్మకానికి సరిపోతుందని అంచనా వేశారు. ఈ రెండునెలల కాలంలోకూడా ఏ వర్తకుడైనా తన వద్దనున్న గుడ్డను విపరీత ధరలకు అమ్ముతున్నట్లు ప్రభుత్వం భావిస్తే, ఆ గుడ్డను స్వాధీనపరచుకుని, సక్రమమైన ధరలకు అమ్మిస్తుంది.

అక్టోబరు 1 వ తేదీనుండి రాష్ట్ర, సంస్థాన ప్రభుత్వాలు అంగీకరించిన కొద్దిమందినే టోకు వర్తకులుగా గుర్తించి, సరుకంతా వారి ద్వారానే బట్వాడా చేస్తారు. చిల్లర వర్తకులకు



నైజాం రాజు

కొందరికి 'లైసన్సు' యిచ్చి వారిచేత సహకార సంఘాలచేత, ప్రభుత్వం ఇందుకొరకు ప్రత్యేకంగాస్థాపించే దుకాణాలచేత గుడ్డను ప్రజానీకానికి పంచుతారు. బట్టలరేషన్ తిరిగి అమలు జరుపరుగాని, సక్రమమైన ధరలకు లభించేటట్లు కట్టుదిట్టాలుచేస్తారు. సహకారసంఘాలు తక్కువగా వుండి, చిల్లరవ్యాపారస్థులపై ప్రభుత్వానికి నమ్మకంలేనిచోట, ఎక్కువకొట్లను ప్రభుత్వమే తెరుస్తుంది. బట్టందొంగరవాణాను, పాకిస్థాన్‌కు దొంగ ఎగుమతిని, బ్లాక్‌మార్కెటింగును అరికట్టటానికి ప్రత్యేకసిబ్బందిని ఏర్పరుస్తారు. చేనేత మగ్గాల ఉత్పత్తికి, వాటికి కావలసిన నూలు సరఫరాను యథాప్రకారంగానే జరుగనిస్తారు.

ప్రస్తుతం వర్తకులవద్ద నున్న బట్టల నిలువలు ఇంకా రెండునెలలవరకు సరిపోవును కాబట్టి ఆ రెండునెలలు ఎక్కువధరలకు—అవి మరీ ఎక్కువని ప్రభుత్వం భావించకపోతే—అమ్మకొటానికి వర్తకులకు ఏ ఆటంకమూ లేదు. ఇది ఈవిధానంలోని గొప్పలోపము. జనాబాహుళ్యం మరి రెండునెలల పాటు వర్తకుల కరుణాకటాక్షాలపై ఆధారపడివుండవలసివస్తున్నది. ఆ రెండు నెలల తరువాతనైనా ఈ విధానం సఫలతదానిని అమలుపరచేవారిపైననే ఆధారపడివుంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన విధానం సక్రమంగానే వున్నా, దానిని అమలుజరిపేవారు అలక్ష్యంచేస్తే ప్రజలకు దానివలన ఎట్టిహాభము కలుగదు. ఇదివరకటి కంట్రోల్ విధానాలు వాటిని అమలు జరిపే ఉద్యోగుల అసమర్థతవల్లనే విఫలమైపోయి, ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెచ్చాయి. ఇప్పుడైనా ప్రభుత్వం ముందు తమ ఉద్యోగులను, వర్తకులను సరిగా అదుపులో పెట్టుకుని, తన విధానం జయప్రదంగా, సాగిప్రజలకు సరసమైన ధరలకు గుడ్డ లభించేటట్లు చేయాలి.

ఉత్తరభారత కథలు :

పాండవసేనానులు

శ్రీ పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

ధృష్టద్యుమ్నుడు

(సర్వసైన్యాధిపతి)

ఈతడతిరథ శ్రేష్ఠుడు, న్యాయశీలుడునని కృష్ణార్జునులే కాక భీష్ముడును బెక్కు సారులు నుడివియున్నాడు. ఏనాడైన యుద్ధారంభమున ధృష్టద్యుమ్నుడు కాన్పించిన ద్రోణుడది తనకు దుశ్శకునముగా దలచుచుండువాడు. ఈతనికి (1) క్షత్రంజయుడు (2) క్షత్రదేవుడు (3) క్షత్రవర్మ (దృష్టవర్మ) (4) క్షత్రధర్ముడును నను నల్వురు వీరులగు కుమారులు గలరు. పాండవులను గౌరవులపై బురికొల్పు మొనగాడెవడని ధృతరాష్ట్రుడు సంజయు నడిగినపుడు ధృష్టద్యుమ్నుడే ముఖ్యుడని సంజయుడు చెప్పియున్నాడు*. ధృష్టద్యుమ్నుడు మొదటినుండియు

* ఉద్యోగపర్వము—86 అధ్యాయము.

ద్రోణుం జంప సిద్ధపడుచుండెను. (అరణ్య పర్వ 12 అధ్యా) ద్రుపదధృష్టద్యుమ్నుల కిష్టమగు రీతినే ధర్మరాజు మెలగువాడు. అయిదు గ్రామముల నిచ్చిన జాలును మా కని నికృష్టముగా, గాన్పించు సంధికి నంపునపుడు కోరిన గ్రామములలో 'మాకంది, వారణావతములు' కలవు. 'మాకంది' ద్రోణుడు ద్రుపదునుండి లాగుకొనిన రాజ్యము. వారణావతము కూడ బహుశః ద్రుపదుని రాజ్యములోనిదై యాతని రాజ్యమునకు దూర్పు హద్దయినది. (ఉద్యోగ పర్వ. 80 అధ్యా.) ధృష్టద్యుమ్నుని సర్వసైన్యాధిపత్యోద్యోగము ఉత్సాహవంతమై యుండెను. ఈతని సంబంధులుకూడ మహాబలవంతులగుటచేత భీష్మద్రోణ కర్ణాదుల కలవిగానివారై, కడకు స్వపక్షపువాడగు కృష్ణుని కృతిమాలోచనమునకు లోనై యశ్వత్థామచే నిద్రలో జంపబడిరి. ఆ వృత్తాంతము శ్రీకృష్ణుని చరిత్రములో స్పష్టపరుపబడును పాండవపక్షవీరులలో పాంచాలురే ప్రఖ్యాతవీరులు. వీరి తోడ్పాటు—అతను ధృష్టద్యుమ్నుని తోడ్పాటే—లేకుండిన పాండవులు జయము నందలేకపోవుదురు. భీష్ముని యారవనాటి యుద్ధములోను, సైంధవ ద్రోణవధ దినములలోను ధృష్టద్యుమ్నుని శౌర్యము మిగుల శోభించినది.

ధృష్టద్యుమ్నుడు బలపరాక్రమయుక్తుడు మాత్రమే కాక న్యాయయుక్తు డనికూడ ధర్మజునితో నర్జునుడు చెప్పియున్నాడు. (ఉద్యోగ పర్వ. 150 అధ్యా.) న్యాయము చెప్పునపుడు ధృష్టద్యుమ్ను డర్జునునిగూడ లెక్కసేయలేదు. ద్రోణుని జంపుట న్యాయముగా లేదని యర్జును డనినపుడు ధృష్టద్యుమ్ను డిటులు ధిక్కరించి పలికి పాండవులను సిగ్గుపఱిచెను: (ద్రోణపర్వ—198 అధ్యా).

"ఓ యర్జునా! నాచే ద్రోణుడు చంపబడెనని యేల నన్ను నిందించెదవు. ద్రోణుడు స్వధర్మమగు బ్రాహ్మమును వదలి క్షత్రధర్మము నవలంబించెను. నీచకర్మల జేయుచు మమ్ము దివ్యాస్త్రములచే హింసించెను. మాయను బ్రయోగించునట్టియు బ్రాహ్మణబ్రువుడై సహింప శక్యము కానట్టియు నీచబ్రాహ్మణుని మాయచేతనే చంపుట యుక్తము కాదా యేమి? నీవు ధార్మికుడవై నన్ను గురుఘాతకునిగా చెప్పుచుంటివే; నే నతని జంపుటకే యగ్నినుండి పుట్టితిని. మఱియు గార్యమైనన, నకార్యమైనను రణమున సమముగానే యుద్ధము చేయవలెను. ఓ యర్జునా! ఆ ద్రోణుని బ్రాహ్మణుడనిగాని, క్షత్రియుడనిగాని ఎటుల ననవలయునో? అతడు క్రుద్ధుడై బ్రహ్మాస్త్రములచే నస్త్రవిద్య నెరుగనివారిం జంపుచుండును. (ఉత్తము లట్లు చంపరు)..... మఱియు నాతడు నా బంధువులనే యుద్ధములో జంపువాడు. ఇతరుల బంధువులను జంపువాడు కాడు. అతని శిరస్సు ద్రుంచియు నా తాపము పోలేదు. సైంధవుని శిరస్సును (నీవు) నిషాదదేశమున బడవైచినటులు ద్రోణుని శిరస్సును బడవేయలేనైతినిగదా యని నా హృదయము బాధనొందుచున్నది. (ద్రోణుడు తాను పాంచాలుర జంపినగాని కవచమును విడువననియు, దానటులు సేయకుండిన శేషించిన పాంచాలుర జంపుమని యశ్వత్థామకు దుర్యోధనునిచే సందేశ మంపుటయు నిచట ప్రసక్తము.) (ద్రోణపర్వ 151 అధ్యా.) నీచే విశ్వసఖుడగు భగదత్తుడెటులు చంపబడెనో అట్లే ధర్మముగా నా శత్రువు యుద్ధములో చంపబడెను. పితామహుని (భీష్ముని) యుద్ధమున జంపుట నీకు ధర్మముగా దలపబడుచున్నది. నాచే పాపాత్ముడగు శత్రువు చంపబడినపు డేల పాప మని తలచుచున్నావు? స్వశరీరమునే సోపానముగా జేసిన యేనుగునై సంబంధముచే లోబడిన నన్నో యర్జునా, నిందింప నర్హుడవు గావు. ద్రౌపదియొక్కయు ద్రౌపదేయులయొక్క సంబంధముచేతను, ఇతర కారణములచేతను నీ తప్పుమాటను క్షమించితిని. నాకు ద్రోణునితో వంశక్రమాగతమగు వైరము గలదు. దాని నీ లోకమంతయ నెరుగును. మీ పాండవు లట్టి విరోధు లాతని కిగారు...శిష్యద్రోహియగు పాపాత్ముడు చచ్చెను. యుద్ధము చేయుము. నీకు విజయమగును."

"క్రూరకర్ముడగు ధృష్టద్యుమ్నుని యా వాక్యములకు విని యందరును మిన్నకుండిరి. అర్జునుడు కోపకటాక్షముతో ధృష్టద్యుమ్నుని జూచి కన్నీటితో నిట్టూర్పు విడిచి ఛీ ఛీ! యనెను. ధర్మరాజు భీముడు నకుల సహదేవులు శ్రీకృష్ణుడు తక్కిన రాజులును సిగ్గునొందిరి—"

సాత్యకితో వివాదము జేయునపుడును ధృష్టద్యుమ్నుడు భీష్మభూరిశ్రవసాదుల నన్యాయముగానే మనము చంపితి మని నిజమును వెల్లడించియున్నాడు. దుర్యోధనవధముకూడ న్యాయము కాదని తలచియుండును. ఇట్లు తమ మతమునకు వ్యతిరేకముగా నభిప్రాయమిచ్చు ధృష్టద్యుమ్నుడు, నాతని పక్షమువారు నుండుట కిష్టము లేకయే సౌప్తికవధమునకు కృష్ణు డంగీకరించియుండును. ద్రోణవధమున కంగీకరించి ధృష్టద్యుమ్నునకు వెనుక దాళము వాయించువారిలో భీము డొకడు. వీరిద్దరి సమ్మేళనము కూడ కృష్ణపక్షదౌర్బల్యహేతువు గాన భీమవంశనాశము కూడ కృష్ణున కిష్టమయినది. ధృష్టద్యుమ్నుడు 'శ్వేత' జాతు డనియు, నాతనికి "శ్వేతు" డను ప్రఖ్యాతి గలదనియు "తిక్కన సోమయాజి" ఉద్యోగపర్వమున జెప్పియున్నాడు. నేను చూచిన సంస్కృత భారతపు ప్రతులలో "తిక్కయజ్వ" యాంధ్రీకరించిన ఘట్టమున నటులులేదు. స్థలాంతరమునగాని, సోమయాజి చదివిన ప్రతిలోగాని యట్లుండు నేమో శోధింపవలయును.

శ్వేతుడు పాంచాలురకు బూర్వుడును కాడు. ఎవ్వడో బ్రాహ్మణుడై యుండును. ధృష్టద్యుమ్నుడు మాత్రము ద్రుపదునకు జన్మింపక యే సంకీర్ణబ్రాహ్మణునకో జన్మించెను. వ్యాసుని యందు వైదికము, కృపద్రోణులయందు క్షాత్రము సంక్రమించినటులు ధృష్టద్యుమ్నునియందు క్షాత్రము సంక్రమించియుండును. ద్రౌపది ధృష్టద్యుమ్నునకు దగిన సోదరియే. ఇరువురను యాజోపయాజుల సంబంధులే యని తోచును. ద్రుపదుడు వృషతున కచ్చరలేమయందు జన్మించిన సంకీర్ణు డగుటచేతను తత్సగృహుడగు ధృష్టద్యుమ్నుడు పుత్రు డగుటయు, ద్రౌపది పుత్రిక యగుటయు, నేతాదృశులగు పాండవులతో వారికి సంబంధము సరిపడినది.

శిఖండి

ఈతడు భీష్ముని జంపుటకు ప్రథమమున స్త్రీగా జన్మించెను. పిమ్మట పురుషుడై విఖ్యాతశూరుడై భీష్ముని పడగొట్టి యుద్ధములో విశేషపరాక్రమముతో బోరి పదునెనిమిదవనాటి రాత్రి యశ్వత్థామచే మృతినొందును. ఈతనికి బెక్కండ్రు పుత్రులుకూడ గలరని మహాభారతమున గలదు. ఈ గాథలోని సత్య మెంతవరకో!

స్త్రీలు పౌరుషాభినయము నలవరచుకొనుటచే బురుషసదృశులును, పురుషులు స్త్రీత్వాభినయముచే స్త్రీకల్పులు నగుట లోకవిదతము. స్త్రీగా బుట్టిన శిఖండిని బురుషు డని ద్రుపదుడు ప్రకటించుటయే గాక ద్రోణునికడ నాతడు పుంరూపముతో నస్త్ర శస్త్ర విద్యల నారితేఱిన వానినిగా జేసి భీష్ము జంపునటుల శిఖండిని బురికొల్పుచు 'దశార్ణ' దేశ రాజకుమార్తెను బెండ్లిచేసెను. దశార్ణభూపతి యీ కృత్రిమము దెలిసి యుద్ధసన్నద్ధుడై వచ్చినపుడే శిఖండియొక్క స్త్రీత్వము లోకవిదితమైనది. స్థూలకర్ణుడను యక్షుడు శిఖండికి బుంస్త్వ మిచ్చెనను గాథ నిటులు సమర్థింపవచ్చును. పుంరూపముతో నుండిన శిఖండియొక్క పోలిక గలవాడు స్థూలకర్ణుడను నొకడుండవచ్చును. ఆ స్థూలకర్ణుని స్థానమున శిఖండిని నిలిచి తన స్థానమున నా పరీక్షా సమయమునకు స్థూలకర్ణునం పియుండును. శిఖండి స్త్రీకదా, ఆమెకు నల్వురు పుత్రు లెట్లు కలిగిరి? గాలికి, నీటికి బిడ్డలు పుట్టునా కాలము. 'క్షత్రదేవ, బుక్షదేవా'దులు శిఖండి పెండ్లియాడిన దశార్ణభూపతిపుత్రికయందు క్షేత్రజులుగా బుట్టియుందు రనవచ్చును. లేక బహుళపుత్ర దత్తత గల కాలమగుటచే నల్వురను శిఖండి దత్తునుగా జేసికొని యుండును. లేకుండిన స్థూలకర్ణునకు బత్యుపకృతిగా బీదవాడగు నాతని పుత్రులను తానె పెంచి తన పుత్రులేయని ప్రకటించియైననుండవచ్చును. శిఖండి చిన్నతనమునుండియు సాముగరిడీలను నేర్చి శస్త్రాస్త్ర విద్యల నలవరచుకొనటచే భీష్మునితో బోరు సామర్థ్యము కలిగి మెలగెను. స్త్రీలు పుంభావముతో మెలగిన బురుషనిర్విశేష లగుదురని 'మాధురి' పత్రిక నుండి యుల్లేఖించి యాంధ్రీకరించిన వ్యాసమొకటి "భారతీ" పత్రికయొక్క ప్రభవ సం. మార్గశిరమాస సంచికలో బ్రకటింపబడెను. దానిచే శిఖండియొక్క పుంస్త్వమట్టిదే యని విశదమగును. స్త్రీ లస్త్రశస్త్రములను ధరించి వీరత్వముతో బోరాడుట పాశ్చాత్యదేశములయందే కాక భారతదేశమునను వేదకాలమునుండి గత శతాబ్దమునందలి ఝాన్సీలక్ష్మీభాయి వరకు గలదని గ్రంథనిదర్శనములు గలవు. శిఖండి జన్మాదికముకూడ దేవతామహిమలతో జొప్పింపబడి సంకీర్ణత నొందియున్నది. తన తండ్రికి రాజ్యము నిప్పించిన భీష్ముడు ద్రుపదునకు విరోధి యగుటకు గారణము ద్రోణు 'డహిచ్ఛత్రము' నాక్రమించుట కంగీకరించుటయే యని తోచును. దాని కొఱకే శిఖండిని మొదటినుండియు బ్రోత్సాహపఱుచుటకలిగినది.



శ్రీ గౌతులచ్చన్న గారు శాసనసభకు ఎన్నికలలో విజయమందిన తర్వాత విశాఖపట్టణంలో వారికి విందొనర్చినప్పటి దృశ్యం. వైజాగ్ ఫ్యాక్టరీ లేబర్ కాంస్టిట్యూయెన్సీ తరపున వీరు నిలబడ్డారు.

కాందిశీకులు

శ్రీ ఆకెళ్ల సుబ్బారావు

నేటి భారతదేశాన్ని కలచివేసేవి రెండు సమస్యలు. ఒకటి దేశంలో జరుగుతున్న దారుణ హింసాకాండ; రెండవది కాందిశీకసమస్య. పై రెండు విషయములను గూర్చి తలంచినంతనే ప్రతి భారతీయుని హృదయమూ తప్పక కలచి వేయును. అయితే ఈ సమస్యలు ఎట్లా ఉద్భవించాయి? వీటిని మన ప్రభుత్వాలు ఎలా ఎదుర్కొన్నాయి? అనేది ముఖ్య విషయం.

దేశంలో స్థిరంగా పాతుకొని పోయిన ఈర్ష్య, అసూయ, పరమతసహనం అయివే ఈ సమస్య లుద్భవించటానికి కారణమనాలి. ఏ రాజకీయజ్ఞుని కుటిలనీతికి పర్యవసానంగా 46 ఆగస్టులో కలకత్తాలో ప్రత్యక్షప్రతిఘటనోద్యమం బయలుదేరిందో, ఆ తరువాత నౌఖాలీ, మరియు బీహార్ ఉత్పాతాలు ఉద్భవిల్లాయో నాటినుండీ, భారతీయుల సౌఖ్యం అంతరించిపోయింది. హింసాకాండ చెలరేగిన ప్రదేశాల్లో ప్రజల ధన మాన ప్రాణాలకు తగు రక్షణ లేక లక్షలాది ప్రజానీకం సురక్షిత ప్రదేశాలకు తమ కట్టుగుడ్డలతో లేచిపోయి తలలు దాచుకున్నారు. యిదీ కాక మొన్నటివరకు మన దేశాన్ని పరిపాలించిన ఆంగ్లేయుల కుటిలరాజనీతికి ఫలితంగా భారతదేశాన్ని యిండియన్ యూనియన్ మరియు పాకీస్తాన్ అనే రెండు భాగాలుగా విభజించబడింది. విభజనతోపాటు ఉద్భవించిన రెండవ సమస్య జనాభామార్పిడి ముఖ్యసూత్రాల ననుసరించి ఈ సమస్య సక్రమంగా గట్టెక్కవలసి నదేగాని అంతా దానికి వ్యతిరేకంగా నడిచింది. ఒక డొమినియన్‌లోని ప్రజలు మరియొక డొమినియన్‌లోనికి మార్పిడి విధానం అమలు జరుగవలసివచ్చింది. ఈ మార్పులలో ముఖ్యంగా పడమర పంజాబు సింధురాష్ట్రాలలో అనేకమంది ప్రజలు గూండాల చేతుల్లో హతులైనారు. మిగిలినవారు సురక్షితప్రదేశాలకు చేరుకున్నారు. యింకా చేరుకొంటున్నారు. ఈ కాందిశీక సమస్య యిండియన్ యూనియన్‌కు ఒక పెద్ద గడ్డుసమస్య. పశ్చిమపంజాబు, సింధు, బెలూచిస్తాన్, సరిహద్దురాష్ట్రం, తూర్పు బెంగాల్ మరియు హైదరాబాదు సంస్థానం మొదలగు రాష్ట్రాలనుంచి లక్షలాది ప్రజానీకం కాందిశీకులుగా భారత డొమినియన్‌లోనికి చేరుకున్నారు. కాని వారికి తిండి, బట్ట, ఉండటానికి యిల్లు మొదలగు సౌకర్యాలు భారత డొమినియన్ కలుగజెయ్యాలి. అది ప్రభుత్వం యొక్క కనీసధర్మం. కాని ప్రభుత్వం ఈ విషయంలో ఎంతవరకు సహనాన్ని చూపించి విజయాన్ని పొందగలిగిందీ అన్నది ముఖ్యవిషయం. ఈ విషయంలో కొంతవరకు భారత ప్రభుత్వపు కృషి శ్లాఘించ తగ్గది.

కాందిశీక సమస్య దక్షిణభారతంకంటె ఉత్తరభారతానికి గుదిబండ అయింది. దేశవిభజన మూలంగా లక్షలాది కాందిశీకులు తమ ఆస్తిపాస్తులను పాకిస్తాన్‌లో వదిలివేసి కట్టుగుడ్డలతో యిండియన్ ప్రాంతాలకు చేరుకోటం తటస్థించింది. వారికి రక్షణ, తిండి, ఆశ్రయం యివ్వడానికి భారతప్రభుత్వం హామీ యిచ్చింది. ఈ కాందిశీకులకొరకు ప్రభుత్వం, స్థానికసంస్థలు పెద్దపెద్ద పట్టణాల్లో కాందిశీక శిబిరాలను ఏర్పాటు చేసింది. అందు ముఖ్యముగా కురుక్షేత్రం, అలహాబాదు మొదలగు పెద్ద పెద్ద పట్టణాలలో ఎక్కువ మందికి ఆశ్రయం కల్గచేయడానికి ప్రయత్నం చేసింది. ఈ క్యాంపులలో లక్షలకొలది కాందిశీకులు నివసిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక పోర్టుపోలియోను కూడా ఏర్పాటుచేసి ఒక మంత్రిని నియమించింది.

ఈ సమస్యను పరిష్కరించడానికి మహాత్ముడు తీవ్రకృషి చేసాడు. ఆ వుద్యమంలోనే బాపూజీ తన జీవితాన్ని అంకితం చేసాడు. యింకా ఈ సమస్యను సర్దుబాటు చేయడానికి అనేకమంది శాంతికాముకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఎట్లున్నా యీ సమస్య పదిమందికో పాతికమందికో సంబంధించిన విషయం కాదు. లక్షలాది ప్రజానీకం ప్రాణాలకు సంబంధించిన విషయం. అట్టి సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు తమతమ రాష్ట్రాలలో కాందిశీక రక్షణ శిబిరాలను ఏర్పాటుచేయమని ఆదేశాలు పంపింది. ఆ ఆదేశానుసారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమతమ రాజధానుల్లో కొన్ని శిబిరాలను ఏర్పాటుచేశాయి యీ విషయంలో ముందంజ వేసినవి యు. పి., బీహార్ మరియు తూర్పు పంజాబు రాష్ట్రాలు.

భారతడొమినియన్ కాందిశీకులకు ప్రత్యేకమైన క్యాంపులను రాజధానీ నగరమైన ఢిల్లీలో ఏర్పాటు చేసింది. ఈ క్యాంపులలో సుమారు $5\frac{1}{2}$ లక్షలు కాందిశీకులు నివసిస్తున్నారు. 2 సంవత్సరాలకు పూర్వం 12 లక్షల జనాభాతో నిండియుండే పట్టణం సుమారు నేడు 18 లక్షలను మించి జనాభాను కలిగియున్నది. యిటువంటి సమయంలో వారందరికీ ప్రత్యేకమయిన గృహ సౌకర్యాలు, విద్య, వైద్యం విషయంలో ప్రభుత్వం మంచి చురుకైన ఏర్పాట్లు చేసింది. వారందరికీ పునరావాసాలు కల్పించడానికి చురుకైన ఏర్పాట్లు జరుగుచున్నాయని మార్చి 30 వ తారీఖున "డొమినియన్ పార్లమెంటులో జ్ఞాన గురుముఖ్ సింగ్ వేసిన ప్రశ్నకు అప్పటి కాందిశీక పునరావాస శాఖామంత్రి కె. సి. నియోగి యిలా సమాధానం చెప్పాడు' "ప్రభుత్వం తాత్కాలికంగా 6000 కుటుంబాలకు నివాసాన్ని ఏర్పాటుచేయడానికి తీవ్రప్రయత్నాలు చేస్తోంది. దానికి ఒక బోర్డును ఏర్పాటుచేసింది. ఆ కమిటీ సుమారు 4 మాసాల్లోగా యిండ్లను నిర్మించవచ్చు. మిగిలినవారికికూడా స్థావరాల్ని కల్గించడానికి ఢిల్లీ నగరానికి పరిసరాల్లో యించుమించు 50 వేలమంది నివసించగల్గే 4 క్యాంపులను నిర్మించి వారికి తగిన సౌకర్యాలు ఆ క్యాంపులలోనే కల్పించుచూస్తోంది" అని ఆయన అన్నారు. ఈ క్యాంపులలో వారికి ఉచితంగా భోజనం ప్రస్తుతం యివ్వబడుతోంది. కాని కొన్నిచోట్ల వారిచే చేతిపనులు యితర వ్యవసాయపనులుకూడా చేయించబడతాయి. వారికి విద్యావైద్యసౌకర్యంకొరకు విద్యావైద్యాలయాలను కూడా నిర్మించింది. ప్రస్తుతం కురుక్షేత్రం క్యాంపులో 35,000 కాందిశీక బాలబాలికలు ఉచితంగా విద్యను అభ్యసిస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసింపగోరేవారికి విద్యార్థి వేతనాలను గూడా ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఏప్రిల్ 9 వ తారీఖున భారత ప్రధాని నెహ్రూ పండితుడు కురుక్షేత్రంలో 2 లక్షల ప్రజాసమూహంతో కూడిన ఒక మీటింగులో మాట్లాడుతూ "కాందిశీకుల దుర్భర జీవితాలు చూచేటప్పటికి మా హృదయాలు విచారంతో క్రుంగిపోతున్నాయి. వారికొరకు మేము చేయగలిగినదంతా చేస్తా"మని "కాందిశీకులు క్రమశిక్షణతో మెలగాలి" అని హితబోధ చేశారు.

యు. పి. ప్రభుత్వ కృషి

యు. పి ప్రభుత్వం కాందిశీకుల విషయంలో అత్యంత శ్రద్ధ వహించింది. వారికి వ్యవసాయం చేయగలిగేవారికి లక్ష ఎకరాలను సాగుకు కేటాయించింది. కొంతవరకు వ్యవసాయం సాగుతోంది. వారికి వ్యవసాయపు పెట్టుబడుల నిమిత్తం డబ్బును వ్యవసాయతనఖాబాకీలను ఏర్పాటుచేసింది. మరియు వ్యవసాయంకొరకు సుమారు 300 దిగుడుబావులను త్రవ్వించి యంత్ర సాహాయ్యముతో నీరుతోడే యేర్పాట్లు చేసింది. ఉచిత విద్యావైద్య సౌకర్యాలుకూడా కలుగచేసింది. ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి ద్వారా అనేకమందికి వుద్యోగాలుకూడా కలుగజేసింది. మరియు అనేక చేతివృత్తులను ట్రయినింగు కేంద్రాలను ఏర్పాటుచేసి తరిఫీదు నిస్తున్నది. స్త్రీలకు గూడా ట్రయినింగు కేంద్రాలను ఏర్పాటుచేసి అనేక వుద్యోగాలు వారికి కూడా కలుగచేసింది.

బీహార్ ప్రభుత్వ కృషి

కాందిశీకులకు సౌకర్యాలను కలిగించే విషయంలో బీహార్ అగ్రస్థానం వహించింది. ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంపులలో "ఛాకూల్యాఇయా" క్యాంపు ముఖ్యమైనది. సుందరమైన పొలాలమధ్య నిర్మింపబడి జమ్‌షెడ్ పూరకు 60 మైళ్ల దూరాన ఉన్నది. యిందు కాందిశీకులకు శాశ్వత నివాసానికి సౌకర్యాలు కలుగజేయబడ్డాయి. ఈ క్యాంపు పంచాయతీరాజ్యవిధానంగా సాగించబడుతోంది. వారికొరకు విద్య, తిండి, వ్యాయామ క్రీడలకు చక్కటి ఆటస్థలాలు, మంచినీటి సౌకర్యాలు, వినోదాలు, ఉచిత విద్యా సౌకర్యాలు కలుగజేయబడి ఈ క్యాంపు భారతానికి శిరోమాణిక్యం లాగున నడుప బడుతున్నది. ఈ క్యాంపులో నివసించే వారు సింధునుండి పడమర పంజాబునుండి వచ్చినవారు.

తూర్పు పంజాబు

కాందిశీక సమస్యను పరిష్కరించడానికి పంజాబురాష్ట్రం అమృతసర్, ఫిరోజ్‌పూర్, గుర్‌గాన్ మరియు జలంధర్, మొదలగు పెద్ద పట్టణాలలో కొన్ని కేంద్రాలను ఏర్పాటు చేసినది. ఈ క్యాంపులలో సుమారు 4 లక్షల 50 వేలకు మించి కాందిశీకులు నివసిస్తున్నారు. వీరికొరకు ఈ రాష్ట్రం ఉచితంగా వస్త్రాలను దుప్పట్లును చలికాలంలో పంచిపెట్టి లక్షలాది ప్రజల ప్రాణాలను నిలబెట్టింది. చేతి విద్యలలో తరిఫీదు నిచ్చేందుకు "గాంధీ ఆశ్రమం" అనే పేరుతో ఒక గొప్ప ఆశ్రమాన్ని నడుపుతోంది. వైద్య, విద్యా సౌకర్యాలు కలుగజేస్తూ, వ్యవసాయానికి భూములుకూడా యిచ్చింది. వారికొరకు టెక్నికల్ విద్యా సంస్థలను నడుపుతోంది.

ఈ పై రాష్ట్రాలతోబాటు కృషి చేయలేకపోయినా బొంబాయి, అస్సాం రాష్ట్రాలు కూడ వారికొరకు కొన్ని మేళ్ళు చేయగలిగాయి.

మద్రాసు రాష్ట్రం

అన్ని రాష్ట్రాలతోబాటు ఈ రాష్ట్రానికి కేటాయించబడిన కాందిశీకులకు పునరావాస సౌకర్యాలను కలుగజేయడానికి మద్రాసు ప్రభుత్వం మద్రాసులో ఒక కాందిశీక శిబిరాన్ని ఏర్పాటుచేసింది. అందు సుమారు 4 వేలమందికి సౌకర్యాలు కలుగజేయబడ్డాయని ఈ రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. అన్ని రాష్ట్రాలకంటె ఈ రాష్ట్రానికి యింకో గడ్డు సమస్య కూడా సంభవించింది. గత 11 మాసాలుగా హైదరాబాదు సంస్థానంలో జరుగుచున్న ఘోరరక్తపాతానికి తట్టుకోలేక ఆ సంస్థానంలో వుండే కొంత ప్రజానీకం కాందిశీకులై ఈ రాష్ట్రానికి వచ్చి యిచ్చట వలస ఏర్పాట్లు చేసుకొన్నారు. వారి స్థితి దుర్భరమైనది. వారు విశేషంగా ఆంధ్రదేశంలోని విజయవాడ, తెనాలి, బందరు, కర్నూలు మొదలగు ప్రాంతాలలో విస్తారంగా నివసిస్తున్నారు. వారికొరకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి ఏర్పాటులు చేయలేదనే చెప్పాలి. అయినప్పటికి స్థానికులు మాత్రమే కొన్ని క్యాంపులను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అవి కొద్దిరోజులలోనే అంతరించాయి. యిక ఈ కాందిశీకులు సరియైన సౌకర్యాలులేని కారణంగా స్థానిక ప్రజానీకానికి కొన్ని విషయాలలో భారంగానే తోస్తోంది.

ఉత్తర హిందూస్థానానికి పాకిస్తాను కాందిశీక సమస్య యెంత ముఖ్యమైనదో ఈ రాష్ట్రానికి హైదరాబాద్ కాందిశీక సమస్యకూడా అంతే ముఖ్యమైనది. కాని ఈ సమస్య విషయంలో యిటు రాష్ట్రప్రభుత్వం అటు కేంద్ర ప్రభుత్వాలు చాలా ఔదాసీన్యం చూపిస్తున్నాయి. ఈ కాందిశీకులు వలసవచ్చి నానా అగచాట్లు పడుచున్నారు. కనీసం విజయవాడ లాంటి పెద్ద పట్టణాలలోఅయినా కొంత సౌకర్యాలు ప్రభుత్వాలు కలుగజేయకపోతే వారి గతి ఏమి కౌతుంది? వీరికి వైద్యసౌకర్యాలులేవు. వీరి బాలబాలికలకు విద్యాసౌకర్యాలు లేవు. పోనీ, హైద్రాబాదు సమస్య ఏదో తేలిపోతుంది; వారి స్వగృహాలకు వారు పోతారంటే అదీ నానాటికి విషమరూపం దాలుస్తూ వాయిదాలు కోరుతున్నది.

కాన ప్రభుత్వం ఈలా ఉదాసీనంగా వూరుకోటం అంత మంచి పనిగా తోచలేదు. పోనీ మద్రాసులో ప్రారంభించిన క్యాంపులోనయినా సరే వారికొరకు స్థానం ఏర్పరుపబడిందా అంటే అదీ లేదు. ఆ క్యాంపులో వుత్తరహిందూస్థానీయులగు సిక్కులు మొదలగు వారికే ఏర్పాటయిందట. కాబట్టి యిది అతి ముఖ్యమైన సమస్యలలో ఒకటి. అనేకమంది ప్రజాప్రతినిధులగు మంత్రులు సరిహద్దు ప్రాంతాలలో సంచారం చేసి వారి కష్టాలు స్వయంగా చూచి ఈ విషయంలో ఉపేక్షచేయటం ఏమీ బాగుండలేదు. కాబట్టి ప్రభుత్వం యిప్పటికైనా ఈ కాందిశీకులను దృష్టిలో వుంచుకొని కనీసం కొన్ని క్యాంపులనైనా ఆంధ్రావనిలో స్థాపించి హైద్రాబాదు కాందిశీకులకు తగిన సౌకర్యాలు కలిగించక పోయినట్లయితే, యిటు స్థానిక ప్రజకు, అటు కాందిశీకులూ కూడా కష్టములను ఎదుర్కొనవలసి వస్తుంది. కాబట్టి ప్రభుత్వంతోటి రాష్ట్ర ప్రభుత్వాలను దృష్టిలో వుంచుకొని సమంజసమైన విధంగా వ్యవహరించెదరని ప్రార్థిస్తున్నాను.

వి. పి. మీనన్

(7-వ పేజీ తరువాయి)

యూనియన్ చేయడంలో చాలా యిబ్బందులు వచ్చాయి. గ్వాలియర్, ఇండూర్ సంస్థానాలు ప్రత్యేక పరిపాలనా భాగాలుగా ఉండదగినవి. ప్రజాభిప్రాయం కూడా వీటిని రెండు యూనియన్లుగా చేయాలని. కాని సంస్థానశాఖవారికి యీ అభిప్రాయం నచ్చలేదు. ఏమైనా సరే, యీ మూడింటిని కలిపి ఒకే యూనియన్ చేయాలనే సంకల్పంతో ఏప్రిల్ 20, 21, 22 తేదీలలో మధ్య భారత సంస్థానాధీశుల సమావేశం ఢిల్లీలో ఏర్పరచాడు మీనన్. తన చాకచక్యంతో ముగ్గుర్నీ కలిపి ఒక యూనియన్ చేసితీరాడు. ఈ విప్లవ పరిసమాప్తికి తుదిఘట్టం పుల్కాన్ యూనియన్ స్థాపన. దీని విషయంలో మీనన్ క్లిష్టసమస్యల నెదుర్కోవలసి వచ్చింది. ఒడంబడికలమీద సంతకాలు అయినప్పటికీ మంత్రివర్గస్థాపనలో పేచీ వచ్చింది. వెంటనే మీనన్ పాటియాలా పరుగెత్తాడు. కాని యీ దిగ్విజయ యాత్రలో మీనన్‌కు అపజయం తప్పిందికాదు. చివరకు రాజన్‌బాబు పరిష్కారంతో అనుకున్న ప్రకారం జూలై 15వ తేదీన సర్దార్, పాటియాలా, తూర్పుపంజాబు సంస్థానాల యూనియన్ ప్రారంభోత్సవం చేశాడు. అయితే దీనితో పటేల్ మీనన్‌ల బాధ్యత పూర్తి కాలేదు.

ఇంకా 12 పెద్ద సంస్థానాలు ఏ రాష్ట్రంతోను, ఏ యూనియన్‌తోను కలవకుండా ప్రత్యేకంగా ఉన్నాయి. వీటిలో కాశ్మీర్, హైద్రాబాదు సమస్యలు అంతర్జాతీయ రూపాన్ని దాల్చిన విషయం అంతా ఎరిగినదే! హైద్రాబాదు ఇండియా సంబంధాల చర్చల సందర్భంలో డెహరాడూన్ ఢిల్లీల మధ్య మీనన్ గంతులు ఆంధ్రులంతా ఎరిగిన విషయమే. ఇవికాక మరొక తొమ్మిది చిన్న సంస్థానాలుకూడా వేటితోనూ కలవకుండా విడిగా ఉండిపోయాయి. ఇవన్నీ మీనన్ దృష్టిని దాటిపోలేదు. హైద్రాబాదు ఒడంబడక ముసాయిదాలో ఒక్క అక్షరంకూడా మార్చడానికి సిద్ధంగా లేమని చెప్పేటప్పుడు చూడాలి మీనన్ ముఖకవళికలు! ఇలా మిగిలిపోయిన వాటిని కూడా ఒక దారికి తీసుకువచ్చే వార్తలు త్వరలో వినిపిస్తానని హామీ యిచ్చాడు మీనన్.

తమ రాచరికాలు, ఆర్భాటం, నిరంకుశత్వాన్ని మొదలంట త్రుంచివేసినా అందరి మహారాజులకు కూడా మీనన్ అంటే ప్రాణం. అందరికీ అతడు తలలోని నాల్క. ఆ మహారాజులంతా సెక్రిటేరియట్‌లో వి. పి. మీనన్ గది ప్రక్క గదిలో అతని పిలుపుకోసం పడిగాపులు పడి వుంటారు. ఢిల్లీవచ్చిన ప్రతి మహారాజా మీనన్‌ను చూడకుండా వెళ్ళడానికి లేదు. అతడు వాళ్ళ ఆయువుపట్టు. దానికితోడు ఇనుప మనిషి అనుకోబడే సర్దార్ పటేల్ సంస్థానాల వ్యవహారాలు పూర్తిగా వి. పి. మీనన్ మీద వదలాడంటే మీనన్ యొక్క ప్రాముఖ్యం అర్థమవుతుంది.

ఇంత అధికారం, పలుకుబడీ ఉన్నప్పటికి కూడా ఇతడు అందరికీ అందుబాటులో ఉంటాడు. కసిలి దిట్టు తనానికి అతడిది ప్రథమ తాంబూలం. హాస్యంగా మాట్లాడ్డంలో అందె వేసిన చెయ్యి. ఏదో కథో, నవ్వుపుట్టించే సన్నివేశమో చెప్పి నవ్విస్తేకాని మాట్లాడడు. బ్రహ్మాండమైన సమస్యలు ఆలోచిస్తూ కూడా కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వించే కబుర్లు చెబుతాడు. సామాన్యులలో మీనన్ అతిసామాన్యుడు. కన్నాట్ సర్కస్‌లోకాని, కేరళాక్లబ్ సమావేశాల్లోకాని ఎక్కడ కనుపించినా మీనన్ గొప్ప, పేద, పెద్ద, చిన్న భేదం చూపించకుండా అందర్నీ పలకరిస్తాడు. కొత్త పాత లేకుండా సరదాగా కబుర్లు చెప్పడంలో మీనన్ తరువాతే మరెవరైనా. ఆడవాళ్ళ వెఱ్ఱి వేషాలను విమర్శించడమంటే అతడు వస్తేరు మీద బండే! గర్వంకాని, ఆడంబరం కాని ఎరుగని మీనన్ వినయానికి ప్రతి వ్యక్తి ముగ్ధుడై తీరవలసిందే. తాబేదార్లను భుజం తట్టి పనిచేయించుకోవడములో మొనగాడు. తన డిపార్టుమెంటు అంతా కూడా సంతోషంగా ఎంతపనైనా కావాలని చేయడానికి వెనకంజ వేయరని ధైర్యంగా చెప్తుంటాడు. సమావేశమంటే బళ్ళ లెక్కని దస్త్రాల కట్టలు పట్టుకు వెళ్ళే కార్యదర్శులలా కాకుండా మీనన్ సర్వసంతగ్రాహి. ఏ సమావేశానికి కూడా ఒక్క కాగితమైనా పట్టుకు వెళ్ళని ప్రతిభావంతుడు. వేట అంటే ప్రాణం. ఇప్పటికీ ఎక్కువ పనిచేసి అలసిపోయినప్పుడు తుపాకి తీసుకుని వేటకు పోవాలని ఉబలాటపడతాడు. బులంద్‌షా అడవుల్లో ఒకసారి రెండు పులుల్ని కొట్టిన దిట్ట. వేటగురించి మాట్లాడ్డం అతడి Weakness కాలక్షేపం కాని రోజుల్లో పేకాడే అలవాటు. కాని పేచీలు వస్తే ముక్కలు ఎదటివారి మీదకు విసిరేసే ఉద్రిక్తుడుకూడాను.

మీనన్ స్ఫురద్రూపి కాదు. కాని ఢిల్లీలో ఎక్కడ కనిపించినా ఆ బట్టతల, బుష్‌కోట్‌లో అతణ్ణి అనవాలు పట్టడం మహాసులువు.

వి. పి. మీనన్ మొదటిసారి 1925లో వివాహం చేసుకున్నాడు. 1941లో శ్రీమతి కనకమ్మను వివాహ మాడాడు. మొదటిభార్యవల్ల యిద్దరు కొడుకులు. శ్రీమతి కనకమ్మకు ఒక కుమార్తె. ఇతడివివాహాలవిషయంలో చాలా కథలు చెప్పుకుంటారు. కాని అతడు ఆ విషయంలో మాట్లాడ్డానికి అంత యిష్టపడడు. అతడికి యిష్టంలేనిది నేను మాత్రం ఎందుకు చెప్పాలి. ప్రస్తుతం ముగ్గురు పిల్లలు, శ్రీమతి కనకమ్మ, తనతల్లి కుట్టి అమ్మాళ్‌తో కులాసాగా కాలక్షేపం చేస్తున్నాడు. చెప్పడం మరిచాను. బ్రిటిష్ వారికి చేసిన సేవాఫలితంగా మీనన్‌కు రావుబహదుర్, C. I. E., C. S. I. బిరుదులు కూడా వచ్చాయి.

వాపల్ పంగున్ని మీనన్ సంతకాలతో సంస్థానాధీశులతో భారతప్రభుత్వం చేసుకున్న ఒడంబడికలు ఉన్నంతకాలం అతడి పేరు భారత చరిత్రములో నిల్చిపోతుంది. సంస్థానాల కలయికలు, యూనియన్ స్థాపనల కృషికి అతనిని అభినందిస్తే "సరియైన సమయానికి మంచి స్థలంలో ఉండడం తప్ప నాలో ఏముంది. అదంతా సర్దార్ పటేల్ పేరులోని మహిమ. ఆ కీర్తి ప్రతిష్ఠలు ఆయనకే దక్కా" లంటాడు. మూడుమూర్తులా నాయకునికి తగినబంటు.

భారత సంస్థానాల శాఖవారు భారత నాయకులు కలలో కూడా ఊహించని మహత్తర రక్తవిరహిత విప్లవం సాధించారు సంస్థానాలలో. భారత సంస్థానాల సమస్యగా నామరూపాలు లేకుండా మాసిపోయే ఘడియ దగ్గరపడింది. ఈ విప్లవాన్ని ఊహించింది సర్దార్ పటేల్. దిగ్విజయం సమకూర్చింది వి. పి. మీనన్. ప్రభుత్వాధికారు లందరిలోను ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న అదృష్టవంతుడు వి. పి. మీనన్!

కీ॥ శే॥ కో. పున్నయ్యగారు

(9 వ పేజీ తరువాయి)

రెండు పర్యాయములు మాత్రమే వెలువడేది. 1919 లో పున్నయ్యగారు సంపాదకత్వమును స్వీకరించిన అనతికాలంలోనే దానిని దినపత్రికగా మార్చివేసిరి. ఆ రోజుల్లో సింధురాష్ట్రంలో రాజకీయాలు, పత్రికారచన చాలా పురాతన దశలో ఉండేవి. సింధురాష్ట్ర ప్రజాజీవితంలో నవశకోదయానికి కారకుడు పున్నయ్యగారే. వస్తుతః కాంగ్రెస్‌వాదే అయినప్పటికీ, అవసరమునుబట్టి సింధురాష్ట్రంలో హిందువులకు అండగా నిలబడి వారి కోర్కెలనే బలపర్చవలసివచ్చింది. రాజకీయంగా కాంగ్రెస్‌తో ఆయనగారు చాలా సంవత్సరాలు సంబంధాన్ని కలిగి ఉన్నారు. కరాచీ కాంగ్రెస్‌వరకూ, అఖిల భారత కాంగ్రెస్ సంఘంలో సభ్యులుగా ఉన్నారు. కరాచీ కాంగ్రెస్ సందర్భంలోనే పున్నయ్యగారు కాంగ్రెస్‌నుంచి వైదొలగారు.

పున్నయ్యగారు సింధు అబ్జర్వర్‌కు సంపాదకులైనప్పుడు, ఆపత్రిక బాగు పర్చడానికి కూడా వీలులేనంత పాడుగా వున్నది. ఎన్నో ప్రతిబంధకము లున్నప్పటికీ, అనేక విధాలుగా కృషిచేసి స్వయం ప్రతిభవల్ల దానిని మెల్లగా పైకి తీసుకొని వచ్చారు 'వినోది' అనే కల్పిత నామంతో పున్నయ్యగారు వ్రాసిన వ్యాసములు యెక్కువగా ప్రజాభిమానము చూరగొన్నవి. పున్నయ్యగారిది ఆర్ద్రహృదయం. విరామము, ఆలసట యెరుగని కృషి, దానితోపాటు విపరీతమైన పట్టుదల ఆయన సహజగుణములు. భారతీయ పత్రికా రచయితలలో ప్రచారకుడుగా ఆయన కెవరూ సాటి రారు. వివేచనా నైపుణ్యంలో కీ॥ శే॥ కాళీ సాధరాయ్, పాండిత్యంలో క. నటరాజన్, తెలివితేటలలో పోతన్ జోసెఫ్‌గారలు పున్నయ్యగారికి మించినవారేగాని, ఏదైనా ఒక లక్ష్యమును సాధించుటకై పోరాటము సాగించుటలో వీరికి యే ఒక్కరూ సరితూగరు.

పున్నయ్యగారంటే, సింధులో కేవలం ప్రజాసామాన్యమే గాక చదువుకొన్నవారు గూడా ఎక్కువగా ప్రేమించారు. ధనికవర్గములను పెట్టుబడిదారీ ప్రయోజనాలను నిర్భయంగా పున్నయ్యగారు ప్రతిఘటించేవారు.

పత్రికా రచనలో పున్నయ్యగారు స్వతంత్రుడు. ఇతరుల ప్రమేయాన్నిగాని, ఆధిపత్యాన్ని గాని సహించేవారు కారు. పండిట్ నెహ్రూ సింధురాష్ట్రమునకు వచ్చినపుడు ఆయనఉపన్యాసములకు ఎక్కువ ప్రాధాన్యం యిచ్చి ప్రచురించాలా, వద్దా అనే విషయం పేచీ రాగా, 1937లో పున్నయ్యగారు ఉద్యోగమునుండి బర్తరఫ్ అయినారు. అయితే 'సింధుఅబ్జర్వర్' మళ్ళీ కొత్త యజమాని చేతుల్లోకి వెళ్ళింది. పున్నయ్యగారు తిరిగి సంపాదకత్వమును స్వీకరించారు.

బొంబాయినుండి సింధు విడదీయబడిన కారణంగా సింధు రాజకీయ జీవితం యెంతో అయోమయ స్థితికి గురియైనప్పుడు, నిర్భయంగా మార్గమును నిర్దేశించింది పున్నయ్యగారే. కరాచిని విడిచిపోయేముందు, ఆయన జీవితం విషాదభరితమైంది. పోయినవారు పోగా మిగిలిన ఒక్క కొడుకూ, మనమడూ మైసూరులో నీట మునిగి మరణించారు. సింధు ప్రభుత్వం కూడా ఆయనపై దెబ్బ తీసింది. 'అబ్జర్వర్' పత్రికలోని శీర్షికలు, సంపాదకీయాలు ముందుగా తమకు పంపవలెనని ఉత్తర్వు జారీచేసింది. ఈ ఉత్తర్వు జారీయైనరోజూనే పున్నయ్యగారు సింధు అబ్జర్వర్‌తో తన సంబంధాన్ని వదులుకున్నారు.

("స్వతంత్రలో," శ్రీ "పతి" రచించిన వ్యాసమునుండి.)

BHAGYALAXMI CROSSWORD COMPETITIONS

భాగ్యలక్ష్మి తెలుగు గళ్ళ సమస్యాపోటీలు.


మొదటి బహుమానము. Rs. (రూ) 500/- పూర్తిగ సరియైన జవాబులకు
ఇతర బహుమానములు. 1, 2, 3 తప్పులుగలవారకు Rs. (రూ) 350/-
స్పెషల్ బహుమానములు Rs. (రూ) 100/- ఎక్కువ ప్రవేశములకు Rs. (రూ) 50/-

సమస్యాపతకము (Puzzle) No 1

Rs. (రూ) 1,000 లకు పైగా బహుమానములు!

Closing Date (ముగింపుతేదీ) 27-8-1948 శుక్రవారము మ. 2 గంటలకు
ప్రవేశరుసుము మొదటిప్రవేశము రూ 1/- తక్కినవి ఒక్కొక్కటికి 8 అ చొ
ఉచితము తొమ్మిది ప్రవేశములు రుసుముతో పంపువానికి ఒక ప్రవేశము ఉచితము

Rules in Brief
తెల్లకాగితముపైని ప్రవేశములు పంపవచ్చును రుసుము మనియార్డరుగ లేక రద్దుచేయని పోష్టల్ ఆర్డరుగ గాని పంపవచ్చును కవరు రెండవ ప్రక్కను పూర్తిపేరు విలాసము ఎన్ని ప్రవేశములు పంపినది విడివిడిగ వ్రాయవలెను తుడుపులు, దిద్దుబాట్లు తప్పులుగ ఎంచబడును సరియైన జవాబులు 2 అ స్టాంపులకు పంపబడును



In all matters concerning this competition the manager's decision is final and legally binding and is an express condition of entry

(2) If the expected amount is not received in full, the amount received will be distributed proportionately, as per rules

Key solution will be published in (1) Uttara Andhra weekly, Chicacole D/9-9-48 and Andhra Patrika illustrated weekly Madras D/8-9-48.

(Detailed rules cost 2 as.)

సమస్యలు. (అడ్డుగ)

1 ఈ సమస్యలను సరిగ పూర్తిచేసిన తక్కువ మదుపుతో ఎక్కుడు "ఇది".
3 పోటీదారులు ఈ కృషిలో 'దీని' కూడ చేసినవార లగుదురు
5 ఈ కృషిలో మనసు "ఇట్లు"గ నుండినగాని సరిగ కృతార్థులగు టరుదు
6 అంచె. (8) మనసునంటి ఇది ఎంతకాలము వేధించును.
9 జవ్వనికి అందమునిచ్చునవి (10) అనతి
11 శత్రుని సాధించుటకు అదనుతెలిసి 'దీని' నాచరించు వారలు అరుదు!
14 పారుదల (అక్షరములు క్రమముతప్పినవి)
15 పిల్లల "యివ్వివి" తలిదండ్రుల హృదయముల నెంత యాకర్షించును.
17 'దీని' మంచిచెడ్డల నెంతయెటింగి వినియోగించిన నంత మంచిది,
18 కార్యాచరణమునకు ఈత..మిగులననమర్థుడు

సమస్యలు. (క్రిందుగ)

2 ప్రదోషము (4) నేర్పరి
7 భాగము
8 శ్రీమంతులకునైన ఇట్టి నడవడి పెట్టని భూషణము (9) సృష్టి రమణీయమును తెలుపకయే తెలుపును. (10) విపత్తులు
11 శత్రుని బలసాహసము లెంత తీవ్రమో 'దీని. పరిమితి అంత అధికముగ నుండవలెను.
12 'దీని' నిర్మలత్వము శరీర సౌందర్యమునకు వన్నెతెచ్చును.
13 " " విహారము రాజులకు ఎక్కుడు సంతోషదాయకము
15 'దీని' నైజమెరింగి ప్రవర్తన సరిచేయనిచో వ్యర్థులగుదురు
16 సమానత్వమును సాధించును!

N B Entries, Money Orders, Postal Orders, Etc., may be sent to the following address,-

The Manager,

SRI BHAGYALAXMI TELUGU CROSSWORD, COMPETITIONS,
Chicacole, (B. N. Ry) Vizag Dt.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

భారతదేశ ఆర్థికపరిస్థితి : రిజర్వుబ్యాంకు సమీక్ష

భారత రిజర్వు బ్యాంకు వాటాదారులకు ప్రతి సంవత్సరము సమర్పించే నివేదికలో, ఆ సంవత్సరములో భారతదేశ ఆర్థికపరిస్థితిని సమీక్షిస్తుంటుంది. భారతదేశ ఆర్థిక వ్యవహారాలలో రిజర్వు బ్యాంకుకు వున్న సంబంధము మరే ఇతర సంస్థకు వుండదు. కాబట్టి మన ఆర్థికపరిస్థితులను గురించి రిజర్వు బ్యాంకు చేసే వ్యాఖ్యానముకన్న సహేతుకమూ, అధికార పూరితము అయినది మరొకటి వుండదు.

భారతదేశం విభజింపబడిన తర్వాత ఆర్థిక రంగంలో రెండు ముఖ్య సంఘటనలు జరిగినవి. మత సంక్షోభమువలన జరిగిన ఆస్తి నష్టమూ, జనాభా మార్పిడి వీనిలో మొదటిది. పశ్చిమ పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాలలో పరిశ్రమలన్నీ పూర్తిగా ధ్వంసమైపోయినవి; వ్యవసాయము కూడ చాలవరకు స్తంభించిపోయి, ఒక పంట నష్టమైపోయినది. పశ్చిమ పాకిస్థాన్ నుండి వచ్చి వేసేవారిని రక్షణతో తీసుకొనివచ్చుటకు, ఇచ్చుటకు వచ్చిన తర్వాత సర్వ సౌకర్యములు ఏర్పాటుచేసి, కొంతకాలము వరకు పోషించుటకు బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వములు వహించక తప్పలేదు. తూర్పుపంజాబ్ రాష్ట్రము అప్పుడే క్రొత్తగా ఏర్పడి, క్రొత్త రాజధాని సిమ్లాలో ఇంకా కార్యాలయములు కూడా ఏర్పాటుచేసుకునే వ్యవధి లేకుండానే సంక్షోభంలో చిక్కుకోవటం వల్ల కాందిశీకుల బాధ్యత అంతా కేంద్ర ప్రభుత్వమే భరించవలసి వచ్చింది. కాందిశీకులకు రోజుకు కొన్ని లక్షల రూపాయలు చొప్పున దాదాపు 20 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ మొత్తమంతా ప్రభుత్వ ఖజానాలో నుండి వచ్చి, చలామణిలో నున్న ధనమును—ప్రత్యామ్నాయ ఉత్పత్తి ఎక్కువ కాకుండానే—వృద్ధిపరచి, ధనోల్బణమును తీవ్రతర మొనరించినది.

జీవితావసర వస్తువులపై గత నాలుగైదు సంవత్సరములనుండి వున్న కంట్రోల్సును గత డిశెంబరులో తొలగించుట మరొక ముఖ్య సంఘటన. కంట్రోల్సు, రేషనింగ్ అమలులో నున్నంతకాలము ప్రజలకు జీవితావసర వస్తువులు చాలవరకు కంట్రోల్ ధరలకే లభించెడివి. భాగ్యవంతులైన కొద్దిమంది మాత్రమే బ్లాక్ మార్కెట్ ధరలకు కొనగలిగెడువారు. కంట్రోల్ తొలగించిన తర్వాత అన్ని వస్తువుల ధరలు ఆశించినంతకన్న చాల ఎక్కువగా పెరిగిపోయి ప్రజల జీవనవ్యయము చాలా హెచ్చినది. 1947 వ సం. నవంబరు, 1948 వ సం. మే నెలల మధ్య ఆహార పదార్థముల ధర నూటికి 21 వంతులు పెరిగినది. మే నెలవరకు ఆహారపదార్థములు అన్ని ప్రాంతములలోను పుష్కలంగా నున్నవి. అప్పటికి ధరలు ఇంకా బాగా పెరగనేలేదు. మే నెలలోకన్న జూన్, జూలై మాసములలో ధరలు కొంచెం పెరిగినవి; అక్టోబరు, నవంబరు నెలలలో ఇప్పటికన్న కూడ ఎక్కువ పెరగగలవు. అందువలన రానున్న నెలలో ప్రజలు మరీ ఇబ్బందిపడవలసి వచ్చును. వస్త్రముల ధరలుకూడ కంట్రోల్ తొలగించిన తర్వాత చాల ఎక్కువగా పెరిగినవి. అంతే గాక దొంగతనముగా గుడ్డను ఇతర దేశములకు ఎగుమతిచేయుటకూడ జరుగుచున్నది. ఒక్క గుడ్డల విషయములోనే కంట్రోల్ తొలగించిన తర్వాత వర్తకులు, పారిశ్రామికవేత్తలు సుమారు 100 కోట్ల రూపాయలు దొంగలాభము పొందినారనీ, దానిపై పన్ను విధించుటకు కూడా భారతప్రభుత్వానికి అవకాశము లేకపోతున్నదనీ తెలుస్తున్నది. అంటే ఈ ఒక్క సందర్భములోనే భారతప్రభుత్వము 60-70 కోట్ల రూపాయలు నష్టపడుతున్నదన్నమాట! కంట్రోల్ తొలగింపు ఫలితాలు ఆశించినట్లుగా లేవనీ, తిరిగి ఒకరకపు కంట్రోల్ విధించాలనీ రిజర్వు బ్యాంకు అభిప్రాయపడుతున్నది.

అన్ని వస్తువుల ధరలు ధనోల్బణము పెరిగిపోవటానికి భారతప్రభుత్వ దిగుమతుల విధానం కూడా కొంతవరకు కారణమని రిజర్వుబ్యాంకు చూపిన అంకెలవల్ల తేలుచున్నది. 1948 వ సం. జనవరి నెలలో అంతమైన ఏడు నెలలలో ఇండియా పాకిస్థానులు రెండూకలసి విదేశాలతో ఎగుమతి, దిగుమతుల కలన 11 8 కోట్ల రూపాయలు నిలువచేసాయి. అంటే దిగుమతులకంటె ఎగుమతులు అంతమొత్తం ఎక్కువ వున్నవన్న మాట. గత సంవత్సరం ఈ కాలంలోనే, అంటే 1947 వ సం. జనవరి నెలతో అంతమయ్యే ఏడు నెలలలో ఇండియాకు వ్యాగారంమూలంగా 18.9 కోట్ల రూపాయల లోటు వచ్చింది. అంటే ఎగుమతులకన్న దిగుమతులు ఇంత ఎక్కువున్నవని అర్థము. ఈ రెండు అంకెలను జోడించి చూస్తే 1947 వ సం. లో ఏడునెలల కాలం కన్న, 1948 వ సం. ఏడు నెలలకాలంలో 40 7 కోట్ల రూపాయలు వస్తువులు తక్కువ దిగుమతి జరిగినవని తేలుచున్నది. మనకువిడుదలచేసిన స్టర్లింగు మొత్తమును వారు కొనలేకపోతిమన్నను, మన దేశములో వస్తువులన్నియు కొరతగా వున్నను ఆశ్చర్యపడవలసినదేమున్నది? భారత ప్రభుత్వ దిగుమతి విధానము ఈమధ్యనే కొంతవరకు సడలింపబడినది. ఇప్పుడైనను ఎక్కువ వస్తువులు—ముఖ్యముగా గుడ్డ, పంచదార దిగుమతి జరిగి, ధరలు, ధనోల్బణము తగ్గనట్లు ప్రభుత్వము కృషి చేయవలెను.

గత సంవత్సరం 150 కోట్ల రూపాయలు ఋణం చెయ్యాలని భారత ప్రభుత్వం నిశ్చయించింది. కాని 'సేవింగ్సు' ఉద్యమం ఏమీ జయప్రదంగా జరగలేదు. 75 కోట్ల రూపాయల ఋణాలుమాత్రమే గత సంవత్సరం జారీచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులందరు ప్రజలలో నిత్యము పర్యటిస్తుండే నాయకులు కాబట్టి, 'సేవింగ్సు' ఉద్యమాన్ని ప్రచారంలోనికి తెచ్చి, ప్రజలు తమ అదనపు సొమ్మును దుర్వ్యయ పరచకుండా, ప్రభుత్వ ఋణపత్రాలను కొనేటట్లు ప్రోత్సహించవలెను.

ఈ సంవత్సరంలో 5 బ్యాంకులు షెడ్యూల్డు బ్యాంకుల తరగతిలో చేర్చబడినవి. 3 బ్యాంకులు ఆ తరగతినుండి తొలగించబడినవి. మూలధనము, రిజర్వుఫండులు కలిసి రూ. 5 లక్షలకు మించిన బ్యాంకులను షెడ్యూల్డు బ్యాంకులుగా గుర్తించెదరు. ప్రస్తుతము ఇట్టి బ్యాంకులు మనదేశములో 99 వున్నవి. వీటి శాఖల మొత్తం 3490. పాకిస్థానులో ఒక్క షెడ్యూల్డు బ్యాంకు మాత్రమే వున్నది. మనదేశంలో వున్న 99 షెడ్యూల్డు బ్యాంకులలోను కలిపి 1948 వ సం. జూన్ 25 వ తేదీనాడు 1,110.84 కోట్ల రూపాయిలు 'డిపాజిట్లు' వున్నవి. గత సంవత్సరం వీనిలో డిపాజిట్ల మొత్తం 1013.70 కోట్ల రూపాయలు మాత్రమే. ఈ బ్యాంకులు ఖాతాదారులకు అప్పుపెట్టిన మొత్తం 403.9 కోట్ల రూపాయలనుండి, 468.41 కోట్ల రూపాయలవరకు పెరిగింది. గత సంవత్సరంలో 12 బ్యాంకులు రిజర్వు బ్యాంకునుంచి కూడా అప్పు పుచ్చుకున్నవి.

మన దేశంలో నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులు ప్రస్తుతం 659 వున్నవి. బెంగాల్ విభజన, అటు తర్వాత జరిగిన కలకత్తా సంఘటన మొదలైన వాటివలన బెంగాల్‌లోని చిన్నచిన్న బ్యాంకులు బాగా దెబ్బతిన్నవి. అందువలన వీటి డిపాజిట మొత్తం 78 44 కోట్ల రూపాయల నుండి 45.49 కోట్ల రూపాయలకు తగ్గిపోయెను. దేశవిభజనానంతరము ఏర్పడిన అల్లకల్లోలముల వలన బ్యాంకుల ఖాతాదారులు తమ సొమ్మంతనూ ఒక్కమారుగా చెల్లించవలసిందని ఒత్తిడి తెచ్చారు. ఇట్లా జరిగివుంటే బ్యాంకులన్నీ దివాళా తీయవలసివచ్చేది. ఒకవేళ ఏ బ్యాంకైనా ఖాతాదారుల ఒత్తిడిని పడలేకపోతే దానికి ఋణమిచ్చి సహాయపడటానికి రిజర్వుబ్యాంకు అధికారం తీసుకున్నది కాని దానిని ఉపయోగించవలసిన అవుసరం కలుగలేదు.

రిజర్వుబ్యాంకును తమపర మొనర్చుకొనుటకు భారతప్రభుత్వము ఫిబ్రవరి నెలలో నిర్ణయించినది. ప్రస్తుతపరిస్థితులలో రిజర్వుబ్యాంకును వశపరచుకొనుట ప్రమాదకరమని, అనేక క్లిష్ట సమస్యలకు దారి తీయగలదని రిజర్వుబ్యాంకు డైరెక్టర్ల బోర్డు వారు ఆక్షేపించుచు, భారత ప్రభుత్వము తన నిర్ణయమును ఉపసంహరింపవలసిందని కోరిరి. కాని భారతప్రభుత్వము తన నిర్ణయమును మార్చుకొనదలచలేదు. రిజర్వు బ్యాంకు గవర్నర్ భారత ప్రభుత్వముచే నియమింపబడినను, కొంతమంది డైరెక్టరులు వాటాదార్లచేతనే ఎన్నుకొనబడుచుందురు. సామాన్యముగా వీరందరు ధనికవర్గమునకు చెందినవారై యుందురు. వీరివైఖరి రిజర్వుబ్యాంకు నిర్ణయములను చాలవరకు నిర్ణయించుచుండును. గత 12 ఏండ్లనుండి సహకారోద్యమమునకు, వ్యవసాయమునకు రిజర్వుబ్యాంకు ఎన్నదగిన సహాయము చేయలేకపోవుటకు వీరే ఎక్కువ కారణము. రిజర్వు బ్యాంకు దేశములో అన్నివర్గములవారికి వారి వారి ప్రాముఖ్యతను బట్టి సేవ చేయుచుండవలెనన్న అది ప్రభుత్వపరముగానే నడువవలెను.

ఈ సంవత్సరం రిజర్వుబ్యాంకు నికరలాభము రూ. 10,38,28,428-14-8. ఈ మొత్తంలో 20 లక్షలరూపాయలు వాటాదార్లకు డివిడెండ్‌గా పంచిపెట్టెదరు. వాటాదార్లకు డివిడెండ్ షేరుధనముపై నూటికి 4 రూ. లకు మించి యివ్వరాదని రిజర్వుబ్యాంకు చట్టములోనే నిబంధన లున్నవి. డివిడెండ్ 20 లక్షలు పోను తక్కిన 10 కోట్ల 18 లక్షల రూపాయలు ప్రభుత్వఖాతాకు జమకట్టెదరు. గత సంవత్సరం రిజర్వుబ్యాంకు లాభం మొత్తం 8 కోట్ల రెండు లక్షలరూపాయలుమాత్రమే.

రిజర్వుబ్యాంకు స్టర్లింగు నిలువలు గత సంవత్సరంకన్న రూ. 29.48 కోట్లు తగ్గిపోయి, జూన్ 30 వ తేదీనాడు 1536.67 కోట్ల రూపాయలున్నవి. ఈనిలువల విడుదలను గురించి బ్రిటిష్ ప్రభుత్వంతో చేసుకున్న మూడు ఒడంబడికల వివరాలు రిజర్వుబ్యాంకు నివేదికలో తెలియజేశారు. స్టర్లింగు నిలువలలోను, లాభాలలోను పాకిస్థాన్‌కు కొంతభాగం పంచవలసి వుంటుంది. పాకిస్థాన్‌లో చలామణిలో నున్న నోట్ల మొత్తము, దేశమంతటా వున్న రిజర్వు బ్యాంకు నోట్ల మొత్తములో ఎన్నవంతు ఉండునో, అన్నవవంతు భాగము స్టర్లింగు నిలువలనుండి, లాభాలనుండి పాకిస్థాన్ ఖాతాకు జమకట్టవలసి యుండును.

ఈ సంవత్సరములో ధనోల్బణము నరికట్టుటకు, ధరలు తగ్గించుటకు జరిగిన ప్రయత్నములు వివరిస్తూ, ఏదో ఒక రకపు కంట్రోల్ తిరిగి విధించి, ఉత్పత్తి నధికపరచి, సేవింగ్సు ఉద్యమము తీవ్ర మొనర్చవనే దేశఆర్థిక పరిస్థితి చక్కబడుననీ, ప్రభుత్వం నిర్ణయించే విధానాల ఆచరణ,నిర్వహణలు ఎంత బాగా జరిగిన, పరిస్థితి అంత త్వరగా బాగుపడుననీ, వీనిని బాగు చేయుటకు ప్రభుత్వము వెంటనే పూనుకొనవలెననీ రిజర్వు బ్యాంకు డైరెక్టర్ల బోర్డువారు కేంద్రప్రభుత్వమును హెచ్చరించిరి.

నేటి ప్రపంచం

(5 వ పేజీ తరువాయి)

ఉదంతం ఋజువుచేస్తున్నదని పారిస్‌లోని రాజకీయ వర్గాలవారు వ్యాఖ్యానించారు.

లండన్, పారిస్ రాజకీయవర్గాలు ఊహించినట్లు సోవియెట్ విదేశమంత్రి రష్యా రాజధానిలో సరిగా సమయానికి లేకపోవడం బుద్ధిపూర్వకంగా జరిపిన చర్యో, లేక కాకతాళీయంగా జరిగిందో చెప్పలేముగాని. మూడు పశ్చిమరాజ్యాలు బర్లిన్ ప్రతిష్టంభనా పరిష్కారానికి తలపెట్టిన కార్యక్రమానికి ఆదిలోనే హంసపాదు పడ్డది. బర్లిన్ సమస్య సమరసభావంతో పరిష్కారమయే దశ ఏనాడో దాటిపోయింది. పర్యవసానంగా బ్రిటిషు విదేశమంత్రి బెవిన్ సూచించినట్లు బలప్రయోగమే శరణ్యమవుతుందో, లేక ఈ ప్రతిష్టంభన ఎటూ తేలకుండా ఇదే స్థితిలో మరి కొంతకాలంపాటు సాగుతుందో జోస్యం చెప్పలేము. ఏది ఏమైనప్పటికీ, ఎప్పటికో ఒకప్పటికి ఘోర ఉపద్రవాన్ని తెచ్చిపెట్టే నాయలు మాత్రం ప్రత్యక్షంగా, ప్రబలంగా కనబడుతున్నవి. ఈ సమస్య సామరస్యంతో పరిష్కారమయే అవకాశం ఏమాత్రం వున్నా ఇదివరకే అట్టి పరిష్కారం లభ్యమై వుండవలసింది.

అమెరికా అధ్యక్షపదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న థామస్ డ్యూయి, డెమొక్రెటిక్ పార్టీ అభ్యర్థి హారీ ట్రూమన్ న్యూయార్కు నగరంలో ఏకవేదికపైకి ఎక్కి, ప్రపంచశాంతికి పరస్పర విశ్వాసం, సుహృద్భావం అవసరమని ఉద్బోధించారు. తీవ్ర విభేదాలను ఎదుర్కొంటున్న ప్రపంచ ప్రజలు ఈ విభేధాలన్నీ బాహ్య విభేదాలేననీ, వస్తుతః స్వభావసిద్ధంగా ప్రజలందరూ ఒకటేననీ, ఈ సత్యాన్ని వివిధదేశాలవారూ ఎంత శీఘ్రంగా అవగాహనచేసుకుంటే ప్రపంచానికి అంత శ్రేయస్కరమనీ న్యూయార్కు గవర్నర్ థామస్ డ్యూయీ అన్నాడు. ప్రపంచమంతటా పరస్పర స్నేహసుహృద్భావ సాధనకు అమెరికన్ ప్రజలు పూనుకొని పనిచేయాలని ప్రెసిడెంట్ ట్రూమన్ అన్నాడు. అధ్యక్షపదవికి రానున్న ఎన్నికలలో పోటీ చేస్తున్న ఈ ప్రత్యర్థులు ఇద్దరూ ఈవిధంగా ప్రపంచ ప్రజలను ఉద్బోధించడం శుభసూచకమే అయినప్పటికీ, ఆచరణలో ఆ ఆశయాలను అమెరికన్ ప్రభుత్వం ఎంతవరకు సాధిస్తుందన్నది, సాధించగలదన్నదీ సందేహాస్పదమైన విషయం. విపరీతంగా సైనిక బలాన్ని, ఆయుధబలాన్ని పెంపొందజేస్తూ తద్వారా రష్యాను దారికి తీసుకొని రావడానికి ప్రయత్నిస్తున్న తన శ్రీరంగ నీతులను మార్షల్ స్టాలిన్ విశ్వసించడనే విషయం ట్రూమన్‌కు తెలుసు; అమెరికన్ ప్రజలకూ తెలుసు. ఇకపోతే ట్రూమన్ చెప్పిన పరస్పరవిశ్వాస సుహృద్భావ ఆవశ్యకత సూచన మిగతా ప్రపంచాన్ని ఉద్దేశించి—రష్యాను కేటాయించి—చెప్పినమాటే. మిగత ప్రపంచమంతా ఏకమైతే, స్టాలిన్ లొంగిరాక పోతాడా అని ట్రూమన్ ఆశ. మార్షల్ పథక సహాయంద్వారా స్వీయ ఆర్థిక ప్రాబల్య స్థాపనను సంకల్పించిన అమెరికామాట మిగతా ప్రపంచ ప్రజాబాహుళ్యపు హృదయాలలో ఏపాటి ఆశాభావాన్ని రేకెత్తిస్తుందన్నది అనుమానాస్పదమైన విషయమే.

———

యుగసంధి

(6-వ పేజీ తరువాయి)

"ఆ.. ఆలస్యమయిపోయిందా?.. ", వాసిలీ ఇవానోవిచ్ ఆరెండు ముక్కలూ అతిప్రయత్నంతో ఉచ్చరించగలిగాడు.

"అనుకుంటాను! నాలుగు గంటలు దాటి పోయింది."

వాసిలీ ఇవానోవిచ్ గాయందగ్గర మరి కొస్త కాల్చాడు. "ఆ జిల్లా వైద్యుడి దగ్గర ద్రావకం లేదూ?"

"లేదు."

"లేదూ! అయ్యో దేవుడా! వైద్యుడన్న వాడి దగ్గర ఇల్లాంటి అవసరమయిన వస్తువే లేదూ?"

"అతని కత్తులు చూడాలి నువ్వు," అన్నాడు బజరోవ్ వెళ్లిపోతూ.

రాత్రి పొద్దుపోయిందాకానూ, మరునాడు అస్తమానూ, వాసిలీ ఇవానోవిచ్ ఏదో వంక పెట్టుకొని కొడుకు గదిలోకి వెళ్ళి చూసివస్తూ గడిపాడు. ఆ గాయాన్ని గురించి అతను అసలు ప్రస్తావించక పోయినా—అంతేకాదు, సందర్భం లేని మాట లేవో అనేవాడుకూడా—బజరోవ్ ముఖంలోకి ఆదుర్దాగా తీక్ష్ణంగా చూస్తుండే వాడు. చివరకి బజరోవ్‌కి విసుగుపుట్టి ఇంట్లో నించి వెళ్ళిపోతా నని బెదిరించాడు. ఇంక అతన్ని అట్టే బాధపెట్టనని వాసిలీ ఇవానోవిచ్ అతనికి మాట ఇచ్చాడు. ఆరినా వ్లాసీవ్నా ఈ ధోరణిఅంతా చూసి, అతన్ని ఎందుకిల్లా నిద్రపోకుండా తిరుగుతావనీ, ఏ మొచ్చిందనీ అడిగింది. కాని అతను ఆమెతోమట్టుకు ఈ విషయం ఏమీ చెప్పలేదు. రెండురోజులు అతను అల్లాగే ఓపికపట్టుకుని ఉన్నాడు. బజరోవ్ పరిస్థితి అతనికేమీ నచ్చలేదు. అతన్ని చాటుగా పరీక్షిస్తూనే ఉన్నాడు..... మూడవరోజున భోజనాల దగ్గర ఇంక అతను ఆపుకోలేక పోయాడు. బజరోవ్ బరువుగా క్రిందికి చూస్తూ కూర్చున్నాడు. ఒక్కపదార్థమూ నోటిలో పెట్టుకోలేదు.

"ఏమీ తినవేం యవ్‌గనీ?" ఎంతో యాదాలాపంగా అడిగినట్టు అడిగాడు. "వంట చాలా బాగుందే?"

"నా కేమీ అక్కరలేదు. అంచేత తినడం లేదు."

"ఆకలిలేదా? నీతల," కొంచెం బెదురుతూ మెల్లగా అన్నాడు "నీతల నొప్పిగా ఉందా?"

"ఆఁ. తలనొప్పిగాఉండదు మరీ."

ఆరినా వ్లాసీవ్నా చటుకుని తిన్నగా కూర్చుంది.

"కోపం తెచ్చుకోకు, యవ్‌గనీ," వాసిలీ ఇవానోవిచ్ అన్నాడు, "కాస్త నాడి చూడ నియ్యవూ?"

బజరోవ్ లేచాడు. "అక్కర లేకుండానే చెప్పగలను. నాకు జ్వరం తగిలింది."

"చలి, వణుకు ఏమన్నా ఉందా?"

"ఆ. చలి ఉంది. పోయి పడుకుంటాను. నాకు కాస్త నిమ్మపువ్వు టీ కాచి పంపించు. జలుబు చేసిందనుకుంటాను."

"నిజమే. అంతే. నిన్నరాత్రి దగ్గుతున్నావు. నేను విన్నాను," అంది ఆరినా వ్లాసీవ్నా.

"జలుబు చేసింది," బజరోవ్ మళ్లీ అని వెళ్లిపోయాడు.

ఆరినా వ్లాసీవ్నా నిమ్మపువ్వు టీ తయారు చెయ్యడానికి వెళ్లింది. వాసిలీఇవానోవిచ్ పక్క గదిలోకిపోయి నిస్పృహతో జుట్టు చేతివేళ్లతో గట్టిగా పట్టుకున్నాడు.

ఆనాడు ఇంక బజరోవ్ మళ్లీ లేవలేదు. రాత్రి తెల్లవార్లూ బరువుగా, సగం మత్తుగా పడుకున్నాడు. రాత్రి ఒంటిగంట వేళ ప్రయత్నంమీద కళ్లు తెరిచి చూచేసరికి, దీపపు వెలుగులో తనమీద వంగి చూస్తున్న తన తండ్రి ముఖం అతనికి కనిపించింది. అతని వెళ్లిపొమ్మని బజరోవ్ అన్నాడు. ఆ ముసలితండ్రి క్షమాపణ చెప్పుకుని వెళ్ళిపోయి మళ్లీ మెల్లగా మునికాళ్లమీద నడిచి వచ్చి బీరువా పక్కని నిలబడి తొంగిచూస్తూ అక్కడే నిలబడ్డాడు. ఆరినావ్లాసీవ్నాకూడా ఆరాత్రి నిద్రపోలేదు. ఆ గది తలుపు కొద్దిగా తెరిచి ఉంచి అప్పుడప్పుడు అక్కడికి వచ్చి "ఎన్యూషా ఊపిరి ఎల్లా పీల్చుకుంటున్నాడో," చూసి వెడుతూ గడిపింది. కదలిక లేని అతనివీపు తప్ప ఇంకేమీ ఆమెకు కనిపించేదికాదు. కాని అదే కొంత ఆమెకు సంతృప్తిగా ఉండేది. ఉదయాన్ని బజరోవ్ లేవడానికి ప్రయత్నించాడు. కాని అతనికి కళ్లు తిరిగాయి. ముక్కువెంట నెత్తురు కారడం ప్రారంభించింది. అతను మళ్లీ పడుకున్నాడు. వాసిలి ఇవానోవిచ్ నిశ్శబ్దంగా అతన్ని కనిపెట్టుకుని నిలబడి ఉన్నాడు. ఆరినా వ్లాసీవ్నా అతని దగ్గరకు వెళ్లి ఎల్లా వుందని అడిగింది. కొంచెము నయంగా ఉందని సమాధానం చెప్పి అతను గోడవేపు తిరిగి పడుకున్నాడు. వాసిలీ ఇవానోవిచ్ రెండు చేతులతోటీ ఆమెకు సంజ్ఞ చేశాడు. ఆమె ఏడుపు ఆపుకోడానికి పెదవి గట్టిగా పంటితో కొరుక్కుని అవతలకు వెళ్లిపోయింది. ఇల్లంతా చటుకుని చీకటయిపోయింది. అందరి ముఖాలమీదా విషాదం మూర్తీభవించింది. చిత్రమయిన నిశ్శబ్దం ఆవరించింది. కీచుగా కూసిన ఒక కోడిని పట్టుకుని ఊళ్లోకి తీసుకుపోయారు. ఎందుకు తీసుకుపోతున్నారో కోడికి అర్థం కాలేదు. బజరోవ్ అల్లా గోడవేపే తిరిగి పడుకున్నాడు. వాసిలీ ఇవానోవిచ్ ఏవో ప్రశ్నలు అడగబోయాడు. కాని బజరోవ్‌కి విసుగుపుట్టింది. ఆ ముసలి తండ్రి తన కుర్చీలో దిగాలుపడి అప్పుడప్పుడు మెటికలు విరుచుకుంటూ మౌనంగా కూర్చున్నాడు. కొంచెం సేపు తోటలోకి వెళ్లాడు. శిలా ప్రతిమలాగ కొంతసేపు నిలబడ్డాడు, ఏదో మహా విచిత్రం జరిగిపోయినట్టుగా (ఆశ్చర్యముద్ర అతనిముఖాన్ని శాశ్వతంగా అద్దుకుంది). తన భార్య అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, మళ్లీ కొడుకు దగ్గరకు వెళ్లాడు. చివరకి ఆమె అతని చెయ్యి ఉద్రేకంగా పట్టుకుని, గట్టిగా అడిగింది "ఎందుకు అల్లా ఉన్నాడు?" అప్పుడు అతను కొంచెం తట్టుకున్నాడు. మెల్లగా ఆమెనుచూసి చిరునవ్వు నవ్వబోయాడు. కాని అతని ప్రయత్నం లేకుండానే ఆ చిరునవ్వు పెద్ద అట్టహాసముగా మారిపోయింది. అతనికే భయం వేసింది తన నవ్వుచూస్తే. తెల్లవారగట్ల అతను వైద్యుడి కోసం కబురు పంపాడు. కొడుకు ఈ సంగతి ముందుగా చెప్పకపోతే కోపం తెచ్చుకుంటాడేమోనని చెప్పడం అవసరమనుకున్నాడు. బజరోవ్ పక్కమీద రెండోపక్కకి చటుకుని తిరిగాడు. చురుకుదనం లేని చూపులు తండ్రి వేపు చూసి దాహం కావా లన్నాడు.

వాసిలీ ఇవానోవిచ్ అతనికి కొంచెం మంచి నీళ్లు ఇచ్చాడు. ఇస్తూ అతని నుదుటిమీద చెయ్యిపెట్టి చూశాడు. నుదురు నిప్పులా కాలుతోంది.

"నాన్నా", అన్నాడు బజరోవ్, నీరసముగా, "నా పరిస్థితి ఏమీ బాగా లేదు. నాకు అంటువ్యాధి సంక్రమించింది. కొద్ది రోజుల్లో నన్ను నువ్వు పాతిపెట్టించాలి.

వాసిలీ ఇవానోవిచ్ వెనక్కి తూలిపోయాడు—ఎవరో కాళ్లమీద కొట్టినట్టు.

"యవ్‌గనీ", మాటలు తడుముకుంటూ అన్నాడు, "ఏమిటి అంటున్నావు! .. భగవంతుడి దయఉండాలి...జలుబుచేసింది అంతే!"

"చాల్లే", బజరోవ్ ధాటీగా అన్నాడు, "వైద్యుడయినవాడు అల్లా మాట్లాడితే వీల్లేదు. వ్యాధి లక్షణాలన్నీ ఉన్నాయి. నీకూ తెలుసు."

"ఏవి ఆ లక్షణాలు. యవ్‌గనీ! అయ్యో దేవుడా! ఏవి?"

"ఇదేమి టంటావు?" బజరోవ్ తన చొక్కా ఎత్తి తనచేతిమీద మెల్లగా పాకుతున్న ఎర్రటి మచ్చలు చూపించాడు.

వాసిలీ ఇవానోవిచ్ భయంతో వణికిపోయాడు.

"పోనీ...అయినా," చివరికి అనగలిగాడు, "ఒకవేళ ఆ వ్యాధే అనుకో...అయినా..."

"పైమియా", అన్నాడు కొడుకు.

"పోనీ అదే. ఆ అంటువ్యాధే.. ".

"పైమియా", అన్నాడు బజరోవ్ మళ్లీ స్పష్టంగా, "నువ్వు చదువుకున్న పుస్తకాలన్నీ మరిచిపోయావా?"

"సరే...నువ్వన్నట్టే అనుకో. అయినా ఏదో చికిత్సచేసి కుదురుస్తాం."

"చాల్లే. అదంతా వట్టి బూటకం. అసలు విషయం అది కాదు. ఇంత తొందరగా చచ్చిపోతానని నేను అనుకోలేదు. నిజం చెప్పాలంటే చాలా హితవు లేని సంగతి ఇది. నువ్వూ అమ్మా, ఇంక మీ మత విశ్వాసాల మీద కురిపెట్టుకోవాలి. ఇది అసలు పరీక్షాసమయం" అతను కొంచెం నీరు తాగాడు. "ఒక విషయం నిన్ను అడగాలి. నా బుర్ర నా స్వాధీనంలో ఉండగానే. రేపో ఎల్లుండో నా మెదడు తన పనికి రాజీనామా పంపిస్తుంది. ఇప్పుడయినా నేను స్పష్టంగా చెప్పగలుగుతున్నానో లేదో నాకు అనుమానమే. పడుకుని కళ్లు మూసుకుంటే నా చుట్టూ ఎర్రటి కుక్కలు ప్రదక్షిణం చేస్తున్నట్టు అనిపిస్తోంది. నువ్వు వాటిని నా మీదికి ఉసికొలుపుతున్నా వనిపిస్తోంది కూడా. నేను చెప్పినదంతా నీకు తెలుస్తోందా?"

"యవ్‌గనీ, నువ్వు స్పష్టంగా మాట్లాడుతున్నావు."

"అయితే మరీ మంచిది. వైద్యుడికోసం కబురు పంపుతానన్నావు. అది నీ సంతృప్తి కోసం.. నాక్కూడా సంతృప్తి కలిగేటట్టు చూడు. ఒక మనిషికి ఉత్తరం ఇచ్చిపంపాలి."

"ఆర్కాడీ నికోలవైచ్ దగ్గరకా?" అన్నాడు తండ్రి.

"ఎవరా ఆర్కాడీ నికోలవైచ్", బజరోవ్ ఏదో సందేహం వచ్చినట్టు అన్నాడు.—"ఓహో ఆ పక్షి! వద్దు. అతన్ని అల్లా వదలి పెట్టు. అతను ఇప్పుడు గువ్వపిట్టయి కూడుకట్టుకున్నాడు. నే నిల్లా అంటున్నానని ఆశ్చర్యపడకు. ఇది ఇంకా సంధి కాదు. ఓడిన్‌ట్సోవ్ పతి దగ్గరకు పంపాలి మనిషిని. ఆమె పేరు ఆనా సర్గీవ్నా. ఆమెకు జమీ ఉంది. . తెలుసునా?" (వాసిలీ ఇవానోవిచ్ తెలుసునని తల ఊపాడు.) "యవ్‌గనీ బజరోవ్ చచ్చిపోతున్నాడనీ, తన అభివందనాలు పంపుతున్నాడనీ కబురు చెయ్యి. చేస్తావా?"

"తప్పకుండా చేస్తాను...కాని యవ్‌గనీ! నువ్వు చచ్చిపోవడం అసంభవం కాదూ? .. ఆలోచించు ఇంక అల్లాఅయితే భగవంతుడూ, అతని ధర్మం ఏమయిపోవాలి?"

"వాటి విషయం నా కేం తెలియదు. మనిషిని మాత్రం పంపించు."

"ఇప్పుడే పంపిస్తాను. నేనే ఉత్తరం రాసి ఇస్తాను."

"వద్దు, ఎందుకు? ఊరికే అభివందనాలు పంపానని చెప్పమను. ఇంకేమీ అవసరంలేదు. ఇంక నా ఎర్రకుక్కల దగ్గరకు నేను పోతాను. చిత్రం! చావుమీద నా మనస్సంతా కేంద్రీకరించా లని ఉందినాకు. కాని ఏమీ ప్రయోజనం లేదు. ఊరికే దృష్టి చెదిరిపోతుంది, అంతే. ఏమీ లేదు."

బాధగా అతను మళ్ళీ గోడవైపు తిరిగాడు. వాసిలీ ఇవానోవిచ్ గదిలోనించి బయటకు వెళ్లిపోయాడు. తన భార్యగదిదాకా వెళ్ళి దైవ విగ్రహాలముందు మోకాళ్లమీద వాలిపోయాడు.

"ఆరినా, దేవుణ్ణిప్రార్థించు!" అని మూలుగుతూ అన్నాడు, "అబ్బాయి చచ్చిపోతున్నాడు."

వైద్యుడు, ద్రావకంకూడా లేని,ఆ ప్రభుత్వ వైద్యుడే వచ్చాడు. రోగిని చూసిన తరవాత, ఉపశాంతికోసం అల్లాగే ఏదన్నా చికిత్స చెయ్యమన్నాడు. ఆ సందర్భంలో రోగం మళ్లడానికి సావకాశాలు లేకపోలే దని అన్నాడు.

"నా స్థితిలో ఉన్న ఏ రోగికాని, స్వర్గానికి పోకుండా తిరిగి రావడం మీరు చూశారా?" అని అడిగాడు బజరోవ్. చటుకుని దగ్గరగా ఉన్న బరువయిన బల్ల ఒకదాన్ని కోడు పట్టుకుని తిప్పి దూరంగా విసిరాడు. "బలం ఉంది, బలం ఉంది," అంటూ గొణుక్కున్నాడు, "ఇంకా అన్నీ ఉన్నాయి. అయినా నేను చచ్చిపోవాలి! ఇంకా ముసలివాడయితే జీవితాన్నించి కొంచెం తొలిగించడానికి సావకాశం ఉంటుంది. నేనో...సరే! చేతనయితే చావుని కాదనను. చావు నిన్ను కాదంటుంది అంతే! ఎవరక్కడ ఏడుపు?" కొంచెం సేపాగి అన్నాడు—"అమ్మ! పాపం! ఇంక చక్కని ముల్లంగి ఫలుసు వండి ఆప్యాయంగా ఎవరికి పెట్టుకుంటుంది? వాసిలీ ఇవానోవిచ్, నువ్వు కూడానా? ఆ ఏడుపు? క్రీస్తుమతం నీకు ఉపశాంతిని ఇవ్వలేకపోతే వేదాంతివి కావాలి, యోగివి కావాలి. ఏదయినా సరే. ఏం? నువ్వు వేదాంతివని గొప్ప చెప్పుకునేవాడవు కదూ?"

లేఖలు

కిరసనాయిలు యిబ్బంది

ఆర్యా,

కంట్రోలు ప్రకారముగా పోసే కిరసనాయిల్ ప్రజలకు సరిపోవటంలేదు. సాయంకాలమే భోజనాలు ముగించుకొని, కిక్కురుమనకుండా చీకట్లో పడుకోవలసివస్తోంది. బంధువు లెవరైనా వస్తే, వారికి వంటచేసి భోజనము పెట్టాలి. లాంతరు వెలిగించుదామంటే దానిలో ఆయిలు వుండదు. చీకట్లో వంటచేసే దెట్లా? భోజనం చేసేదెట్లా? యిక పిల్లల సంగతి చూద్దామంటే, చదువుకోటానికి దీపాలులేవు. చీకట్లో కుర్రోమొర్రోమని ఏడ్చుచున్నారు. ఇల్లంతా చీకటిమయం. ఎక్కడ ఏ వస్తువున్నదీ కనబడదు. గ్రుడ్డివాడుమాదిరిగా సంచరించటం, గాయాలు తగలటం జరుగుతోంది. ఒక రాత్రి ఒక యుగంక్రింద జరుగుతోంది. యీ యిబ్బందు లన్నియు బీదవారికే. ధనవంతులకేమి? బ్లాకుమార్కెట్టులో డబ్బా యిరవైనాలుగు రూపాయలు పెట్టి కొనుక్కొంటున్నారు.

నిత్యము కూలికిపోతేనేగాని రూపాయి డబ్బులు రావు. అటువంటప్పుడు కూలివాడు బ్లాకుమార్కెట్టులో కిరసనాయిలు ఎట్లాకొనేది? ప్రజాప్రభుత్వములో యిటువంటి బ్లాకు మార్కెట్టు వ్యాపారాలు సాగుతున్నాయంటే ఆశ్చర్యంగా వుంది. బ్లాక్ మార్కెట్టు వ్యాపారాన్ని నాశనంచేసి, ప్రజలకు సక్రమంగా కిరసనాయిలును అందజేయిస్తారని, పై అధికారులు యీ విషయములో తగిన శ్రద్ధ తీసుకొంటారనీ ఆశిస్తున్నాను.


యీమని సుబ్బారావు.
పురుషోత్తంపల్లి.

గ్రంథాలయ శాసనము: ప్రభుత్వ కర్తవ్యము

గ్రంథాలయోద్యమాభివృద్ధికై యిన్నేండ్ల తరువాత ప్రభుత్వమువారొక శాసననిర్మాణము గావించి ప్రజల విజ్ఞానాభివృద్ధి కొక మార్గము చూపించుట ప్రశంసనీయము. బిల్లులోని చాల అంశములు కూలంకషముగా చర్చించి దేశకాల మాన పరిస్థితుల కనువగునట్లు మార్చుట అత్యంతావశ్యకము. ఈ పనిని సమరులగు సలహా సంఘము వారు అత్యంత శ్రద్ధ తీసుకొని, యించుక అలస్యమయినను దీనిని సర్వాంగీణస్ఫూర్తిగ బయలు పరచెదరని నమ్ముచున్నాను. గ్రంథాలయములను విరివిగా స్థాపించుట, గ్రంథజాలమును అసంఖ్యాకముగా సేకరించుట, గ్రంథాయ విలోకనములను బహుళముగా నిచ్చుటతోడనే ప్రభుత్వమువారు తమ బాధ్యత తీరిన దని తృప్తిపడక, ఆయా గ్రంథాలయములను సక్రమ పద్ధతులలో నడిపించుటకున్నూ, గ్రంథరాజములను సర్వజనోపయుక్తముగా నుంచి నిరక్షరాస్యుల మానస క్షేత్రములలో గూడ విజ్ఞాన బీజములు వెదజల్లగల సమరులగు గ్రంథభాండాగారుల నియమించి, వారికి తగిన శిక్షణ గరపించి, సంతృప్త జీవనోపాధుల కల్పించుటకూడ ముఖ్యకర్తవ్యముగా భావించి, వాటికికూడ తగిన నియమావళీ నిర్వహణములను యీ బిల్లులోనే పొందుపరచిన నాడే తమ గ్రంథాలయ శాసన నిర్మాణ దీక్ష పరిపూర్తి యగునని మనవి చేయుచున్నాను.

యం. వి. దీక్షితులు
సహాయకార్యదర్శి,
మద్రాసు రాష్ట్రీయ
గ్రంథభాండాగారుల సంఘము.

యంత్రయుగపు వింతలూ విశేషాలూ



"వివిధ వాతావరణాల మందిరం"

జెట్ విమానాల వేగమూ, అనుకూల వాతావరణపరిస్థితులు మొదలైనవన్నీ పరిశోధించగలిగేందుకు కొత్తమాదిరి "వాతావరణమందిరం" పరిశోధనార్థమై నిర్మించారు. ఈమందిరంలో, భూమినుంచి ఎంతఎత్తునఉన్న వాతావరణపరిస్థితులనైనా కృతకంగా కల్పించి పరిశోధనలు సాగించే అవకాశముంది. భూమికి 80,000 అడుగుల ఎత్తున ఉన్న వాతావరణ పరిస్థితినికూడా ఈ గదిలో కల్పించగల అవకాశముంది.




పారాట్రూపర్ మోటార్ సైకిల్

పారాట్రూపర్లు (గాలిగొడుగుల వైమానికయోధులు) యుద్ధకాలంలో వాడిన ఈ కొత్తరకం చిన్నమోటారుసైకిలు, ఇప్పుడు సామాన్యులు మోజుగా వాడుతున్నారు. ఆస్కాట్ గుఱ్ఱపుపందాలకు, పెద్దమనుష్యులు ఈ రకం మోటారుసైకిళ్ల మీద రావటం ఇప్పుడు ఫాషన్ అయింది


"రాడార్ సోండి"-

"సెంటిమీట్రిక్ రేడార్ సోండి"అనే ఈ కొత్తరేడార్ బెలూన్ చిన్నఎత్తున, ఒక పరిపూర్ణమైన వాతావరణ పరిశోధన కేంద్రంవలె పనిచేస్తుంది. ట్రాన్స్మిటర్, రిసీవర్ మొదలైన వాతావరణ పరిశోధనకు అవసరమైన యంత్రాలన్నీ ఈ తేలిక బెలూన్లో అమర్చబడి ఉన్నాయి. ఈ బెలూన్ 75,000 అడుగుల ఎత్తుదాకా వెళ్తుంది. ఇక అక్కడ బెలూన్ పగిలిపోయినప్పుడు యంత్రాలన్నీ పారాషూట్ సహాయంతో మెల్లిగా క్రిందికివస్తాయి. అక్కడి వాతావరణ పరిస్థితులన్నీ యంత్రాలలో రికార్డు చేసి ఉంటుంది.





"సూపర్ సోనిక్ టెస్టు విమానము" ఈ కొత్తరకపు జెట్ విమానం గమనవేగంలో మునుపటి వరుస్తు రికార్డువేగాలను అన్నిటినీ మించినది. ఇది రహస్యాయుధంగానే తయారుచేస్తున్నారు. ఈవిమానము గంటకు 605.2 మైళ్ల వేగాన హార్టుఫోర్టుషైర్లోని, నూరు కిలోమోటర్ల సర్క్యూటును, 6.96 సెకన్లలో పూర్తిచేసి, విమానాశ్రయంలోకి వచ్చింది.





బనియన్ అల్లికయంత్రము

బనియన్లకూ, అండర్ వేర్, మొదలైన వాట్నన్నిటకి కావలసిన కొత్తరకం "జెర్సెటర్" అల్లికబట్టను, తయారుచేసే ఈ యంత్రాలను ఇటీవిగా బ్రిటిష్‌కంపెని ఒకటి తయారుచేస్తూంది. ఈ యంత్రాల తయారులో నుటికి ఎనభైవంతులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

కార్మికులకై ట్రావెలింగ్ ఆసుపత్రి

ఒక ఫ్యాక్టరీనుంచి మరొక ఫ్యాక్టరీకి చొప్పున, కార్మికస్థానాలన్నిటికీ తిరుగుతూండే ఈరకం టూరింగ్ ఆసుపత్రిలో ఒక మోటారుమీదే కావలసిన డాక్టరు, నర్సు, డిస్పెన్సరీ అన్నీ ఉండేటట్టు చేశారు. బకింగ్‌హామ్ షైరులోని, 300 ఫ్యాక్టరీలకు ఈ హాస్పిటల్ బస్సు రోజూ తిరిగివస్తూంటుంది. ప్రథమ చికిత్సకే కాక, చాలామటుకు, పెద్ద ఆస్పత్రి ఉండే తదితర వైద్యపరికరాలనుకూడా చాలామటుకు ట్రావెలింగ్ ఆస్పత్రిలో అమర్చారు.





కొత్త బ్రిటిష్ ట్రాక్టరు

ఈ కొత్తరకం బ్రిటిష్ ట్రాక్టరును, బ్రిటిష్ వ్యవసాయిక పనిముట్ల కర్మాగారం వారొకరు తయారుచేశారు, ఈ ట్రాక్టరులో నాగళ్లు క్రేనులు, మొదలైన అనేకకర్షకోపయోగకర సాధనాలు అన్నీ అమర్చి ఉన్నాయి.

Regd. No M. 4478

గాంధీ మహాత్ముని

ఆత్మకథ

ప్రథమ ద్వితీయ సంపుటములు

[చతుర్థ ముద్రణము]


శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ద్వితీయ సంపుటము తయారై ఉన్నది త్వరపడుడు

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా వెల రూ. 5-9-0

ఒకేసారి **2** సంపుటములు పోస్టేజితో రు **10-12-0**



శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు

ఐదవ ముద్రణము



సంస్కృతమూలము, తెలుగున టీకా తాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు

వెల రు 4-0-0 లు.

తపాలాఖర్చు రు. 0-9-0.

పోస్టుబాక్సు **212**, **ఆంధ్రగ్రంథమాల** మదరాసు **1**.

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౭౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్య" వరకును గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౮, ఇతరపటములు ౧౩౪, వివిధ విషయములు ౮౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౭౦౦ లకు మించిన పుటలు కలవు. "అ" మొదలుకొని "అశ్విని" వరకు గల విషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౨ అమరావతీ స్తూపమునకును ౨ అనాహతమునకును చెందినవియు, ౭ దేశచిత్రపటములును గలవు ఇవిగాక మరి ౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళానంపదను వ్యక్తముచేయు అమరావతీస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీ శిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయమను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేఱువేఱు హస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందుమట్చ్రక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆయా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౨౫౦కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౮౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను బంగారు రేఖలతోడను సంపుటీకృతము. ప్రతిసంపుటమున ౭౦౦ పుట లుండును.

ప్రతి సంపుటము వెల రూ. ౧౦.

పోస్టు ఖర్చులు: రూ. ౦-౧౦-౦.

రైలు ద్వారా దగ్గర చోట్ల ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీధి, మదరాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madras